
# ఆంధ్రజ్యోతి



ఆగష్టు '45 6 అణాలు




తారాగణం: జయమ్మ, సరితాదేవి, హేమలత, లింగమూర్తి, రాయప్రోలు,
న్యాపతి, దొరసామి, రాఘవన్ మొదలైనవారు.

*Producers:* SRI RENUKA FILMS LTD. :: MADRAS

## ఈ సంచికలో కొందరు రచయితలు

| | |
|---|---|
| ఖాసా సుబ్బారావు | చలం |
| మునిమాణిక్యం | క. స. |
| కుటుంబరావు | గోఖలే |
| యస్. అన్నపూర్ణాదేవి | శ్రీ. శ్రీ. |
| కె. కృష్ణమూర్తి | శరత్‌బాబు |
| యజ్ఞన్నశాస్త్రి | ప్రేమచంద్ |

---

## ఆంధ్రజ్యోతి నిబంధనలు

- **చందాదారులకు:** ఆంధ్రజ్యోతి సంవత్సరం చందా సంక్రాంతి సంచికతో రు 5-0-0. అర్ధసంవత్సరం రు 2-12-0. వి. పి. ద్వారా అయితే మూడణాలు ఎక్కువ అవుతుంది. మాదిరికాపీ కావాలంటే ఆరణాల తపాలా బిళ్లలు పంపాలి.

- **వ్యాసకర్తలకు:** వ్యాసకర్తలు తమ వ్యాసంతోపాటు 0-0-9 బిళ్ల పంపితే ప్రకటించదలచని వ్యాసాలు తిప్పి పంపుతాము. ప్రకటించదలిస్తే తెలుపుతాము.

- **ఏజంట్లకు:** ఏజంట్లు కాగోరువారు ఆఫీసు మేనేజరుకు వ్రాసి ఏజంట్లఫారం తెప్పించుకోవచ్చును. ఆ నిబంధనలకు ఒప్పుకున్న మీదటనే వారి ఏజన్సీ ధృవపరచబడును.

- **ప్రకటనదారులకు:** ఆంధ్రజ్యోతిలో ప్రకటన చేయదలచుకున్న వారు మేనేజరుకురాస్తే ప్రకటనలరేట్లు పంపుతాము. కాని ప్రకటన చూసినమీదటనే అది వేయదగినదీ లేనిదీ నిర్ణయించబడుతుంది.

మేనేజరు: ఆంధ్రజ్యోతి,

43. ఆచారప్పన్‌స్ట్రీట్, జి. టి. మద్రాసు.

# త్వరలో విడుదల!


కన్నాంబ..
గౌరీనాథశాస్త్రి.. మాలతి..
అద్దంకి.. కృష్ణమూర్తి....
నటించిన.
మాయామచ్ఛీంద్ర
DIRECTION
P. PULLIAH.
A FAMOUS CINE & STAR COMBINES JT. PRODNS., 19.A WOODS ROAD MADRAS..

# ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక.....

సంపాదకుడు : చక్రపాణి

సంపుటి 5] ఆగస్టు 1945 [సంచిక 2

## ప్రకాశం పంతులుగారు

ప్రకాశంగారు స్వరాజ్యపత్రికా సంపాదకులుగాను, విజ్ఞ రాజకీయవేత్తగాను, కాంగ్రెసు ప్రభుత్వంలో మంత్రిగాను నాకుతెలుసు.

నాకు పత్రికారచనకు దారిచూపింది ఆయనే. ఎవరో వొకరు పాపమని దయతలచి ఆయనతో నన్నుగురించి సిఫార్సుచేశారు. ఆసంగతి అప్పుడు నాకు తెలిసిందికాదు. కాని ఆయన దేవతలవంటివాడు. ఒకపని అనుకోవడమే ఆలస్యం; అది తక్షణం జరిగితీరవలసిందే. ఒకనాడు హటాత్తుగా ఆయనవద్దనుంచి నాకొక టెలిగ్రాంవచ్చింది—తక్షణం తన్ను చూడవలసిందని.

ఆనాడు ఆరంభమయింది—స్వరాజ్య సంపాదకీయవర్గంలో మా యిద్దరి అన్యోన్యబాంధవ్యం. ఈజీవితం పది సంవత్సరాలపాటు సాగింది.

ఈ తంతివార్త వచ్చినప్పుడు నేను నెల్లూరిజిల్లా పల్లిపాడు ఆశ్రమంలో కాలంగడుపుతూ ఉండినాను. ఆ యాశ్రమానికి జీవం దిగుమర్తి హనుమంతరావు గారు. ఆశ్రమ కార్యసాధనశక్తి అంతా సి. వి. కృష్ణగారిలో ఇమిడిఉండింది. శ్రీకృష్ణగారు ఆనాడు పూర్తిగా గాంధీ తత్వంలో మునిగి, తుట్టతుదకు శ్రీ అరవిందాశ్రమంలో తేలారు. ఈనాడచ్చట యోగసాధకులుగా ఉంటున్నారు.

హనుమంతరావు ఒక అపూర్వవ్యక్తి. నా పరిచితులలో వృత్తమోత్తముడు. ఆయనపేరు అంతగా పైకిరాలేదుగాని ఆయనతో సన్నిహితసంబంధం కల వారందరు ఆయనను అమితంగా గౌరవించేవారు. అమాంతం పూజించేవారుకూడా. ఎవరికైనాసరే ఆయన్ను ఎరిగినమాత్రాన్నే ఆయనమీద విశ్వాసం ప్రేమ పుట్టక పోదు. తన్ను నమ్మినవారికి ప్రాణాన్నైనా ఇవ్వడానికి వెనుకదీయని మహా పురుషుడు. పేరుకు ఏమతానికిసంబంధించినవారుకారు. తను నాస్తికుడననే చెప్పు కొనేవారు. కాని తనజీవితంలో ప్రతివిషయాన్ని నియమితపద్ధతిలో నడిపేవారు. తనకాదర్శంగా ఒకసూత్రాన్ని నిర్ణయించుకొన్నతరువాత ఏమాత్రం ఇటు అటు సంచలించక దృఢనిశ్చయంతో దాన్ని అనుసరించే ధీరుడు. ఆపంథాకు ఎదురే మైనావస్తే, నిర్మొహమాటంగా ప్రాణం బలిఇచ్చిఅయినాసరే దానిని తోసి వేసేవాడు.

జీవితంలో ఈలాంటి ఆదర్శంవుండబట్టే ఆయన తన పరిచయులందరినీ సహోదరులవలె చూడగలిగేవారు. ఆయన సామాన్యంగా తనదగ్గరకువచ్చిన

ప్రతివారికి చూపే ప్రేమ మాతృప్రేమను మించే దని చెప్పవచ్చును. కేవలం మహాత్ముడనతగిన నిష్కల్మషకర్మయోగి. ధనికవాదమంటేమాత్రం హనుమంతరావుకు అపరిమితద్వేషం. కాని ధనికులైనంత మాత్రాన ఎవరిని ద్వేషించేవారుకారు. ఆయనకు ఆప్తులైన మిత్రులలో లక్షాధికారులుకూడా కొంతమంది ఉండేవారు.

కీర్తిశేషులయిన శ్రీ హనుమంతరావును గురించి ఇప్పుడింత చెప్పవలసిన అవసరమేమిటి? ప్రకాశంగారిమీద వ్యాసంలో? అంటే—నన్ను స్వరాజ్యాలో చేరవద్దని సలహా ఇచ్చినా డాయన. ఆలోచనలేని సలహా ఎప్పుడూ ఇవ్వ డాయన. స్వరాజ్యాలో నన్ను చేరివద్దనడానికి కారణం? దీన్ని ఈవిధంగా ఆలోచించా డాయన—'స్వరాజ్యా వాటాల పెట్టుబడితో నడపబడుతున్న పత్రిక. గనుక అదీ ఒక ధనికవాదుల పెట్టుబడి సంస్థ. సత్యాగ్రహాశ్రమంలో నుంచి ఒక పెట్టుబడి సంస్థలోకి వెళ్లడం పతనంతప్ప మరేమికాదు.' ఈవిధంగా నాతో వాదించా రప్పుడు హనుమంతరావుగారు.

తదుపరి అనుభవాలనుబట్టి జీవితాన్ని సింహావలోకనం చేస్తే నాకు సంభవించిన పతనచర్య లన్నిటిలో ఇది బహుస్వల్పమైనదని తోస్తుంది. ఆ సమయంలో మాత్రం మరొకరి కేదో ద్రోహంచేసినట్టు అశాంతి నామనస్సును చాలా బాధ పెట్టింది. తాను పూజిస్తున్న ఆదర్శమూర్తి మాటను ఉల్లంఘించవలసి వచ్చినప్పుడు కలిగే మనోబాధ ఏలాంటిదో అనుభవంవల్ల అప్పుడే ప్రప్రథమం తెలుసుకో గలిగాను. జర్నలిజంమీది వ్యామోహంవల్ల ఇటు బాధపడుతూనైనా ఆశ్రమాన్ని వదిలేసి వచ్చాను.

జర్నలిజంలో పనిచేసేవారికి అపరిమితమైన ఆనందమిచ్చే అనుభవాలుంటాయి. కాని జర్నలిజ మనే దేవత, తన్ను ఆరాధించేవారు అన్ని కష్టాలకు ఓర్చి విసుకులేక ఏకముఖంగా బానిసతుల్యులై తన్ను కొలిచినప్పుడే. వారికి ఇలాంటి గగుర్పాట్లను ప్రసాదిస్తుంది. ఆ దేవతకు పూర్తిగా బద్ధులై సేవచేసి ఈ ప్రసాదమును పొందినవారే జర్నలిజంయొక్క అమూల్యతను తెలుసుకో గలుగుతారు.

ఇంకొక విషయంకూడా స్వరాజ్యాలో చేరిన కొద్దికాలంలోనే తెలుసుకో కలిగాను. అదేమిటంటే పెట్టుబడిదారి తత్వానికి స్వరాజ్యపత్రికకు చాలా దూర మని. ఇందుచేత పూర్వపు అశాంతి అంతా ఎగిరిపోయి మనశ్శాంతి తిరిగీ కుదిరింది. ప్రకాశంగారివలె వార్తాపత్రికా పరిపాలనలో ఏ ప్రతిఫలాన్ని ఎదురు చూడకుండా అంత పెట్టుబడిపెట్టిన వ్యక్తి ఇంతవర కెవరును లేరు. ఇకమీద ఉండబోరుకూడా. ఈ విషయంలో ఆయన అద్వితీయుడనే చెప్పవచ్చును. నూతన పద్ధతుల ననుసరించి నడపవలసిన వార్తాపత్రికలమీద చాల్తాధనం వెచ్చించవలసి ఉంటుంది. తన స్వంత ఆస్తిని లాభాపేక్షలేక ఇలాంటి సంస్థకుగాను ఖర్చుచేసినది ఒక్క ప్రకాశమే అని సుమ్మాటికి చెప్పవచ్చును. సత్యాగ్రహోద్యమానికి పూర్వం తాను వకీలు ఉద్యోగంలో సంపాదించిన తన యావదాస్తి దాదాపు మూడులక్షల రూపాయలను ఈ పత్రికోద్ధరణలోనే వ్యయపరచిరని తెలుస్తుంది. లాభాపేక్షగల ధనికవాదులలో ఇటువంటి మహత్తరత్యాగం అసంభవం. ప్రజలకు ఈ త్యాగియెడ ఒక అపూర్వమైన సానుభూతి ఏర్పడింది. ఈయనతో ఈ పత్రికద్వారా సంబంధమేర్పరచుకొన్నవా రెవరుగాని ఈయనను

సాధారణ ధనికవాదులతోబాటు చూడలేకపోయారు. ప్రజలు స్వరాజ్యాను తమ స్వంత పత్రికగా చూడ నారంభించారు. ఈ వాతావరణంలో వాటాదారులు లాభాలను అపేక్షించడమనేది ఎప్పుడు జరగలేదు. డబ్బు ఇచ్చినవారందరు విరాళాలనే భావంతో ఇచ్చారుగాని వేరొకవిధంగా కాదు. ప్రజాసేవకుగాను ఏర్పడిన ఈపత్రికను ఒక అపూర్వసంస్థగా భావించి దానికి సంతోషంగా అందరూ కానుకలర్పించారు. ఇచ్చినదాత లెవరికీ లెక్క లడగవలసిన ప్రమేయ మేర్పడలేదు.

ప్రకాశంగారికి తానొక వ్యాపారకళా నిపుణుడనే భ్రాంతిమాత్రం ఇప్పటికీకలదు. సర్వసాధారణంగా అమాయకులు ఇతరులు తమ్ము మోసం చేయ గలరని యెప్పుడూ అనుకోరు. అలాగే ప్రకాశంగారుకూడా. రూపాయలు కూడ బెట్టకలిగిన వ్యాపారకళానైపుణ్యాల కుండవలసిన దమ్మిడీలపై జాగ్రత్త ప్రకాశం గారిలో యెక్కడా కనిపించదు. వ్యాపారంలో విజయం పొందాలంటే ప్రతి చిన్న విషయం జాగ్రత్తగా పరిశీలించాలి. లెక్కలు సక్రమంగా ఉండాలి జమాఖర్చులు మాటిమాటికి సరిచూచుకోవాలి. వీటన్నిటిలో ప్రకాశంగారికి అనుభవం సున్న. ఫలితం—పత్రికకు దినగండం. ప్రజాసానుభూతి కేం కొరత లేకపోయినా చివరికి పత్రిక ఆగిపోవలసి వచ్చింది.

మేనేజ్మెంటు అటుంచితే స్వరాజ్య పత్రికమాత్రం ఆ రోజులలో ప్రజల జీవితంలోనూ రాజకీయ విషయ ప్రబోధంలోనూ చక్కని స్థానం ఏర్పరచుకొంది. పత్రిక ఉచ్ఛస్థితిలో వున్నప్పుడు ప్రతిరోజు సాయంకాలం దినపత్రిక కొరకు చూచే ప్రజాసమూహము ఆతురతతో ఆఫీసుగేటువద్ద కిటకిటలాడుతూంటే చుట్టు ప్రక్కల బండ్లన్ని ఆగిపోవలసి వచ్చేది. ఇంకే పేపరాఫీసులోనూ ఈలాంటి దృశ్యాన్ని చూచి యెరగను. కష్టాలపాలై అణగద్రొక్కబడిన ప్రజానీకానికి తమ సమస్యలపై యెడతెగని ఆందోళన సాగించుటకు ఒకగొప్ప సాధనంగా వుండేది ఈ పత్రిక. ధనోన్మత్త స్వార్థపరాయణు లెవరుగాని యజమాని అండలో నున్నామనే ధీమాతో సంపాదకీయ వర్గంయొక్క మనోవాక్ స్వాతంత్ర్యాన్ని అడ్డుపరచలేకపోయారు. ఈసంస్థలో పనిచేసేవారందరు ఒకే కుటుంబం లోనివారుగా అన్యోన్యంగా వుండేవారు. ఒకరిమీద ఒకరు చాడీలుచెప్పడం అనేదిలేదు. సామ్రాజ్యవాదంయొక్క మూర్తీభవించిన స్వరూపమైన బ్రిటిష్ ప్రభుత్వం దగ్గరనుంచి ఏలాంటి నిరంకుశత్వాలైనా ఎదుర్కొనేవారు. పీడిత ప్రజలకు ప్రాణప్రియమైనది ఈపత్రిక. అన్యాయాలను బహిరంగపరిచి ఎదుర్కొన డానికి విశ్వసనీయమైన చేయూతని ప్రఖ్యాతి పొందింది స్వరాజ్య. కనుకనే స్వరాజ్య సంపాదకీయ సాంప్రదాయం గర్వింపదగిన విషయమయింది.

కాంగ్రెసు వాతావరణాన్ని దక్షిణ హిందూస్థానంలో నిర్మించడంలో ఈ పత్రిక చాలా కృషిచేసిందని చెప్పక తప్పదు. ముఖ్యమైన సమస్యలు చర్చకు వచ్చినప్పుడు మీనం మేషం లెక్కిస్తూ గోడమీద పిల్లి వాటంగా రాసేఅలవాటు స్వరాజ్య పత్రిక చరిత్రలో యెప్పుడూ లేదు. ప్రకాశంగారు ఈ పత్రికతరఫున చెన్నరాజధానే కాదు-బర్మా, సింహళం, ఇండోచైనా మొదలగు దేశాలుకూడా పర్యటనంచేసి స్వరాజ్య నామశబ్దమును దశదిశలు మారుమ్రోగునట్లు చేశారు. గ్రామ గ్రామానికి ఈ పత్రికఖ్యాతిని వెల్లడించారు. ప్రతిసారి పర్యటనంచేసి

వచ్చినప్పుడు ఆయన ఆయా ప్రదేశాలలోని ప్రజల కష్టసుఖాలను వారిజీవితానుభవాలను తెచ్చేవారు. సంపాదకీయ వర్గానికి ఆందోళన, ప్రచారాలకు కొత్తకొత్త విషయాలు తెచ్చేవారు. పత్రికలో ఈ విషయాల పరిశీలన చదువరులకు చాలా వుత్సాహం కలిగించేది. ఎల్లప్పుడు పత్రిక ప్రకాశంగారి అనంతోత్సాహంతో ఉజ్జీవితయై విలసిల్లిపోయేది. "జిల్లావార్త"ల ప్రాముఖ్యతనుగురించి తరుచు హెచ్చరిస్తూండేవారు. ఇంటిముందుజరిగే సంగతులకు చోటులేదని దేశాంతర దూర వార్తలకు ప్రాముఖ్యత ఇవ్వడమంటే ఆయన సహించేవారు కారు.

చాలాయేండ్లు నేను స్వరాజ్య పత్రికలో సంపాదకీయాలు వ్రాస్తూవచ్చాను. ఇన్నియేళ్లలోను ఒక్కసారిమాత్రమే నేను వ్రాసినదానిలో ఒక చిన్నమార్పును ప్రకాశంగారు సూచించారు. తనక్రింద పనిచేసేవారియొక్క ప్రతిష్ఠ నెంతో గౌరవంగా చూచేవారు. వారితరుల స్వాతంత్ర్యాలలో అనవసరంగా జోక్యం కలిగించుకొనేవారుకారు. ఈరోజుల్లో పత్రికాప్రపంచంలో సంపాదకీయాధికారులు, ముఖ్యంగా స్వంతదారులే అధికారాన్ని చేబట్టినప్పుడు, రచయితలను యంత్రప్రాయులుగాను ప్రతిభాశూన్యదాస్యులుగాను చేయటం పరిపాటి అయిపోయింది. ఉదాహరణంగా చెప్తున్నాను. ఒకరచయిత ఈరోజు పత్రికా ప్రపంచంలో అగ్రగణ్యస్థానంలో వున్నాడు. కొన్నేండ్లక్రిందట అతను మరొకరి అధికారంలో పనిచేస్తుండేవాడు. అప్పుడొకనాడు అధికారి అతను వ్రాసిన వ్యాసాన్ని చింపిపారవేసి అందుకు కేవలం వ్యతిరేకాభిప్రాయాన్ని పాటిస్తూ మరొకవ్యాసాన్ని వ్రాయమని అన్నాడు. రచయిత ఆ ఆజ్ఞను శిరసావహించి తనస్వాతంత్ర్యాన్ని దిగమ్రింగి అధికారి మాటకు జోహుకుం అన్నాడంటే యెందుకు? పొట్టకూటికేగా? ఈలాంటి పొట్టపోసుకోడాని కని రాసేరాత రచయితల మనశ్శక్తిని, దేహశక్తిని, వాక్శక్తిని నాశనం చేస్తుందని ప్రత్యేకంగా చెప్పాల్నా? ఈలాంటి అనుభవాలు స్వరాజ్య సంపాదకీయ వర్గంలో చేరినవారికెవరికి యెప్పుడు కలగలేదు.

ఒకనాడు ఒక ధనికవ్యక్తి—వీరు స్వరాజ్యాకు విరాళంగా పెద్దమొత్తమిచ్చినవారు — పత్రిక తన్ను వ్యతిరేకించి విమర్శించిం దని ఫిర్యాదుచేశారు. దానికప్పుడు ప్రకాశంగారిచ్చిన బహిరంగ ప్రత్యుత్తరం నాకు జ్ఞాపకమున్నంతవరకు వారిమాటలలోనే చెప్తాను: "స్వరాజ్యాకు విరాళాలు అన్నివర్గాలకు చెందినవారు యిచ్చారు. ఆ విరాళాలు యిచ్చినవారిలో జస్టిస్‌పార్టీవారున్నారు. ప్రభుత్వోద్యోగులుకూడా వున్నారు. కాని ఈ విరాళాలు తీసుకోడానికిన్ని పత్రికయొక్క పాలిసీ కిన్నీ యేమి సంబంధంలేదు సుమా. ఇంకొక రహస్యం చెప్పనా? నేను తప్పుచేసినప్పుడు నన్నుకూడా పత్రిక విమర్శించడానికి వెనుకదీయదు." ఇంతటి గౌరవోపేతమైన అభినందాన్ని తన ఔన్నత్యాన్ని గమనించక తనక్రింది సంపాదకీయ వర్గానికి వెల్లడిగా ఇట్లు చాటించగలిగిన మరొక సంపాదకుణ్ణి నే నింతవరకూ ఎరుగను.

చట్టసభలలో వాగ్వివాదలు జరుపునప్పుడు ప్రకాశంగారు చూపే ప్రతిభాకౌశలాలకంటే వారు గ్రామాంతరములలో పర్యటనచేసి ప్రజాసామాన్యంలో రాజకీయప్రచారం సాగించే టప్పుడు వారుచూపు వుత్సాహ వుద్రేకాలు చాలా ఎక్కువ ప్రకాశంగా వుంటాయి. ఆంధ్రదేశంలో ఆయన వెళ్ళని గ్రామంలేదని

చెప్పవచ్చు. ఇలాంటి పర్యటనం అంటే ఆయనకు సర్దా. ప్రయాణం చేసేటప్పుడు అలసట నేది ఆయన యెరగడు. రైలుంటే రైలు. కారుంటే కారు. ఇలాంటి సాధనాలు లేనప్పుడు ఎడ్లబండి. అవి యేవి లేకపోతే—మన ఆంధ్రదేశంలో ఎక్కువ గ్రామాలకు సరియైన రోడ్లుగూడా లేవనే సంగతి అందరికి తెలుసు గదా-పొలాల్లోపడి నడవడమే. ఎండవాన అనక వుత్సాహంగా తిరిగేవారు. ఎంతకష్టానికైనా ఓర్చి ఏలాంటి భోజనంతోనైనా కాలం గడిపేవారు. గృహస్థులు తనకిచ్చే ఆతిథ్యమేలాంటిదైనా సంతోషంతో స్వీకరించి వారిని సంతుష్టి పరచేవారు. వారికి అనవసర వ్యయప్రయాసలు కలిగించరు. ప్రజలతో చక్కగా కలిసి మెలిసి వుంటూ వారి కష్టసుఖాలను తనవిగానే భావిస్తూ వారి నిత్యజీవనంలో సంతుష్టిగా పాల్గొంటారు. గాంధీగారి గ్రామపునర్నిర్మాణ కార్యక్రమంలో ఆయనకు అత్యంత భక్తివిశ్వాసము. స్వరాజ్యమంటే ఆయన దృష్టిలో గ్రామ స్వయంపోషకత్వమే. అపాయమేదైనా యెదుర్కొన్నప్పుడు వారి శక్తిని చూడాలి. అచంచలమైన వుద్రేకంతో కార్యరంగములోకి ఉరికి నిరుత్సాహుల హృదయములలో సాహసాన్ని ఉద్రేకింపజేస్తూ ఎలాంటి పిరికిపందలనైనా ధైర్యమవలంబింపచేయగల శక్తిని ప్రదర్శిస్తారు. పిరికికండలేని వీరసింహం ఆంధ్రకేసరి ప్రకాశం.

దక్షిణ హిందుస్థాన ప్రజానీకంలో తదితర నాయకులందరికంటే యెక్కువ పలుకుబడి ప్రకాశంగారిదే. ఆయనలోని లోపాలోపములను ఎంచకుండా ప్రేమిస్తారు సామాన్యప్రజలు ప్రకాశంపంతులుగారిని. ఆయనలో మనకందరికి కనిపించే లోపాలకు మూలకారణం—ఈనాటి రాజకీయ వాతావరణంలో ఏర్పడి సామాన్యమైపోయిన సంకుచిత కుతర్కతత్త్వాన్ని (జయాపజయములు లక్షించక) యెదుర్కొవాలన్న మొండిపట్టుదలే. ఆయన వేసుకొనే కార్యక్రమం మాత్రం చాలా వున్నతమైనదిగానే వుంటుంది. కాని ఆ కార్యక్రమ సాధనకు అవసరమైన వివరాలలోకి వెళ్లేటప్పటికి దరిగానని మహాసముద్రములో పడిపోయినట్లవుతుంది. సూర్యుణ్ణి మింగాలని వురికిన హనుమంతునిమాదిరే గొప్పఆశయాల పట్ల ఆయనచూపే సాహసం. ఆ మానవసింహం ఊహలలో మునిగి దివ్యతరమైన మహదాశయాలలో పరవశుడై పోవడంవల్ల మార్గంలోని ఆటంకాలు ఆయనకు కనిపించవు. ఒకవేళ కనిపించినా, వాటిని పరిశీలించటానికని ఆగరు. ఇలాంటి మూఢవిశ్వాసం అమాయకమైన బాల్యావస్థలో రమణీయంగా కనిపిస్తుంది. ప్రకాశంగారు ధీమంతులు, దృఢమనస్కులు, ఎంతటికష్టానికైనా వోర్వగలశక్తిని ప్రదర్శిస్తారు, గంభీరంగా వుంటారు. ఇలాంటి గొప్పవ్యక్తి ప్రదర్శించే మూఢవిశ్వాసాన్ని చూసినప్పుడు మాత్రం ఆయనయెడ మనకు ఒకవిధమైన కరుణాభరిత వాత్సల్యం స్ఫురిస్తుంది. ఒకవైపు వారి శక్తిసామర్థ్యాలను చూచి వుప్పొంగి వుద్రేకులగుచు మరొకవైపు ఆయనయెడ మాతృవాత్సల్యతను చూపుతూ వారిని ప్రేమసముద్రంలో ముంచేసేవారు ప్రజలు. ప్రతివిషయంలోను వారిని ప్రసన్నవైఖరితో వుపలాలించేవారు. తదితర నాయకుల యెవరియెడ ఇలాంటి దృక్పథం ప్రజలకు కలలోకూడా కలగడం దుస్సాధ్యం.

మంత్రిపదవిలో ప్రకాశంగారు అమోఘమైన కార్యదీక్షను ప్రదర్శించారు. ఒక నిర్మాణాశయాన్ని ముందిడుకొని తమ పరిపాలనావిధానంలో ఆ ఆశయాన్ని

సాధించటానికి పూనుకొని పనిచేసినవారు రాజాజీ, ప్రకాశంగార్లు మాత్రమేనని నొక్కి చెప్పవచ్చు. వీరిద్దరిలో అధికారబాధ్యత ప్రకాశంగారిమీద తక్కువగా పడటంవల్ల వారు గొప్ప ప్లాన్సు వేయటంలో ఎక్కువ వుత్సాహాన్ని చూపించారు. కుర్రమంత్రులలో కొందరు ప్రభుత్వోద్యోగులను చూచినప్పుడు కొంత్త పిరికాడే వారు. ప్రకాశంగారుమాత్రం జిల్లా అధికార్లను ఐ. సి. యస్. ఆఫీసర్లను వారి యథోచిత స్థానాలలో వుంచి వారందరు ప్రజాసేవకులే అనేవిషయాన్ని వారిచే గుర్తింపజేశారు. ఇందుమూలాన దేశంలో సామాన్య ప్రజలలోకూడ తమయొక్క ఔన్నత్యంమీద నమ్మకమేర్పడింది. ఇంక కొద్దికాలం కాంగ్రెసు ప్రభుత్వం వుండివుంటే, తరతరాలనుంచి జమీందారి దోపిడివల్ల భాధపడుతున్న పీడిత రైతాంగమునకు దాస్య శృంఖాలనుండి విముక్తిమార్గం చూపెట్టి మన రెవెన్యూ మంత్రి శాశ్వతగౌరవాన్ని పొందేవారు. కాని అది అలాగు జరగలేదు.

ఈనాడు తిరిగి కాంగ్రెసువారు పదవీస్వీకరణ చేస్తారనగానే, వుద్యోగాపేక్షయే తమ ప్రత్యేకాశయంగా కలిగిన కొందరు కాంగ్రెసువాదులు ప్రకాశంగారిని యేలాగైనా తమ దారిలోనుంచి వైతొలగించి తాము ముందుకురావలనే దురాశతో కుతంత్రాలు పన్నాగాలు వేస్తున్నట్లు తెలియవస్తున్నది. దక్షిణ హింధూస్థానంయొక్క శ్రేయస్సు, పురోభివృద్ధి రాజాజీ ప్రకాశంగార్ల అన్యోన్య ఐక్యతమీదనే పూర్తిగా ఆధారపడి వున్నదని నా దృఢనమ్మకం. ఈ నాయకులిద్దరిలో సాంప్రదాయంగా యేర్పడివున్న త్యాగదీక్ష దేశాభిమానం, స్వార్థత్యాగం వీరిద్దరి ఐక్యసమాలోచనలకు దారిదీయక తప్పదు. ఉత్సవిగ్రహాలందరికీ ఈ మహారథులిద్దరిని కంటకపరచే కుతంత్రాలను మానుకోమని ఇదియే నా హెచ్చరిక. పార్టీ నిర్మాణాత్మకమైన ప్రజాప్రతినిధుల అండ కాంగ్రెసు నాయకులకు అత్యావశ్యకమైన విషయం నిజమే. కాని పార్టీపేరు పెట్టుకొని తప్పుడు త్రోవలు త్రొక్కడం పరిపాటి అయిపోయింది. ఒకవైపు పొట్ట పోసుకోవడానికి సహజంగా ధనహీనులు ధనవంతుల అండచేరడం; మరొకవైపు, మీకేదో మేం ఒరిగించి ఉద్ధరిస్తామనే వారిచుట్టూ మూగడం. కాని ప్రకాశం నాయకత్వంయొక్క గొప్పతనం యేమంటే, తన అనుచరులకెవరికి స్వార్థాపేక్షకు చోటివ్వడు. తన్నునమ్మి దేశసేవ కుద్యుక్తులైనవారికి లోకాయతనమైన ప్రతీకారం చూపటం ఆయన పంథాకాదు. వారి అనుచరులకు ప్రతిఫలం—వారు దారితీసిన అసమాన సహనమైనా కావాలి. లేదా, ప్రతిఫల శూన్యమైన కార్యదీక్షలో బలి కావటమైనా కావాలి. చాలాసార్లు వారు లోభులను త్యాగులుగాను, భీరులను శూరులుగాను, స్వార్థపరులను ఉదారస్వరూపులుగాను, విముఖులను సుముఖులు గాను, మార్చగలిగారు. ఈదివ్యప్రభావానికి కారణం-నిత్యసన్నిహితమైన ప్రజా సంచయంలోనుంచి వుద్భవించినవారి ఆకర్షణాశక్తియే. ఆంధ్రదేశంలో ప్రజా హృదయాలనుఉర్రూతలూగించి వారి ప్రేమాభిమానాలనుచూరగొన్న నాయకుల్లో ప్రకాశంగారిదే ప్రముఖస్థానం. ఆంధ్రప్రజానీకానికి వారియెడ దృఢంగా యేర్పడిన ప్రేమపూరితమైన ఆదరాభిమానమే వారి రాజకీయ విజయానికి అమోఘమైన ఆయుధం.

# కబుర్లు

★ కె.స.

పది సంవత్సరాల తరువాత ఇంగ్లండులో ఎన్నికలు జరిగాయి. అయిదేళ్ళపైగా ఇంగ్లండుకు నాయకత్వము వహించిన చర్చిల్ పార్టీ ఓడ్పుకుపోయింది. బ్రహ్మాండమైన మెజారిటీతో లేబరుపార్టీ గెలిచింది. ఈ అయిదేళ్లూ ఇంగ్లండు యుద్ధ కార్యక్రమాలను జయప్రదంగా సాగించి, నడిసముద్రములో మునిగిపోవలసిన ఆ దీవిని ఆదిశేషుడిలాగ తనభుజాలమీద నిలబెట్టిన వ్యక్తి చర్చిల్, అలాటివ్యక్తి నాయకత్వంగలపార్టీ యీ ఎలక్షనులో గెలవకపోతుందా అని అందరుఅనుకున్నారు.

ఈ యుద్ధకాలంలో, అటు జర్మనీని ఓడించిన ప్రతిష్ఠా, ఇటు జపానును ఓడించవలసిన బాధ్యతా తనదే కనక, తనపార్టీనే ప్రజలు ఎన్నుకుంటారని చర్చిల్ విశ్వసించక పోలేదు. లేబరుపార్టీని పేరువూరులేకుండా చెయ్యడానికి, ప్రజలకు ఏమేమి చెప్పాలో అవన్నీ చర్చిల్ చెప్పకపోలేదు. చర్చిల్ పట్ల ప్రజలకు గౌరవమూలేకపోలేదు. అంచేత ఆయన్నుమాత్రము ఎన్నుకున్నారు. మిగతావారిలో మాత్రము, ఇద్దరుతప్ప మిగతా కన్సర్వేటివ్ మంత్రులంతా, కలికంలోకి రాకుండాపోయారు. అసలుపార్టీయే చాలా దారుణమైన దెబ్బ తిన్నది. ఇదివరకువున్న బలములో సగముకూడాలేకుండా, మూలబడింది.

దీనికంతకూ కారణము ఏమిటి?

హిట్లరు, ముసోలినీలకు మొదట్లో దోహదమిచ్చింది కన్సర్వేటివ్ పార్టీ. సామ్రాజ్య విధానాన్ని విడిచిపెట్టలేక, నియంతృత్వాలకు సహాయముచేసి, ఇంగ్లండుకూ, ప్రపంచానికీ ముప్పు తెచ్చిన యుద్ధాన్ని రాకుండా చెయ్యలేకపోయినపార్టీ, యీ యుద్ధానంతరం సక్రమమైన విధానాన్ని అమలులోపెట్టలేదనే విశ్వాసము ప్రజలలో పూర్తిగా కలిగివుండాలి. సామ్రాజ్య పరిపాలన, విదేశాంగ విధానాల విషయంలోకంటె, ఇంగ్లండు నేడు ఎదుర్కొన్నసమస్యలు, ముఖ్యంగా బ్రిటిష్ ప్రజానీకానికి సంబంధించినవి చాలా ఎక్కువగా ఉన్నాయి. జర్మన్ విమాన దాడులకు గురియై పోయిన వేలకొలది యిళ్ళను, మళ్ళీ కట్టవలసివుంది. జపానుతోకూడా యుద్ధం పూర్తికాగానే, మళ్ళీ యింటికి తిరిగివచ్చే సైనికులకు వుండటానికి యిల్లూ, చెయ్యటానికిపనీ చూపించగల ప్రభుత్వం ఇంగ్లండుకు కావాలి. కేవలం ధనస్వాముల పార్టీ అయిన కన్సర్వేటివ్‌పార్టీ యీపని చెయ్యగలదా? వెయ్యిమంది బీదవాళ్లు వుంటేగాని, ఒక ధనికుడు వుండటం అసంభవము. నిరుద్యోగులు ఎక్కువమంది వుంటేనేగాని, చౌకగా ఉద్యోగాలకు వచ్చేవాళ్లువుండరు. జీతాలు తక్కువ ఇస్తేనేగాని, పెట్టుబడిదారులకు లాభాలు యెక్కువగిట్టవు.

పెట్టుబడిదారులమయమైన కన్సర్వేటివ్ పార్టీ, వారిక్షేమాన్నిమరచి ప్రజాబాహుళ్యపు క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏపనయినా చెయ్యగలదా?

ఈసత్యాన్నిగుర్తించే, బ్రిటిషపౌరులు లేబరుపార్టీని ఎన్నుకున్నారు. లేబరుపార్టీ యీ బాధ్యతను ఎంతవరకు నిర్వహిస్తుందో మనం ఇకముందు చూడవలసిన విషయము.

ఆరువేలమైళ్ళ దూరములో జరిగిన యెన్నికల ఫలితముగా, మనదేశములో పరిపాలనా సంబంధమైనకొద్ది మార్పులు జరగవచ్చు. కాని, మనము యిన్నాళ్లూ చూస్తూనేవుండి, ఎక్కువశ్రద్ధగా ఆలోచించని విషయాలు, మనము తీవ్రముగా ఆలోచించేటట్లు, ఈ ఎన్నికలలో బ్రిటిష ప్రజలు చూపిన మనఃప్రవృత్తి చేసింది. మనదేశపు సైనికులు దాదాపు ఇరవై లక్షలమంది యిప్పుడు, జపానుతో యుద్ధము పూర్తికాగానే ఉద్యోగాలకోసం ఎదురుచూస్తారు. ఆ ఇరవై లక్షలమంది లోనూ, ఏ అయిదులక్షల మందినో సైన్యంలోనే అట్టేబెట్టినా, పదిహేను లక్షలమందికి పనిచూపించాలి. వీరందరకీ పనిచూపించటమంటే, పూర్వంలాగ రోజుకి పావలా కూలి పనులుకావు. అప్పుడు వీరంతా బ్రతికినపద్ధతి వేరు. ఈఅయిదేళ్ళలోనూ వీరంతా ప్రొద్దున్నా, సాయంత్రమూ కాఫీయో, టీయో త్రాగడానికి అలవాటుపడ్డారు. కాలికి చెప్పులు లేనిదే నడవరు. మంచిగుడ్డలులేనిదే బయటికి రారు. పైగా, యుద్ధంలోకి వెళ్ళి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకున్నారు. అనేక యితరదేశాలకువెళ్ళి, అక్కడిప్రజల జీవితాన్ని చూసివస్తున్నారు. మానసికంగా గొప్పమార్పుతో వీరంతా మళ్ళీ పౌరజీవనంలోకి వస్తారు. వీరికి తగిన ఆదాయంవుండే పనులు చూపించాలి. ఈ సైనికులుకాక, యుద్ధ సామగ్రిని వుత్పత్తిచేసే ఫ్యాక్టరీలలో పనిచేసేవారు, యుద్ధకృషికి అవసరమైన అనేక యితర పరిశ్రమలలో పనిచేస్తున్న వారు, 'యుద్ధము అయిపోగానే మన మాట ఏమిటా' అని యిప్పుడే ఆలోచిస్తున్నారు. వీరందరికీ కూడా పనులు చూపించాలి.

అదృష్టవశాత్తూ, బాంబులవల్ల కలిగే విధ్వంసనాన్ని మనమేమీ అనుభవించలేదు. కాని, మనదేశంలో జనాభానుబట్టి చూస్తే, ప్రస్తుతం వున్న యిళ్ళు ఎంత మాత్రమూ చాలవు. రోడ్లమీదా, చెట్ల క్రిందా, గుడిసెలలోనూ తనువులు పారవేసుకుంటున్న నిర్భాగ్యులమాట అలా వుండగా, యిళ్ళలో వుండటానికి నోచుకున్నవారుకూడా, ఎద్దులకొట్టంలో లాగ నలుగురు వుండవలసిన యింట్లో ఇరవై మంది చొప్పున, హాయిగా జీవించడం కోసం యెత్తిన యీ జన్మను తరింపజేసుకుంటున్నారు. విశాలంగా కూచోడానికీ, యెడమెడంగా పడుకోడానికి తగినంత జాగా, ప్రతి కుటుంబానికీ వుండేటట్టుగా, కొన్ని లక్షల యిళ్ళను మనదేశములో కట్టవలసి వుంది. బర్మా నుంచి బియ్యము రాకపోతే మనం పడ్డ అవస్థ మనం ఎరుగుదుము. ఇకనైనా, ఒక క్రమపద్ధతిలో వ్యవసాయం సాగించవలసి వుంది. ఇలాటి అనేక సమస్యలు మనముందు వున్నాయి.

'ఇండియాలో ఎన్నికలు జరిపి, రాష్ట్రీయ ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు జరిపేటట్టు చూడాలి' అని బ్రిటిషు లేబరు పార్టీ ప్రముఖులలో ఒకడు, లిష్టోవెల్ ప్రభువు, ఎన్నికలముందూ, లేబరుపార్టీ విజయానంతరమూకూడా గట్టిగా చెప్పాడు. బహుశా. లేబరుపార్టీ అలా చెయ్యవచ్చును. త్వరలోనే మనదేశంలో ఎన్నికలు జరగవచ్చును.

బలమైన మెజారిటీలేని ఏ రాజకీయ పక్షమూ, తన విధానాలను ఆచరణలోకి తీసుకురాజాలదు. ఎన్నికలకు పూర్వమే, ప్రజలకు తృప్తికరమైన విధానాన్ని సూచించని రాజకీయ పక్షం, మెజారిటీ బలంతో ఎన్నికలలో గెలవలేదు.

ఇప్పటినుంచీ తాము చెయ్యబోయే పనినిగురించి ఒక ప్రణాళికను తయారు చేసుకోవడం, దానిని ప్రజాబాహుళ్యానికి తెలియజెప్పడం, ఎన్నికలలో పాల్గొనదలచుకున్న రాజకీయపక్షానికి అవసరం. కాని, యీ పని చేస్తున్న రాజకీయ పక్షమేదీ ప్రస్తుతం కనపడటంలేదు.

రాజకీయంగా మనకు ప్రస్తుతంవున్న హక్కులు చాలా తక్కువ. అసలు మనకు, ప్రతి మనిషికీ, ప్రతి దేశానికీ ప్రధానమైన స్వాతంత్ర్యమే లేదు. ఈ స్వాతంత్ర్యాన్ని సంపాదించడానికి కృషి చేస్తూనే, చట్టబద్ధమైన సమరాన్ని సాగిస్తూనే, సాంఘిక, ఆర్థిక సమస్యల్ని తీర్చుకుంటూ రావాలి. సాంఘిక, ఆర్థిక సమస్యలను సరిచేసుకోవడంలో జాతి, మతాలకు తావువుండకూడదు. హిందువు రాముణ్ణో, కృష్ణుణ్ణో, శివుణ్ణో ప్రార్థిస్తే; ముస్లిము అల్లాను ప్రార్థిస్తాడు. హిందువుకు భోజనం, బట్ట, యిల్లూ ఎంత అవసరమో, ముస్లిముకూ అంతఅవసరమే. హిందువుకు చదువు ఎలా అనవసరం కాదో, అలాగే ముస్లిముకు కూడాను. జాతి, మత భేదం లేకుండా, హిందువూ, ముస్లిమూ, క్రైస్తవుడూ, మరొకడూ కూడా న్యాయమైన పద్ధతిలో పనిచెయ్యడానికీ, జీవించడానికీ తగిన పరిస్థితులను కల్పించగలిగిన పక్షం, పరిపాలన సాగించాలి. చైనాలో, ముస్లిములు లేరా? క్రైస్తవులు లేరా? వున్నంత మాత్రాన, వారికి మతసంబంధమైన పోరాటాలు వున్నాయా?

మతానికి రాజకీయాలలో ఎప్పుడూ స్థానం యివ్వకూడదు. ఈ విషయాన్ని ప్రజా బాహుళ్యానికి చక్కగా బోధపరచి, ప్రజల ఆదరణను, మునుపటికన్న యెక్కువగా పొందడానికి, మతభేదాలు లేని కాంగ్రెసు ప్రచారకులు పూనుకోవాలి.

విదేశాలకు పోయి తిరిగివస్తూవున్న, మన సైనికుల మూలంగా బ్రహ్మాండమైన సాంఘిక పరివర్తనం మనదేశంలో కలుగబోతున్నది. ఈ పరివర్తనంతో పాటు, రాజకీయ పరివర్తనం కూడా కలిగితే, మనదేశం ఒక మెట్టు పైకి యెక్కుతుంది.



నీరవము రాత్రి, వనసీమ నీరవమ్ము,
శాంతముగనుండె గగన దిశాచయంబు,
అలతివెలుగుల నొసగు తారాళి మినుకు
మినుకని, చరాచరాలు నెమ్మేనుమరచె
గాలియును సోలి కనుమూసె, కరగిపోయె
ప్రకృతియంతయు గాఢ నిద్రాసుఖాన,
కాని కునుకని దీపపు కాంతితోడ
మేలుకొనియున్నదొక పర్ణశాలనాడు.
తరుణజీవనశాంతి నిధానమైన
ఆకుటీరము వనహృదయమ్మువోలె
కన్ను కునుకదు; సకల జగమ్ముజోపు
నిద్దురకు వారి కనులలో నెలవులేదు.
కారణంబేమి, వారలెవ్వారు, దేని
కోసమో వారికేకాంత వాస శిక్ష?
ప్రణయినీప్రియు లిరువురు పావురాల
జంటవలె మేను లొండొంటి నంటుకొనగ
గదిసి కూర్చుండి చూపులు కదపకుండ
కన్ను మూయక యేసమాసన్నభయము
నో దలంచి యోజించుచు నున్నవారు?
వ్యధితమానస, ప్రియురాలు పలుకరించె;



# మిలన్

రామనరేష్ త్రిపాఠి....

ఓయి ప్రియతమా ! ప్రాణనాధాయటంచు.
సాశ్రునయనాలచూచి, బాహోయుగమ్ము
సాచి చెలువుని మెడవై చి-ఆచి ఆచి-
"విజన విపినమ్ములో నన్ను విడచిచనకు,
చనకుమా ప్రాణనాధ! నాపనవి వినుమ.
ఈ వియోగవ్యధా భారమేను లేశ
మేని సహియించలేను - జీవించలేను.

జ్ఞానమెరుగని బాల, శోకానుభవ వి
హీన నబలను కరుణావిహీన విరహ
వధికు పాల్సేకు. నావంటి పావురమ్ము.
నా మనోనాధ: నీ ప్రయాణమ్ముమాట
నేని వినలేను, విడచిపోనీను నన్ను
నిన్ను నాలోన ప్రాణము లున్నవరకు."
ప్రేయసీ ప్రియభాషలు వినిన మగని
మనసు పులకించె, ముఖచంద్ర మండలంబు
మధుర కౌముదీకాంతులు మలచుకొనియె.
చందురుడు చందురుడు వియ్య మందుకొనిరి.
చందురుని గూడు పొదివిన సరణి రమణి
కంఠసీమను పొదువుచు కౌగలించి
సగము విరియు గులాబి పుష్పమ్ముదొరయు



చిట్టిగడ్డము కొనవ్రేళ్ల పట్టి యెత్తి
ఫాలసీమను ముద్దాడి, పలికె నిటుల:
హే సతత సంగినీ! బాల! హే మదీయ
జీవపాలినీ! భయమేల! నీవియోగ
మల్పకాలమ్మె. యిక్కడున్నట్లు రానె.
ఎవరికతమున మనము వైభవము నిల్లు
వదలి యీ దుస్సహైకాంత వాసమునకు
పూనుకొంటిమో, యెవరిమూలాన మాతృ
సీమ యీరీతి నిర్ధూమ ధామమయ్యె
ఎవరికారణమున ప్రజలిల్లువాసి
సలుపువారో నిత్యోపవాసవ్రతంబు,
ఇన్నిటికి తలయొగ్గుచు నున్నగాని
ఎవరి అపహాసమింక సహింపవలసె
ఎవ్వరీ స్వర్ణభువి గ్రుడ్డిగవ్వకైన
నోచికోని దానిని చేసి వైచినారో

ఎవరు మనపూర్వులకు దేవుడిచ్చినట్టి
రత్నమకుటమ్ము నటుకాల రాచినారొ.
ఎవరి దుర్నీతి బలసి వ్యాపించిపోయె
కణకణంబున పరమాణు కణమునందు.
ఇంతచేసినవారి దురంతములకు -
కాన్పరాదంతు ఈనాటికైన -కాని,
అణువు నణువున వారిపై నాగ్రహాంబు
రగులుచున్నది నేడు, వారలముగాంచి
అంతమాయెను మీయోగ మరుగుడంచు
పాడుచున్నవి పిట్టలు వీడుకోలు.
ఖరతరాసిని శాత్రవ కంఠలుంఠ
నమ్ముకావింపదగు ముహూర్తమ్మువచ్చె.
వారి కవసానవేళయువచ్చె, విజయః
దుస్తర మహాసముద్ర ముత్తుంగ భంగ
ఘూర్ణితమ్ము కానున్నది. క్షుద్ర తృణము
తేలగాలేదుసుమి కలకాల మిటులె.
వారెరిగినారు తా మనుదారులమని
ఘృణితులముకూడ నని - వారి మన సెవాఠె
కపజయమ్మును మనకు జయమ్ముగూర్చు.
ధర్మసంస్థాపనార్థమ్ము ధారుణీత
లమ్ములో మానవత సుస్థిరమ్ము జేయ
నా జగత్కర్త కోటిసహస్ర హస్త
ములను అవిరామముగనెత్తి నిలచినాడు.
అస్తిచర్మావశిష్టమైనట్టి మనశ
రీర కంకాళముల చెలరేగు శక్తి
సంచయముచేసి మనప్రియ జన్మభూమి
శత్రునిర్ముక్తముగజేతు; శత్రునాశ
కారి రణభేరి అతిశీఘ్రకాలమందె
మ్రోగ నున్నది; మనల నమోఘ జయ మ
హోత్సవ విలాస విభవ మహోదయమ్ము
పొందనున్నది. కందులే ఢెందమలర.

సెలవొసంగుమా ప్రేయసీ! సెలవునొసగు
మా సుముఖివై సహర్ష సహాసవగుచు.
వలపుదారమ్మునకు కట్టువడిన గాలి
పటము ఎటుబోవు వచ్చునిచ్చటికె మరల."

కమల కల్హారమాలికా సమభుజాల
ప్రణయదేవుని గళము నలంకరించి
తమిచకోరక నయనాల తనదు విభుని
ఆననముగాంచి విహ్వలయైన బాల.

నామనోమందిరానంద, నామనోజ్ఞ
జీవనాధారమా! కత్తిచేతబట్టి
ఆహవక్షోణి దుముకుటే అవసరంబ!
చక్కెరలమాగిప్రేమలు జల్లు చల్ల
చూపు లేప్రాణికైన సుధోపమాన
మరయ ఘృణతోడ సునిశాత శరసమాన
మవుట - దేశీయులెల్ల శత్రువులగాంచి
ఏవగించి, సాహాయ్యము నీయకున్న
నంతరించరె వారనాయాసముగను."

అనగవిని "నౌజవాను" సహాసవదను
డగుచు చెలిమోముజూచి యిట్లనియెమరల.
"ప్రణయినీ! నీవచించినపలుకు నిజమ
కాని రమణీసులభమైన ఖడ్గమూని
అరులనొంచుట పురుషుల కనుచితంబు.

వాలుచూపులవాలుతో వైరి గొంతు
గోయుటో యెదదూయుటో గుండె చెదర
జేయుటో సుందరాంగికి చెల్లు - కాని
వీరపురుషుని కదికీర్తికారి కాదు.

ఖడ్గముంగొని కదనరంగాన నిలచి
శత్రువులనొంచుటే పౌరుషంబు సఖియ.
సఖుడు, సహజన్ముడౌ మిత్తి సన్నగింప
జాల డాతనిలో ధైర్య సాహసాలు,"

—సశేషం.

# సిమ్లా నాటకము

కొడవటిగంటి కృష్ణమూర్తి

నాటింది వేపగింజ-మల్లెపూలు ఎలా పూస్తయి, మామిడికాయ లెలా కాస్తయి?

బ్రిటిషువారు ఏ వుద్దేశంతో ప్రతిపాదించినా వైస్రాయి ప్రణాళికజాతి వేరు. సిమ్లా సమావేశంలో అది సఫలీకృతం అవుతుందనుకోవటం పొరపాటు— అవలేదుకూడా. ప్రపంచ పరిస్థితులలో వొత్తిడివల్ల నైతేనేమి (శాన్‌ఫ్రాన్సిస్కోలో రష్యా ప్రతినిధి మాలటోవ్ ఇంగ్లీషువారు పోలండు సంగతి ఏమిటని మరీమరీ హెచ్చరించటం చూచి, ఒక్కసారి, నిజమైన భారతదేశపు ప్రజలు సమావేశానికి ఏనాడైనా వచ్చి తీరుతారని గర్జించినమాట మనం మరవకూడదు) ఇంగ్లండులో ఎన్నికల కుట్రలవల్ల నైతేనేమి, భారతదేశంలో పరిస్థితులు నానాటికీ విషమించటంవల్ల నైతేనేమి, ఇంగ్లీషువారు ఏదో ఒక పంథా తొక్కక తప్పలేదు. ఏ పంథా తొక్కినా ఇంగ్లీషువారికి భారతదేశంనుండి వెళ్ళిపోవాలని కాని, వారికి నష్టంవచ్చే పరిస్థితులు మనకు అనుకూలం చేస్తావని కాని మనం తలచ నవసరం లేదు. అలాంటిది ఎన్నడూ జరగదు. అయితే యూరపులో యుద్ధం ముగిసినప్పటికీ ఇంకా జపానుయుద్ధం వుండనే వుంది. హిట్లరు నాశనంతో ఇంగ్లండుకు స్థావరం చిక్కింది కాని జపాను నాశనంతో కాని వారికి కడుపునిండే ప్రాప్తి లేదు. ఒకప్పుడు బ్రిటిషువారి చేతికిందవున్న అమూల్యమైన ప్రదేశాలని జపాను ఆక్రమించుకు కూచుంది. జర్మనీని గెలవటానికంటె జపానును గెలవటానికి భారతదేశం సహాయం ఇంగ్లీషువారికి కావాలి. ఎవ్వరి వొప్పుదల లేకుండానే భారతదేశంలో మీకు కావలసినంత సహాయం దొరుకుతున్నదని ఎమరీ ప్రభృతులు మరీమరీ చెప్పినా చెప్పులు తొడుక్కున్న వాడికి కాని తెలియదు అవి ఎక్కడ కరిచేది! భారతదేశంనుంచి కావలసిన సహాయం ఎంత లభించేదీ మనకంటె ఇంగ్లీషువారికి బాగా తెలుసు! ఈ కారణంవల్లకూడా ఇంగ్లీషువారు ఎదో ఒక ఎత్తు వెయ్యక తప్పలేదు.

ఈ సమయంలోనే భారతదేశంలో ఒక వాతావరణం బయలుదేరింది. రాజగోపాలాచారి, సప్రూ, భూలాభాయి దేశాయి మొదలైనవారు ఏ విధంగానైనా భారతదేశం పరిస్థితులను చక్కబెట్టటానికి ప్రయత్నాలు సాగించారు. దీనికి బెంగాలుక్షామం, దేశంలో తినటానికి తిండి, కట్టుకోటానికి బట్ట లేకపోవటం, రక్తాన్ని ధారపోశే దేశనాయకులు జైళ్లలో వుండటం మొదలైనవి ప్రబల కారణాలు కావచ్చు. తాము పదవులలో వుంట ఏదో బాగుపడుతుందని కొందరి దురభిప్రాయంకూడా కావచ్చు. ఏ కారణంవల్ల నైతేనేమి ప్రయత్నాలు సాగినై. ఏ ప్రయత్నం అన్నా ఫలవంతం కావాలంటే దేశంలోని ముఖ్యపార్టీలు కాంగ్రెసు,

ముస్లింలీగు కలిసి వుమ్మడిమార్గం తొక్కితేనేగాని లాభంలేదు. ఆ కారణంచేత పంజాబు వ్యవహారాలలో వేలుపెట్టి, డొక్కశుద్ధయి, కాశ్మీరులో విశ్రాంతి తీసుకుంటున్న జిన్నాకి, లేఖ వెళ్ళింది గాంధిమహాత్ముడి దగ్గిర్నించి. బొంబాయిలో గాంధీ, జిన్నా కలుసుకుని సంప్రదించారు. జిన్నా పాకిస్థాన్ కావాలన్నాడు. పాకిస్థాన్ ఎలా వుంటుందో చెప్పమన్నాడు గాంధిమహాత్ముడు. సంధి కుదరలేదు. ఎవరిదోవ వారు పట్టారు. జిన్నాకు మళ్ళీ వూపిరి సలిపింది. మొండివాడు రాజుకన్నా బలవంతుడు. జిన్నా గొప్పవాడయి కూచున్నాడు.

మళ్ళీ ఇంకో ప్రయత్నం జరిగింది. సెంట్రలు ఎసెంబ్లీలో గవర్నమెంటును ఓడించాలనన్న వుద్దేశంతో కాంగ్రెసు పార్టి ముస్లింలీగుపార్టి ఒకటయినై. ప్రతిసారీ ఇద్దరూ ఏకమయి ఓటుచేసేటప్పటికి ప్రతిసారి గవర్నమెంటు ఓడిపోతూ వచ్చింది. ఇదే ఇంకోదేశమయితే గవర్నమెంటు రాజీనామా ఇచ్చి మళ్ళీ ఇంకో గవర్నమెంటు అమలులోకి వచ్చేది. భారతదేశంలో అటువంటి చిక్కులులేవు. గవర్నమెంటు ఓడిపోవటం వేళాకోళం అయింది. కొన్ని ఆంగ్ల పత్రికలకు వుడుకుమోత్తనం కూడా వచ్చింది!

1944 సంవత్సరం నవంబరు నెలలో ఒక దేశీయ ముస్లింనాయకుడు ఒక ప్రణాళిక తయారుచేసి దానికి గాంధి మహాత్ముడి వొప్పుదల సంపాదించాడు. ఆప్రణాళిక ఒక ప్రత్యేకవ్యక్తిచేత భూలాభాయికి అందచేయబడింది. భూలాభాయి లియాకత్ ఆలీ విషయం చర్చించారు. ఈ ప్రణాళిక తయారు కావటానికి ముఖ్యకారణం గాంధి-జిన్నా సంప్రదింపులు విఫలంకావటమే. దీని ముఖ్యోద్దేశం భావి భారతరాజ్యాంగ విధానం అమలులోకిరాక పూర్వం మధ్య ఏర్పాటయే రాజ్యాగంలో ముస్లింలీగుకు అంగీకారమైన ఏర్పాటు కలిగించటమే. ఈ ప్రణాళిక అసలు మొదట జిన్నాకి సరాసరి పంపించాలని తలంచబడింది కాని దీనికి ఎవ్వరూ వూనుకోక పోవటం వలన అది దేశాయిద్వారా లియాకత్ ఆలీకి పంపించబడింది. ఇందులో వైస్రాయికిగాని, గవర్నమెంటుకుగాని ఏసంబంధం లేదు. ముఖ్య పార్టీలైన కాంగ్రెసు, లీగు తమలో తాము సంప్రదించుకుని, ఒకంబడిక చేసుకుని తర్వాతనే గవర్నమెంటువారికి అందించాలని వుద్దేశం. ఆ సంవత్సరమే డిసెంబరునెలలో దేశాయి, లియాకత్ దీని విషయం చర్చించారు. జనవరి నెలలో ఒక పార్టీ వైస్రాయితోకూడా సంప్రదించి చివరకు ఇరుపక్షాలవారూ దీనిమీద సంతకం చేశారు. సంతకంచేసినవారు దేశాయి, లియాకత్ ఆలీ. కాని తర్వాత ఈ ప్రణాళిక విషయమై జరిగిన చర్చలో ఇటువంటి ప్రణాళిక అసలు అమలులోనే లేదని కొంతమంది ముఖ్యులు సూచించినప్పుడు గాంధీ మహాత్ముడికి ఎంత బాధకలిగిందంటే ఈ ప్రణాళికకు అసలు గ్రంథకర్త అయిన దేశీయ ముస్లింనాయకుడు, తదితర మిత్రులు వేయివిధాల ప్రయత్నం చేసివుండకపోతే గాంధీ మహాత్ముడు దీనిమీద నిరశనవ్రతం ప్రారంభించేవాడే.

ఈ ప్రణాళిక షరతులు.

1. భావి భారతరాజ్యాంగ విధానం ప్రమేయం లేకుండా మధ్యకాలంలో సెంట్రల్ గవర్నమెంటు స్థాపించుట.

2. ఈ గవర్నమెంటులో కాంగ్రెసు 40 పాళ్ళు, ముస్లింలీగు 40 పాళ్ళు, మిగతా వారు 20 పాళ్ళు వుంటారు. (అంటే గవర్నమెంటులో 10 మంది సభ్యులుంటే అందులో కాంగ్రెసువారు 4, ముస్లింలీగువారు 4, మిగతా వారు 2.)

3. ఈ కొత్త గవర్నమెంటు ప్రస్తుతం అమలులోవున్న గవర్నమెంటు ఆఫ్ ఇండియా ఆక్టు ననుసరించే వుంటుంది. విశేష (మెజారిటీ) సభ్యుల సూచనలను వైస్రాయి అంగీకరించాలి. అయితే వైస్రాయికి "వీటో" అధికారంవుంటుంది. (ఈ అధికారంకింద అందరికీ సమ్మతించిన విషయాలనుకూడా వైస్రాయి తిరస్కరించవచ్చు)

4. సెంట్రలు ఎసెంబ్లీ సభ్యులు ఆమోదించని ఏ విషయాన్నీ ఈ గవర్నమెంటు అమలులోకి తేవటానికి వీలులేదు. అవసరమైతే ఈ గవర్నమెంటు రాజీనామా ఇవ్వొచ్చు. (అంటే సెంట్రలు ఎసెంబ్లీ సభ్యులు ఫైనాన్సు బిల్లు తిరస్కరించినప్పటికీ గవర్నమెంటువారు దానిని అమలులో పెట్టినట్టు కాదన్నమాట!)

5. గవర్నమెంటులోని సభ్యులందరూ భారతీయులే కావాలి. డిఫెన్సు డిపార్టుమెంటు మాత్రం సర్వసేనానాయకుడి (కమాన్‌డర్ ఇన్‌ఛీఫ్) కింద వుంటుంది.

బ్రిటిషువారు ఎదురుచూస్తున్న తరుణం వచ్చింది! ఏదోవిధంగా ఏదైవా చెయ్యాలనుకుంటున్న సమయంలో ఈప్రణాళిక వచ్చింది. వైస్రాయి శలవు పెట్టి ఇంగ్లండు వెళ్ళాడు. దీనిని బ్రిటిషు గవర్నమెంటుతో సంప్రదించటానికి. వారం కాదు రెండువారాలు కాదు వైస్రాయి ఇంగ్లండులో రెండు నెలలు వుండాలిసి వచ్చింది. దీనికి ముఖ్యకారణాలు బ్రిటిషు 'గవర్నమెంటుకు కొంత ఇష్టంలేక పోవటమూ, మధ్యలో జర్మనీ పూర్తిగా నాశనం కావటమూ, అవతల శాన్ ఫ్రాన్‌సిస్కోలో శాంతిపర్వం ప్రారంభంకావటమూ. ఏమైతే ఏమి దేశంలో ఒక విధమైన ఆశ బయలుదేరింది. ఈ ఆశకు ముఖ్యకారణం ఏదైనా సంప్రదింపులు జరగాలంటే ఆజాద్, నెహ్రూ మొదలైన నాయకులు విడుదలకాక తప్పదు. కొంతమందికి అదేచాలు నేమో! మళ్ళీ కాంగ్రెసుకు జీవం ఏర్పడుతుందనీ, పరిస్థితులు కొంతకాకపోతే కొంతైనా చక్కపడతయ్యనీ. కనీసం దేశానికి ముఖ్య నాయకుల నాయకత్వం లభిస్తుందనీ ఆశ ప్రబలింది.

వైస్రాయి భారతదేశానికి తిరిగివచ్చి జూన్ 14-వ తేదీ రాత్రి ఢిల్లీనుంచి బ్రాడ్‌కాస్టు చేశాడు తన ప్రణాళికను. దాంతోపాటే కాంగ్రెసు వర్కింగు కమిటీ సభ్యులను ఇంకా జైలులో వున్నవారిని-విడుదలచెయ్యటానికి ఆజ్ఞ ఇవ్వబడింది. జైలులోవున్న ఇతర కాంగ్రెసు సభ్యుల విషయమై క్రొత్త గవర్నమెంటు ఏర్పాటు చేస్తుంది అని సూచించాడు.

## వేవెల్ ప్రణాళిక

1. గవర్నమెంటులో అంతా భారతీయులే వుంటారు - వైస్రాయు, కమాండర్ ఇన్ ఛీఫ్ తప్ప.

2. బ్రిటను తరపున భారతదేశంలో ఒక హై కమీషనరు వుంటాడు - ఆస్ట్రేలియా, ఆఫ్రికా, కెనడా మొదలైన ఇతర డొమినియనుల మాదిరిగా.

3. విదేశ వ్యవహారాలు భారతీయుల కిందనే వుంటయి.

4. మహమ్మదీయులకూ సవర్ణ హిందువులకూ (కాస్ట్ హిందూస్) సరిసమాన సభ్యత్వం.

5. ఇతర మైనారిటీలకు ప్రాతినిధ్యం

ఐతే వైస్రాయి "వీటో" అలాగేవుంటుంది. ఈ గవర్నమెంటు సెంట్రల్ ఎసెంబ్లీ తిరస్కారాలను ఆమోదించాలిసిన అవసరంలేదు. ఇండియాఆఫీసు ఇంగ్లండులోవుంటుంది. (ఇండియాఆఫీసు ఇంగ్లండులో ఉండటం విషయంలోఆఫీసు ఇంగ్లండులోనే ఇంగ్లండు ఎన్నికల ఆవేశంలో లేబరుపార్టీవారు అసలు ఇండియా ఆఫీసును తీశేస్తామని చెప్పారు. ఇప్పుడు వేవెల్ ప్రణాళికలో ఈ అఫీసు ఇంగ్లండులోనే వుంటుంది అనటం ఒక మెట్టు అభివృద్ధి అన్నమాట!)

ఈ ప్రణాళిక బ్రిటిషు గవర్నమెంటు ఆమోదం పొందిందనీ, ప్రస్తుత భారతీయ పరిస్థితుల్ని చక్కబెట్టే తలంపుతో ఈ ప్రణాళిక ప్రతిపాదించబడిందనీ, భారతీయులకు ఇష్టంలేని రాజ్యాంగ విధానాన్ని అమలులోకి తేవాలన్న వుద్దేశంలేదనీ, ప్రస్తుత ప్రణాళిక కేవలం తాత్కాలికమైనదే అని వేవెలు చెప్పాడు.

ఈ కొత్త గవర్నమెంటు జపాను పరిపూర్ణంగా ఓడిపోయేవరకూ యుద్ధ ప్రయత్నం కొనసాగిస్తుంది. అసలు రాజ్యాంగ విధానం అమలులోకి వచ్చేవరకూ ఈగవర్నమెంటు యుద్ధానంతర సమస్యల్ని పరిష్కారంచేస్తుంది. అసలురాజ్యాంగ విధానం అమలులోకి తేవటానికి వీలున్నపక్షంలో ఈ గవర్నమెంటు దానికి ప్రయత్నంచేస్తుంది. ఇది చాలా ముఖ్యమైన సమస్య అనీ, ఈ ప్రస్తుత గవర్నమెంటు అసలు రాజ్యాంగ విధానాన్ని అమలులోకి తేవటానికి సహాయ పడుతుందనే వుద్దేశంతోనే ఏర్పాటు చేయబడిందని వైస్రాయి చెప్పాడు.

ఈ ప్రణాళికను చర్చించే నిమిత్తం వైస్రాయి కొంతమందిని సిమ్లాలో జూన్ 25వ తేదీవ జరగబోయే సమావేశానికి ఆహ్వానించాడు. వారుభారతదేశంలోని "రాష్ట్రాల ప్రధాన మంత్రులూ (ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలకు మంత్రులుగా వున్న కొంతమందీ, ఇదివరకు మంత్రులుగా వున్న ఇతర రాష్ట్రాల మంత్రులు కొంతమందీ) సెంట్రలు ఎసెంబ్లీలో కాంగ్రెసుపార్టీ నాయకుడూ (భూలాభాయి) ముస్లింలీగు పార్టీ డెప్యూటీ లీడరూ (లియాకత్ అలీ), కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌లోని కాంగ్రెసు, ముస్లింలీగు నాయకులూ. ఎసెంబ్లీలో యూరోపియను పార్టీ నాయకుడూ, నేషనలిస్టు పార్టీ నాయకుడూ, ముఖ్యరాజకీయ పార్టీల నాయకులైన మహాత్మాగాంధీ, జిన్నా, షెడ్యూల్డు కాస్టు తరఫున రావుబహదూరూ శివరాజ్, శిక్కుల తరఫున తారాసింగ్.

ఈ సమావేశం జయప్రదంగా జరిగేటట్టయితే ఇప్పుడు ఎడ్వయిజరీ ప్రభుత్వం కిందవున్న రాష్ట్రాలలోకూడా సంయుక్త ప్రభుత్వాలు (కొయలెషన్ మిని

స్ట్రీలు ) స్థాపించవచ్చునని వైస్రాయి సూచించాడు! ఇది జయప్రదం కాకపోతే చేసేదేమీ లేదనీ, ఇదివరకు సభ్యులతోనే గవర్నమెంటు వుంటుందనీ వేవెలు చెప్పాడు. ఈ ప్రణాళిక బ్రిటిషు ఇండియాకే వర్తిస్తుంది కాని సంస్థానాలకు వర్తించదు. ఈ ప్రణాళిక అందరూ సమాన భావంతో ప్రయత్నం చేస్తే జయప్రదం కాక తప్పదనీ, అన్ని పార్టీలవారూ గడిచినదానికి కొంత క్షమించాలినీ, కొంత మరిచిపోవాలినీ వుంటుందనీ, ప్రస్తుతం భారతదేశం ఖ్యాతియుద్ధంలో విశేషంగా వున్నదనీ, భారత ప్రతినిధులు అంతర్జాతీయ సమావేశాలలో మిక్కిలి ఖ్యాతిగడించారనీ, భారతదేశానికి అన్నిదేశాల సానుభూతీ వున్నదనీ, భారతదేశానికి గొప్ప భవిష్యత్తు వున్నదని తలంచే వారిలో తానొకడనీ, తనచేతిలో వున్నంతవరకూ భారతదేశం గొప్పతనానికి ఇంకా మెరుగు పెడతాననీ వైస్రాయి చెప్పాడు !.

ఇదే సమయంలో అల లండను పురంబులో కామన్సుసభలో అమెరీ ఈ ప్రణాళికను గురించిన తెల్లకాగితము ప్రవేశపెట్టుతూ జరగబోయే సమావేశంలో వైస్రాయి ఆ సమావేశానికి వచ్చిన సభ్యులను కొన్ని పేర్లను ఇవ్వమని అడుగుతాడనీ, ఈ పేర్లలోనించి కొన్నిటిని గవర్నమెంటు సభ్యులుగా వైస్రాయి బ్రిటిషు గవర్నమెంటుకు సిఫారసు చేస్తాడనీ, ఈ సభ్యులను సూచించే బాధ్యత పరిపూర్ణంగా వైస్రాయిదే కాబట్టి వైస్రాయి తన యిష్టమువచ్చిన వారి నెవరినైనా సూచిస్తాడనీ, జపానుయుద్ధం విజయవంతంగా అయ్యేదాకా ఈ సభ్యులు తమ సహాయాన్ని ఇచ్చే బాధ్యత వుందనీ చెప్పాడు. అన్ని రాష్ట్రాలలోనూ దేశంలోని ముఖ్యపార్టీలు కలిసి ప్రభుత్వం స్థాపించితే జాతివైషమ్యాలు నశించి గవర్నమెంట్లు తమ విశేష బాధ్యతలను గుర్తించటానికి అవకాశం వుంటుందని అమెరీ సూచించాడు. ఈ ప్రణాళిక కేవలం తాత్కాలికమేననీ, అందువలన ఈ గవర్నమెంటు ఎసెంబ్లీ సూచనల్ని అంగీకరించదనీ, అలా అంగీకరిస్తే మహమ్మదీయుల దృష్టిలో హిందువుల మెజారిటీ చలామణి అయినట్లు వుంటుందనీ అమెరీ వొప్పుకున్నాడు. అంతేగాక వైస్రాయి "వీటో" కూడా వుంటుంది. ఇది వుండటంవలన భారతదేశంలో అన్నిపక్షాలవారికీ న్యాయం కలుగుతుందని, మైనారిటీల సమస్యలను కాపాడేటందుకు "వీటో" వుపయోగించాలిసిన అవసరం వచ్చినా ఇది అవసరమైతే వుపయోగించేదే కాని ఎప్పుడు పడితే అప్పుడు వుపయోగించేది కాదనీ అమెరీ అభిప్రాయం.

జూన్ 15 వ తేదీన కాంగ్రెసు నాయకులందరూ విడుదల చేయబడ్డారు. సిమ్లా సమావేశానికి రావలిసిన నాయకులందరికీ ఆహ్వానాలు పంపబడ్డాయి. లండనులో అన్నిపార్టీలవారూ ఈ ప్రణాళికను ఆమోదించమనీ, ఈ ప్రణాళిక అన్ని పార్టీలవారూ ఏకీభవించి ప్రతిపాదించబడినదే అనీ చెప్పారు. జార్జి ప్రభువు అందరు నాయకులూ ఈ సమావేశానికి హాజరవుతారని ఆసిస్తున్నాననీ చెప్పాడు. దేశంలో ముఖ్యమైన పత్రికలు అనేకం ఈ ప్రణాళిక మంచి చెడ్డలు బాగా గుర్తించి ఆమోదించవలసినదని వ్యాఖ్యానం చేసినై, కొన్ని ఈ ప్రణాళికను చెడ తిట్టినై. హిందూమహాసభ దీనిని తీవ్రంగా నిరసించింది. శ్యామప్రసాద్

ముఖర్జీ యాత్రకు బైలుదేరి పూనా, బెంగుళూరు, చెన్నపట్టణం చుట్టివచ్చి విశేషంగా వివర్శించాడు వేవెలు ప్రణాళికను. దీనిని అమలులో పెట్టితే హిందువులంతా కలిసి చర్యతీసుకుంటామని బెదిరించాడు. జపానునించి 'ది నిప్పన్ టైమ్స్' ఈ ప్రణాళికను తిరస్కరించమనీ, భారతీయులు కోరేదీ, భారతీయులకు తగినదీ స్వరాజ్యం దీనివల్ల లభించదని సూచించింది. కొన్ని అమెరికను పత్రికలు ఈ ప్రణాళిక సరియైనది కాదనీ, ఇది కేవలము ఇంగ్లండులోని కన్సర్వేటివ్ పార్టీ తంత్రమనీ హెచ్చరించినై. కమ్యూనిస్టులు దీన్ని ఆమోదించమని తీవ్రప్రచారం చేశారు. వైస్రాయి "వీటో" వుండటం అన్యాయమేననీ, కాంగ్రెసు, లీగు కలిస్తే దీనికి విలువలేకుండా చెయ్యొచ్చుననీ, ఈ ప్రణాళిక మనకు ఎంత అధికారం ఇస్తున్నదన్న ప్రశ్న కాక ఈ ప్రణాళికతో మనం ఏమి చెయ్యగలమనేదీ ప్రశ్న అనీ, ఈ ప్రణాళికవల్ల దేశంలోని పరిస్థితుల్ని చాలా భాగం చక్కపెట్ట వచ్చుననీ కమ్యూనిస్టుల అభిప్రాయం. సుభాసచంద్రబోసు ఈ ప్రణాళికను తిరస్కరించమనీ, భారతీయులను సైన్యంలో చేర్చి తమ వలస రాజ్యాల్ని గెలవటానికి బ్రిటిషు వారి పన్నాగమనీ చెప్పాడు. మొత్తంమీద దేశంలోనూ, విదేశాలలోనూ ఈ ప్రణాళికను ఆమోదించమన్న వారే ఎక్కువ.

వేవెలు ప్రణాళికను చదవగానే గాంధీ వైస్రాయికి తంతి పంపాడు కాంగ్రెసు తరఫున తను ప్రతినిధిగా రావటానికి తనకు హక్కు లేదనీ, ఆ హక్కు ఒక్క కాంగ్రెసు అధ్యక్షుడికేగాని లేక ఏ ప్రత్యేక సమయంలోనైనా నియమించబడిన మరెవరికైనాగానీ వుంటుందని గాంధి తాత్పర్యం. వైస్రాయి ప్రణాళికలోని "సవర్ణహిందువులు" అన్న ముక్క గాంధీమహాత్ముడిని కలతపెట్టింది. రాజకీయంగా సవర్ణ హిందువులంటూ హిందూమహాసభలోనే లేరని గాంధిమహాత్ముడి నమ్మకం.

"వీటో" విషయమై కొంత తీవ్రం చర్చ జరగటంవలన ఎమరీ ఈ "వీటో" భారతదేశానికి సంబంధించిన వ్యవహారాలలోనే వుపయోగించబడుతుందని చెప్పాడు. మౌలానా అజాద్‌ను సమావేశానికి పిలవలేదన్న విమర్శనుగురించి వేవెలు వెంటనే గమనించి కాంగ్రెసు అధ్యక్షుడికికూడా ఆహ్వానం పంపాడు. కాలవ్యవధి లేకపోవటంవలన అజాద్ జూన్ 21వ తేదీన కాంగ్రెసు వర్కింగు కమిటీ బొంబాయిలో సమావేశం కావలిసినదని పత్రికాముఖంగా తెలియబర్చాడు.

కాంగ్రెసు వర్కింగుకమిటీ బొంబాయిలో సమావేశమయి కాంగ్రెసు అధ్యక్షుడినీ, గాంధిమహాత్ముడినీ కాంగ్రెసుతరఫున పంపారు. కాంగ్రెసు వర్కింగుకమిటీలో భూలాభాయి దేశాయి తన ప్రణాళికను గురించి విపులంగా విశదీకరించిన పిమ్మట తర్జనభర్జనలు జరిగినై. గాంధి మహాత్ముడూ, జిన్నా కలిసి ఒకే రైలులో ప్రయాణంచేస్తే చూడ ముచ్చటగా వుండేదేమో కాని జిన్నా కిందటిరోజే సిమ్లా ప్రయాణం కట్టాడు.

భూలాభాయి వుద్దేశంప్రకారం వేవెల్ ప్రణాళిక దేశాయి-లియాకత్ ప్రణాళికకంటె మంచిదనీ, కాంగ్రెసు దానిని ఆమోదించాలనీ, అజాద్ వైస్రాయిని

సమావేశం పూర్వం కలుసుకున్నప్పుడు కొన్ని అనుమానాలు నివృత్తి తీర్చుకుందామనుకున్నాడు. 1. వైస్రాయి "వీటో" 2. జపానుతో - యుద్ధం చేసేటందుకే కాంగ్రెసు సహాయం చేస్తుంది కాని జయింపబడిన వలసరాజ్యాలు బానిస దేశాలుగానే వుంచేటందుకు తోడ్పడదు. 3. హిందువులకు, మహమ్మదీయులకు సమాన సభ్యత్వం.

ఈ సమాన సభ్యత్వం కాంగ్రెసుకు సుతలామూ ఇష్టంలేదు. కాంగ్రెసు దీనికి వొప్పుకోకుంటే కాంగ్రెసు కేవలం హిందువుల సంఘమే అవుతుంది కాని జాతీయ సంఘం కాదు. కాంగ్రెసులో హిందూమహమ్మదీయులే కాక ఇతరజాతులు బోలెడువున్నాయి. కాంగ్రెసు ఒక్క హిందువులనే ఏరుకుంటే ఈ 50 సంవత్సరాలనుంచీ కాంగ్రెసు పడినశ్రమఅంతా బూడిదపోసిన పన్నీరవుతుంది. దీనికి గాంధిమహాత్ముడే కాక మరెవ్వరూ వొప్పుకోలేదు-రాజగోపాలాచారి, భూలాభాయి దేశాయి తప్ప! కాని దీనిని ఒకవిధంగా సర్దవచ్చుననీ, ఈ కారణంవల్ల ఈ సమావేశం జయప్రదం కాకపోవటం పొరబాటనీ కాంగ్రెసు నాయకులు తేల్చారు. కాంగ్రెసు నాయకుల వుద్దేశం ప్రకారం గాంధీ, అజాద్ జూను 24 తేదీన వైస్రాయితో సంప్రదింపులు జరిగింతరువాత జిన్నాను కలుసుకుని కాంగ్రెసూ ముస్లింలీగూ కలిసి వుమ్మడిగా పదిపేర్లు ఇచ్చినట్లయితే అన్ని చిక్కులు విడిపోతయ్యని భావించారు!

సిమ్లాలో జూన్ 24 వ తేదీన వైస్రాయితో గాంధీమహాత్ముడూ, మౌలానా అజాద్, జిన్నా సంప్రదించారు. కాని గాంధీమహాత్ముడు తను సమావేశానికి హాజరుకాననీ, తన చేతనయిన సహాయం సిమ్లాలోనే వుండి చేస్తాననీ చెప్పాడు. దీనికి కారణం కాంగ్రెసుతరఫున తనకు ప్రతినిధిగా వెళ్ళటానికి హక్కులేదనీ, ఎలాగైనా కాంగ్రెసు అధ్యక్షుడే కాంగ్రెసు ప్రతినిధిగా వుండటం మూలాన ఏఇబ్బందీ వుండదని గాంధిమహాత్ముని అభిప్రాయం, అదీకాక గాంధీమహాత్ముడు వైస్రాయితో సంప్రదించినప్పుడు, హిందుముస్లిముల సమానసభ్యత్వం తనకు తృప్తికరంగాలేదనీ అందుచేత సిమ్లాసమావేశంతో తనకు సంబంధంలేదనీ, అయినా తన సలహా ఎవరికైనా లభించగలదనీ గాంధిజీ సూచించాడు. దీనికి వైస్రాయి అంగీకరించి గాంధీమహాత్ముడిని సిమ్లాలోనే వుండమని కోరాడు. వైస్రాయి మౌలానా అజాద్ కలుసుకుని మాట్లాడినప్పుడు అజాద్ వుర్దూలోనే మాట్లాడటంవలన గోవింద్ వల్లబ్ పంత్ మధ్యవర్తిగా వున్నాడు!

జూన్ 25 వ తేదీన సిమ్లా సమావేశం ప్రారంభమయింది. నాయకులు సమావేశం కాకపూర్వం బైట సమావేశానికి వచ్చిన ప్రతినిధులందరితో షేక్ హాండు చేశాడు. వివిధపార్టీలవారు వివిధోద్దేశాలతో హాజరయినప్పటికీ అందరూ ఒకర్ని ఒకరు పలకరించుకున్నారుగాని జిన్నా అజాద్ మాత్రం కలుసుకోలేదు సరిగదా అజాద్‌ను చూడగానే జిన్నా అటువైపు తిరిగాడట! ఒకప్పుడు అజాద్‌ను జిన్నా కాంగ్రెసు "షోబాయి" (అచ్చ తెలుగులో దిష్టిబొమ్మ!) అని నామకరణం చేశాడు. ఆ "షోబాయి" ఈ రోజున తనతో సమానంగా కాంగ్రెసు

(కొదువ పేజీ 85 లో)




భిక్షుని కోరిక ప్రకారం విక్రమాదిత్యుడు చెట్టెక్కి బేతాళుని వీపు మీద వేసుకుని తెస్తూ ఉండగా, బేతాళుడు ఇలా చెప్పాడు:—

“రాజా! నేను నీకు ఒక కధ చెపుతాను విను. దానిలో కలిగిన సమస్యకు సమాధానం తెలిసి ఉండికూడా నీవు చెప్పనట్లయితే తల పగిలి చనిపోతావు” అని బేతాళుడు కధ చెప్ప మొదలు పెట్టాడు.

రాజా! ‘రాయలచెరువు’ అనే గ్రామంలో కోటప్పఅనే కాపు ఉండేవాడు. అతను చిన్నతనంనించీ కష్టజీవి. ఊళ్ళో ఆసాములదగ్గర కమతం ఉండీ, కూలీనాలీచేసీ, నాలుగు డబ్బులు వెనకవేసుకుని రెండెకరాల పొలం కొన్నాడు. కోటప్ప జీవితంలో సుఖమనేది ఎరగడు. రాత్రింబగళ్లు చెమటోడ్చి పని చేసేవాడు. వొళ్లు దాచుకునేవాడుకాడు. అతనికి భార్యకూడా అనురూపమైందే దొరికింది. కోటప్ప ఎక్కువ శ్రమపడుతాడా, వెంకమ్మ ఎక్కువశ్రమపడుపడుతుందాఅని తేల్చాలంటే కష్టమే. వెంకమ్మ చుక్క పొడుస్తూనే లేచి, మజ్జిగచేసి, గొడ్లకు నీళ్లు పెట్టి, పాచిపనులన్నీ చేసుకొని, పొద్దు పొడిచేవరకే అన్నంవండి కూర్చునేది. మొగుడికి అన్నంపెట్టి పొలం పంపిన తరువాత ఊరికే కూర్చునేది కాదు. ఊళ్ళోకిపోయి పేడపోగు వెయ్యటమో, లేక వడ్లదంపుకు పోవటమో చేసేది. వెంకమ్మ తెచ్చిన నూకలతోనే సంసారం గడుస్తూ ఉండేది. పిడకలు అమ్మిన డబ్బుతోనూ, మజ్జిగ అమ్మిన డబ్బుతోనూ ఇంట్లో పై ఖర్చులు గడుస్తూ ఉండేవి. నిజానికి సంసారమెలా గడుస్తున్నదోకూడా కోటప్పకు తెలియదు. అతను పొలంమీదవచ్చే అయివేజు అంతా కూడబెట్టి పొలం కొంటూ పోయాడు..

కోటప్పకు మొదట సంతానం, రామయ్య కలిగేనాటికి అతను పెద్ద భాగ్యవంతుడు కాడు. అంచేతనే ప్రథమ సంతానం అయినప్పటికీ రామయ్య తల్లిదండ్రుల గారాబం ఎరగడు. ఆరో ఏడు వచ్చీ రాగానే గొడ్లదగ్గర వేశారు—రామయ్యను చదివించాలని వాళ్ళకి ఆలోచనేపోలేదు. పదోయేడు వచ్చే




# బేతాళ పంచదశి

వరకు కొడుకును తనవెంట వేసుకొని కోటప్ప వాడికి అన్నిపనులు తరిఫీదు ఇచ్చాడు. రామయ్య పదిహేనోయేడు వచ్చేవరకు దిట్టంగా అరకదున్నట మేమిటి - విత్తులు ఎదపెట్టటం ఏమిటి- మోటతోలట మేమిటి అదీయిదీ అనకుండా సమస్తమయిన పనుల్లోనూ తయారయినాడు. రామయ్య చేతికిఎక్కివచ్చిన తర్వాత కోటప్పకు కొంచెం విశ్రాంతి చిక్కింది. వొంట్లో సరిగాలేక రెండుగోజులు కోటప్ప పాలుమాలినా, పొలం పనులేవీ ఆగేవిగావు. రామయ్య చేసుకు పోతూండేవాడు. ఇలా కష్టపడి కోటప్ప ఇరవై యెకరాల పొలం సంపాదించాడు. ఊళ్ళో వాళ్ళకి కన్నుకుట్టినట్టుగా ఉండేది కోటప్పని చూస్తే. ఈ ఊళ్ళో కమతంచేసుకు బతికిన కోటప్ప 20 ఎకరాల ఆసామి అయినాడంటే, లోలోపల ఎవరు ప్రశంసిస్తారు?

ఇలా అతని సంసారం మూడు పువ్వులూ ఆరుకాయలుగా, ఏదిచేసినా కలిసి వస్తూఉండే రోజుల్లో కోటప్పకు రెండోకొడుకు పుట్టాడు. అంచేత వీడంటే తల్లిదండ్రులకు తగని ప్రాణం. కోటప్ప కుర్రవాడికి మంచిపేరు పెట్టటంకోసం ఊళ్ళో అయ్యవాళ్ళందర్నీ అడిగి, ఆఖరికి "కుశాల్ రావు" అని నిర్ణయించాడు. కోటప్ప కుటుంబంలో సబ్బుతో స్నానంచేసిందీ, మొట్టమొదట చొక్కా తొడుక్కుందీ కుశాల్రావే! అంతా నూకలతాపతింటున్నా వీడికి మాత్రం వేరే అన్నం వండి పెట్టేది వెంకమ్మ. చాటుగా పెద్దవాడు చూడకుండా వీడికి మీగడవేసి పెట్టేది వాళ్ళఅమ్మ. కోటప్ప చాటుగా డబ్బులిచ్చేవాడు ఏమైనా కొనుక్కు తినమని.

కుశాల్రావు పెద్దవాడై తమ కుటుంబానికి ఎంతో పేరు ప్రతిష్టలు తెస్తాడని, దల్లితండ్రులు తమలో అనుకోవటమే కాదు. ఊళ్ళోవాళ్ళకి చెప్పుతూ కూడా ఉండేవారు. మావాడు కలకటేరు అవుతాడని వెంకమ్మ అనేది. మొత్తానికి కుశాల్రావు తెలివిగలవాడు; చురుకైనవాడు. స్కూలు ఫైనలువరకు కూడా ఒక్కక్లాసూ తప్పి ఎరగడు. కాని వాడిబుద్ధి కొంచెం వక్రమైంది.

డొంక తిరుగుడుగా తప్పితే తిన్నగా ఏదీ ఆలోచించడు. చేయడు. స్కూల్లో వాడుచేయని అల్లరి అంటూలేదు-కాని దేంట్లోనూ వాడి పేరు బయటికి రానివ్వడు. కూచిగాఉండి, చాటున గోతులు తియ్యటంలో మొనగాడు. చాటుగాఉండి యెంత పని అయినా చేయిస్తాడు, గాని ఎదటపడి ఒక్క మాట అనేవాడుకాదు ఇతర్లను. అంచేత వాడు స్కూల్లో మంచి పిల్లవాడి కిందనే చలామణీ అవుతూ ఉండేవాడు.

ఎందుకనో కుశాల్రావుకు అన్న అంటే తగని అసహ్యం, లోకువకూడా. రామయ్య ఎప్పుడైనా ముద్దుకు తమ్ముణ్ణి ఎత్తుకోబోతే-"ఛీ, నీదగ్గర గబ్బు!" అని గీపెట్టేవాడు. రామయ్య ఎప్పుడైనా పొలంనించి పాలబియ్యమూ, ముంజెకాయలూ తెచ్చి తమ్ముడికి ఎంతో అప్యాయంగా ఇవ్వబోతే కుశాల్రావు ససేమిరా అని ముట్టేవాడు కాదు. గొడ్లకు వెయ్యమనేవాడు. తల్లికూడా "రామయ్యా! ఎందుకురా, నువు అవన్నీ వాడికి పెట్టబోతావు! వాడిది బక్క ప్రాణంకదా. జబ్బు చెయ్యదూ" అనేది. తన ప్రాణంకంటే తమ్ముడి ప్రాణం విలువకలదనీ, గాజు పూస లాంటిదనీ అనే అభిప్రాయం రామయ్యకు ఏర్పడింది. తమ్ముడు గొప్పవాడై తన కుటుంబంతోపాటు తనకూ పేరు తెస్తాడని రామయ్య అనుకునేవాడు. రామయ్యకు యీ మధ్యన పెళ్లి చేశారు. కాని ఈ ఇంటి చరిత్రలో రామయ్య పెళ్ళి ఏమంత విలువ అయిన ఘటనకాదు.

కుశాల్రావు స్కూలు ఫైనలు పాసయి 'ఎల్లాయీ పట్నం' క్వాలేజీలో చేరాడు. వాడి దగ్గిరనించి కోటప్పకు డబ్బుకోసం తప్పితే వుత్తరం వచ్చేదికాదు. అది పట్టుకునే కోటప్ప వూరందరిచేత చదివించుకుంటూ తిరిగేవాడు. తనకొడుకు పట్నంలో చదువుతున్నాడనీ వాడి చదువుకు ఇంతఖర్చవుతుందనీ వూళ్లోవాళ్ళకి తెలియాలని కోటప్పకోరిక. కోటప్ప ఉత్తరం చదివించుకుంటూ కొడుకు గుణగణాలు వాళ్ళతో మధ్యమధ్య చెప్పతూ ఉండేవాడు.

ఇలా వుండగా శలవుల్లో కుశాల్రావు ఇంటికి వచ్చాడు. ఈమాటు వాడి వేషమంతా మారిపోయింది. క్రాపింగ్ పెట్టించాడు. పెట్టె తెరచి చూస్తే దాన్నిండా సూట్లు. ఈ సూట్లు వేసుకుంటే పట్నంలో ఎంత గౌరవంగా చూస్తారో, కుశాల్రావు—తల్లిదండ్రులకు ఒక ఘంటసేపు చెప్పాడు.

కోటప్పా, వెంకమ్మా, కొడుకు గొప్పతనం చూసి ఎంతో మెచ్చుకున్నారు. వాడిని పంట్లాం, కోటూ వేసుకోమనమని కోరి, వాడు వేసుకున్న తర్వాత నయనానందకరంగా చూసి ఎంతో సంతోషించారు. కాని ఈ సంతోషంలో రామయ్యకు భాగం లేదు. అతన్నెవరూ ఈ ఇంట్లో మనిషి కింద లెఖ్ఖవేసేవాళ్ళు కారు. ఒకనాడు కుశాల్రావు వాళ్ల నాయనతో "నాన్నా! నా చదువుకు ఉమ్మడి డబ్బు ఖర్చుపెట్టటం ఏమీ బాగాలేదు. నా భాగం నాకు పంచితే అది అమ్ముకుని చదువుకుంటాను. ఆ తర్వాత నా పొట్టకు నేను సంపాయించుకోలేక పోతానా?" అన్నాడు. తండ్రి 'అలాగే'

అని రామయ్యని కసురుక్కున్నాడు. రాఘయ్య మాట్లాడలేదు. తండ్రి రామయ్యతో మళ్ళీ-'నీకంత కష్టం లేకపోయినా, నీభార్య ఒకటి ఉందికదా; నీ తమ్ముడికి ఇంత ఖర్చు పెడుతూ ఉంటే ఆ పిల్ల వూరుకుంటుందా? ఎందుకైనా మంచిది, నీ చారెడు, నువు తీసుకుని నీ సోలెడు నువు వేరే కాచుకో'' అన్నాడు. రామయ్య అప్పటికీ మాట్లాడలేదు. మౌనం అంగీకారంగా తీసుకుని కోటప్ప ఆస్తి రెండు భాగాలు వేశాడు. కాని కుశాలరావు వొప్పుకోలేదు, తనకు మూడోవంతు చాలన్నాడు. అవసరమైతే తండ్రి భాగంకూడా తర్వాత పెద్దవాడికే ఇచ్చుకోమన్నాడు. ఈ త్యాగానికి రామయ్య పెళ్లాం మినహా ఇంట్లో వాళ్ళంతా సంతోషించారు. రామయ్య పెళ్లాం "ముక్కుతూ మూలుగుతూ వేరు పోయింది.

కోటప్ప కుశాలరావు చదువుకోసం మొదటి సంవత్సరం మూడువేలు అప్పు చేశాడు. అతనికి నోటుమీద వేలు ముద్ర వేసేటప్పుడల్లా చేతులు వణికేవి. అతను ఇంతవరకు ఒక్కళ్లదగ్గర ఒక కానీ అప్పు తెచ్చి ఎరగడు.

'ఏమిరా ఇంతడబ్బా ఏమి చేస్తున్నావు?' అంటే 'మరి పట్నంలో చదువు మాటలా?' అనేవాడు. నిజానికి కోటప్పకు ఏమీ తెలియదు. పుస్తకాలకీ వెయ్యి రూపాయలు అయినవంటే నమ్మేవాడు. రెండో సంవత్సరం చదువుతో కోటప్పకు బాగా నసాళం అంటింది. ఈ సంవత్సరం నాలుగు వేలయింది. తనకు వచ్చే అయివేజుతో ఈ అప్పులే తీరవని నిర్ధారణ చేసుకొని కోటప్ప బాగా దిగులు పడ్డాడు. అతను దమ్మిడీ దమ్మిడీ పోగుచేసి ఈ ఆస్తి సంపాదించాడు. ఇలా వేలు ఖర్చవుతూ ఉంటే అతను ఎంత బాధపడ్డాడో చెప్ప తరంకాదు. అతని శరీరానికి జలగల్ని పట్టించి నెత్తురు పిండినట్టయింది. అతను కొడుక్కు ఉత్తరం రాయించాడు- ఇంత ఖర్చు అయితే తను భరించలేననీ, ఎలాగైనా తగ్గించుకోమనీ. దానికి జవాబు కుశాలరావు ఒక బెదిరింపు ఉత్తరం రాశాడు రెండు ముక్కలో:-"మీకంత కష్టంగాఉంటే తను చదువు మానుకొని ఇప్పుడే ఇంటికి వస్తాడట. ఇంగ్లీషు చదువులంటే మాటలు కాదట!" పైగా తన తండ్రి పీనాసితనాన్ని ఒక్క ముక్కలో ఎత్తిపొడిచాడు:-"విత్తనాలు చల్లకుండా పైరు కోసుకోవాలంటే ఎల్లా కుదురుతుందీ" అని. కోటప్ప దైవంమీద భారంవేసి ఏడువేల అప్పుకుగానూ ఏడెకరాల సుక్షేత్రమైన మాగానీ అమ్మాడు. స్టాంపుమీద వేలుముద్ర వేసేటప్పుడు అతనికి కళ్ళలో నీరు తిరిగింది. వచ్చిన డబ్బు కాస్తా రిజిష్ట్రారు ఆఫీసులోనే అప్పులు తీర్చి కోటప్ప దిగులుతో మంచం పట్టాడు. కుశాలరావు ఈసంవత్సరం సెలవుల్లో ఇంటికి రాలేదు. పరీక్ష పోయిందికూడా—


కాని పోయినట్టు తండ్రికి వ్రాయలేదు. తన ఉద్యోగం ఒకటి దొరకబోతున్నదనీ, చదువు వద్దంటే ఉద్యోగంలో చేర్తాననీ తండ్రికి ఉత్తరం రాశాడు. తండ్రి ఉద్యోగంలో చేరమని రాస్తానన్నాడు గాని, తల్లి ఒప్పుకో లేదు. రెండు రోజులు పస్తుపడుకుని భర్త మెడలు విరిచి, రెండు వేలు అప్పుచేయించి కొడుక్కు పంపించింది. కుశాల్రావు ఈ సంవత్సరం తప్పటంచేత కాలేజీకి పోయేపనికూడా లేదు. రెండువేలూ రెండుమాసాల్లో ఊదేశాడు. తండ్రి ఇక నువ్వు చచ్చినా డబ్బు పంపనని కుశాల్రావుకు రాశాడు. కుశాల్రావు సంవత్సరంనర గడిచినాక మళ్ళా వాళ్ల వూరు చేరాడు. ఈమాటు వాడి పెట్టెల్లో సెంటు సీసాలకు బదులు బ్రాండీబుడ్లు ఉన్నై. తండ్రిగొంతు మీద కూర్చుని తన భాగం అమ్మించి, డబ్బు తీసుకుపోయాడు. ఇప్పుడు, కోటప్ప పేర ఒక్క సెంటు లేదు. రామయ్య పొలంపని చేసుకునే నాలుగు డబ్బులు వెనక వేసుకున్నాడు. ఈ మాటు కోటప్ప రామయ్యను బలవంత పెట్టి ఈ ఆస్తి వాడిచేత కొనిపించాడు. రామయ్య చేతులో మొత్తం డబ్బు లేకపోయినా ఆస్తి ఇతర్లకు పోనివ్వకూడదనీ, నాలుగేళ్లు పోతే చిన్నవాడు సంపాదించిన డబ్బు నీ కిచ్చి మళ్ళీ పొలం తీసుకుంటాడనీ చెప్పి, రామయ్యకు బలవంతాన పొలం అంటకట్టారు. కుశాల్రావు తను మైనరని స్టాంపుమీద సంతకం చేయలేదు. రామయ్య కూడా గట్టిగా అడగలేదు.

కుశాల్రావు ఆడబ్బు తీసుకుపోవటం మళ్ళీ ఒకసంవత్సరందాకా అతని జాడా లేదు. ఈలోపల తల్లీ, తండ్రీ వాడి దిగులుతోనే మంచమెక్కి, చచ్చిపోయారు. ఈ ఇద్దరికీ చాకిరి చెయ్యలేక రామయ్య భార్య సగమైపోయింది. ఐనా అత్తగా రెప్పుడూ 'చిన్నకొడుకునే తలుచుకుంటూ వాడు ఇంటిపట్టున ఉంటే తనకిన్ని కష్టాలు ఉండేవి కావు గదా?' అని నొచ్చుకుంటూ ఉండేది. ఏమైనా రామయ్య భార్యా చెర త్వరలోనే వదిలింది. ఒక నెల వ్యవధానంలో అత్తమామ లిద్దరూ పోయారు. వాళ్ళ కర్మలూ వగైరాలుకూడా జరిగిపోయినవి. ఈ సమయంలో ఊడిపడ్డాడు కుశాల్రావు. అన్నను సంగతులన్నీ అడిగి తనకు భాగం పంచమన్నాడు. రామయ్యకు ఆశ్చర్యంవేసి, 'ఏం భాగం!'' అన్నాడు.

''ఏం భాగమేమిటి? నా భాగమే అన్నాడు కుశాల్రావు.''

''నీ భాగం ఎప్పుడో పంచుకున్నావు. ఖర్చు పెట్టుకున్నావు. నేనేమీ ఇవ్వను'' అన్నాడు రామయ్య.

కుశాల్రావు యకాయకిన ప్లీడరు దగ్గిరికిపోయి, అన్నకు నోటీసు ఇప్పించి దావా వేశాడు! కాని న్యాయం రామయ్యపక్షానే ఉండడంచేత అతనికి సాక్షులుకూడా ఎవ్వరూ లేకపోయారు.



“ [smudged]న్నా! ఈ లెఖ్ఖ రైటేమో చూడూ!”

ప్లీడరుకూడా ఈదావా గెలవదని చెప్పాడు. కుశాల్రావు ఆలోచించాడు. “నేను నా భాగం ఏమీ అమ్మలేదు గదా?” అన్నాడు ప్లీడరుతో. “అమ్మకపోయినా, నీకు డబ్బు ముట్టినట్టుగా రసీదులుకూడా ఉన్నై కదా, మీఅన్న ఎప్పుడో మూడో భాగం పంచుకు వెళ్లాడు. న్యాయానికి రెండు భాగాలు నీవే ఖర్చుపెట్టుకున్నావు. ఇలాంటి పరిస్థితిలో నీకింకా భాగం ఎక్కడినించి వస్తుంది” అన్నాడు ప్లీడరు.

“జడ్జీకి లంచం పెడితే?” అన్నాడు కుశాల్రావు.

“పొరపాటున ఆపని చేసేవు! అది చేశావంటే నాకిక ఆశ లేదు!” అన్నాడు ప్లీడరు.

రాజా! ఇలాంటి ఆధారంలేని కేసు కుశాల్రావు గెలిచాడు. ఏ కాయితమూ అతనికి అనుకూలంగా లేదు., ఏవ్యక్తి అతనికి సాక్ష్యంలేదు. ఏ ప్లీడరుకూడా కేసు గెలుస్తుందని చెప్పలేదు. కుశాల్రావు మరి ఎట్లా గెలిచాడు?” అని బేతాళుడు విక్రమార్కుణ్ణి అడిగాడు.

అప్పుడు విక్రమార్కుడు—“బేతాళా! ఇందులో పెద్దకిటుకు ఏమీ లేదు. కుశాల్రావు వాళ్ళఅన్న రామయ్యపేరుతో జడ్జీకి లంచం పంపాడు. జడ్జి లంచగొండి కాదు. అంచేత రామయ్యకు ప్రతికూలం చేశాడు” అన్నాడు.

అప్పుడు బేతాళుడు “నిజము చెప్పితివి రాజా!” అని చెట్టుమీదికిపోయి కూర్చున్నాడు.

# హోటలు పరిచయుడు

మునిమాణిక్యం

ఆనాడు నేను చాలా పెందలాడే ఇంటి దగ్గరనుంచి బయలుదేరి కాఫీహోటలుకు వెళ్లాను. ఇంకా నేను ఏమీ పుచ్చుకోలేదు. ఇంతలోకే "ఏమోయ్, ఇక్కడున్నావా? చాలా మారిపోయినావే!" అంటూ ఎవరో ఒకాయన నన్ను పలుకరించాడు.

నేను ఆయన ముఖంవంకతేరి పార జూశాను. ఎవరో పోల్చుకోలేకపోయినాను. ఖద్దరుబట్టలు కట్టుకొన్నాడు. చామనచాయలో దృఢంగా ఉన్నాడు. మీసం మటుకు కాస్త నెరిసింది. చూడటంతోటే ఆయన చదువుకొన్నవాడనీ, చాలా పెద్దమనిషి అనీ అభిప్రాయం కలుగుతుంది ఎవరికైనా.

ఆయన ఎవరైందీ నాకు జ్ఞాపకం రాలేదు ఎంత ప్రయత్నించినా. ఎవరో చిన్ననాటి స్నేహితుడు అయి ఉంటాడు, అనుకొన్నాను. బహుశః నా సహాధ్యాయి అయి ఉంటాడు. లేకపోతే అంత చనువుగా ఏమోయ్ అని సంబోధిస్తాడా? మరచిపోయి ఉంటాను. నేను కాలేజీ వదలి ఇప్పటికి ఇరవై అయిదేండ్లు అయింధాయె!

అయితే ఆయనను చిన్నప్పుడు చూచినట్లు అయినా లేదు. బొత్తిగా క్రొత్తముఖంలాగు ఉంది. అయినా తెలివి తక్కువగా ఎవరండీ మీరు అని అడగటం నాకు ఇష్టం లేకపోయింది. ఆయన ఎవరైందీ మెల్లగా నేర్పుగా ఆయన నోటి వెంటనే రాబట్టాలెనని నిశ్చయించాను. ఉపాధ్యాయుడైన వాడికి ఈనేర్పు కాస్త ఉంటుంది ప్రశ్నలువేసి కావలసిన జవాబు రాబట్టటం.

కాసేపు ఏదో జ్ఞాపకం తెచ్చుకొంటున్నట్లు నటించి చివరకు ఈ ప్రశ్న వేశాను. "మనం క్రిందటి తఫా ఎక్కడ కలుసుకొన్నామోయ్?"

ఆయన విరగబడనవ్వి "ఆరి! నీకు ఇంతమాత్రం జ్ఞాపకం లేదురా?" అన్నాడు.

ఆమాత్రం ఏమిటి, అసలు ఏమాత్రం జ్ఞాపకంలేదాయ నాకు! అందుకని నేను ఏదో పెద్ద తప్పుచేసిన వాడిలాగ బిక్కముఖం పెట్టి చూశాను.

ఆ పెద్దమనిషికి నామీద చాలా జాలి కలిగి ఉంటుంది. ఎందుకంటే ఆయన వెంటనే నా వీపుపైన తట్టి మధురమైన కంఠంతో అడిగాడు మళ్ళీ "ఒరే, బాబూ నేనెవరో అసలు నీకు జ్ఞాపకం ఉందా!" అని.

నిజానికి ఏమో జ్ఞాపకంలేదు. ఐనా నేను వెకిలిగా నవ్వి "ఎంతమాటా!



"ఏమోయ్ సుబ్బారావు! అంతో మారిపోయావే! ఇదివరకు సన్నగా నాజూగ్గా—"

"నేను సుబ్బారావును కానండి."

"భలే మొనగాడివోయి, పేరు కూడా మార్చేశావే!"

అసలు జ్ఞాపకం లేకపోవటం ఏమికర్మం గాని—" అని, ఇంకా ఏమో అనబోయి ఊరుకొని సందేహంగా ఆయనవంక చూశాను నవ్వుతూ.

బాబూ నీవు ఎవరో నాకు జ్ఞాపకం లేదు అని ఒక్కమాట అంటే ఏ బాధా ఉండదు. కాని అల్లా అనటం అవినయమని మన అభిప్రాయం. అందుకని మనము వినయాన్ని ప్రకటించటానికి పడే బాధలు ఇన్నీ అన్నీ కావు.

నా మరుపూ, నా అనుమానమూ అన్నీ నాముఖంలో ఆయనకు కనపడే ఉంటవి. నా అవస్థ అంతా ఆయన గ్రహించాడు. గ్రహించి నేను రామారావును అని స్పష్టంగా చెప్పేశాడు.

కాని ఆయన ఏ రామారావో ఏమిటో నాకు జ్ఞాపకమురాలేదు. నా చూపుల్లో ఆసంగతికూడా ఆయన పట్టేసి, వెంటనే తన ఇంటిపేరు చెప్పాడు. అప్పటికీ నాకు జ్ఞాపకమురాలేదు. చివరకు ఆయన ముఖం చిట్లించి విసుగ్గా అన్నాడు. "నేను సుబ్బారావు తమ్ముణ్ణిరా!" అని. అప్పటికీ నాకు గుర్తుకు రాలేదు.

కాని ఇంకా నేను జ్ఞాపకములేనట్లే చూస్తినా, నేను వట్టి తెలివితక్కువవాణ్ణే కాక ఒక విధంగా సామాన్య మానవత్వాన్ని పోగొట్టుకొన్నవాడిని అవుతానని తోచింది.

అందుకని ఇక లాభంలేదని అప్పటికి చటుక్కున జ్ఞాపకంవచ్చిన వాడిలాగ వెర్రిగాచూచి, ఇంతసేపూ ఇంత చిన్న విషయం స్ఫురణకు రానందుకు సిగ్గుపడ్డట్టు నటించి, అప్పటికైన దాని ధర్మమా అంటూ జ్ఞాపకం వచ్చినందుకు అపరిమితమైన సంతోషాన్ని పైకి ఆర్భాటంగా చూపిస్తూ చివరకు తెముల్చుకొని ఇల్లాగ అన్నాను. "అరె! నీవురా! నేను ఎవరో అనుకొంటున్నాను! సుబ్బారావు తమ్ముణ్ణి అని మొదట్లో చెప్పినట్లు అయితే ఎంత బాగుండేది! ఎంత అల్లరి పెట్టావురా! కూర్చో, కూర్చో."

ఈ మాటలువిని ఆయన బాగా తృప్తి పడ్డట్లు మృదువుగా నవ్వాడు. ఏదో విధంగా ఈ విచిత్ర సంఘటనలోనుంచి బైటపడ్డందుకు నేనూ సంతోషించి ఆయనను స్నేహపురస్సరంగా రెక్కుచ్చుకొని కూర్చోబెట్టి కాఫీ తెప్పించి ఇచ్చాను. ఆయన నా ముఖం వంక చూస్తూ తన హృదయంలోని ప్రేమకు వెచ్చ వెచ్చని కాఫీతో దోహదం చేయటం సాగించాడు.

పెద్ద గాలిదుమారంలో చిక్కుకొని నానా అవస్థాపడి బైట పడ్డంత పని అయింది. ఎదుట కనపడుతున్న ఈ మనిషీ ఎవరైందీ తెలియక నేను సతమతం అవుతూ ఉంటే పైగా ఆ అప్రత్యక్ష వ్యక్తి సుబ్బారావు ఒకడు తయారైనాడు.

సుబ్బారావు నాకు ఏదో మహా ఆప్త మిత్రుడైనట్లు నటించి, ఇప్పుడు అతని క్షేమసమాచారం అడగకుండా ఎల్లాగ ఉంటాను. అందుకని సుబ్బారావు కులాసాగా ఉన్నాడా అని అడిగాను.

ఆయనగారు బిక్కముఖంపెట్టి "బాగానే ఉన్నాడు. కాని ఈ మధ్యనే వాడిభార్య పోయింది" అన్నాడు.

ఇప్పుడొక కొత్తచిక్కు వచ్చిపడ్డది. ఆ సుబ్బారావుభార్య మరణంకోసం నేను విచారం నటించాలె. స్నేహితుడి భార్య పోయిన సంగతి హఠాత్తుగా విన్నప్పుడు ఎంత గాబరాపడి, బిక్కముఖంపెట్టి విచారపడాలో అంతా పడ్డాను. మరి తప్పిందికాదు.

కాని ఆ సుబ్బారావు ఎవరో నాకు అప్పటికీ జ్ఞాపకము రాలేదు. ఊహా మాత్రంచేత ఆప్తమిత్రుడైన ఆ వ్యక్తి కోసం, అంతకంటే తెలియని ఆయన భార్య మరణం కోసం చచ్చినట్లు విధిగా ఆవేదన పడ్డాను.

కాని ఇదొక విధంగా లాభించింది. ఎందుకంటే ఆ తరువాత నేను ఏమీ మాట్లాడకపోయినా ఆయన ఏమీ అనుకోడు. ఆ విచారకరమైన వార్త విన్న మీదట దుఃఖభారంతో మౌనము వహించానని ఆయన అనుకొంటాడు. నేను తదనుగుణ్యంగా నే ప్రవర్తించాను. దిగులు ముఖంపెట్టి కప్పులో కాఫీ కొద్ది కొద్దిగా తాగుతూ మధ్యమధ్య ఆయన వంక చూస్తూ కూర్చున్నాను. ఆయనా నాలాగే చూస్తూ కూర్చున్నాడు.

ఈ యుగితక్షణాలు గడవటం చాలా కష్టమైనది. ఆయననుకూడా ఒక కుశల ప్రశ్న వేయాలె, వెయ్యకపోతే మర్యాదగా ఉండదు. అందుకని ఆయనవంక తిరిగి "నీవూ పిల్లలూ కులాసాగా ఉన్నారా" అన్నాను.

ఈ ప్రశ్న విని ఆయనొక చూపు చూశాడు. గుండెల్లోకి దూసుకుపోయింది ఆచూపు. గుండె దడదడ లాడింది. మళ్ళీ ఇంకో దుఃఖవార్త చెప్పేలా గున్నాడు. చెప్పాడో, నేనొక నాటకము ఆడాలె, ఏమిరా కర్మము అని దిగులు పడ్డాను.

కాని ఆయన ధర్మమా అంటూ నాకేమీ దుఃఖవార్త చెప్పలేదు కాని, ఒక నీచమైన వస్తువును నికృష్టమైన జీవిని, ఉన్మత్తుని, చూస్తున్నట్లు జాలిగా చూశాడు.

"నిజమేరా బాబూ, జ్ఞాపకశక్తి బొత్తుగా నశించింది. వృద్ధాప్యంవల్ల కావచ్చు. లేక జీవితంలోపడ్డ కష్టాల వల్ల కావచ్చు." అన్నాను నేను.

"నీ ముఖం" అయితేమటుకు ఇంత అన్యాయమా! మనం నాలుగేండ్ల క్రితం మద్రాసులో తిరువళ్ళిక్కేణిలో కలిశాము." అని నాముఖంలో మార్పును గమనించటానికి కామాలు కాస్త ఆగాడు.

నేను ముఖంలో ఏవిధమైన మార్పూ చూపించలేక పోయినమాట నిజము. సంవత్సరానికి ఒకటి రెండుసార్లు ఏదో పనిమీద మద్రాసు వెడుతూ ఉంటాను. అల్లాంటి సమయములో ఆయనను కలిస్తే కలిసే ఉండవచ్చు కాని ఏమీ జ్ఞాపకం వచ్చిచావందే! కళ్లు ఒప్పజెప్పి ఊరుకొన్నాను.

ఆయనకు నాపై జాలికలిగి మళ్ళీ ఇల్లా అన్నాడు. "మనము అప్పుడు బీచీ దగ్గర కలుసుకొన్నాము. అప్పుడే చెప్పాను. నేను, పెండ్లి చేసుకోలేదని, ఈ జన్మకు బ్రహ్మచారిగానే ఉండిపోవాలని నిశ్చయించుకొన్నానని."

నేను అప్పుడు — "ఓహో అవును. నిజమే ఇప్పుడు జ్ఞాపకము వచ్చినది" అని అనాలె నిజానికి - కాని ఏమీ అనక ఊరుకొన్నాను. నేను నా బలహీనతకూ జ్ఞాపకశక్తి పోగొట్టుకొన్నందుకూ సిగ్గుపడి ఆయనను క్షమించమని ప్రాధేయపడ్డాను.

ఇంతకూ నాకు జ్ఞాపకశక్తి పోయిన మాట నిజము. ఆయన బ్రహ్మచర్యవ్రత నిష్ఠాగరిష్ఠుడు కాబట్టి, ఆయన జ్ఞాపకశక్తి అంత పటుత్వముగా ఉంది అని అనుకొని నాకు నేను సమాధానము చెప్పుకొని, ఆయనను లోలోపల మెచ్చుకొన్నాను.

అప్పటికి మేము ఇద్దరంకూడా వేడి కాఫీని గుటకలు గుటకలుగా త్రాగేశాము. చెరో సిగిరెట్టు వెలిగించాము. ధూమ ఖండాలు మేఘదూతలై మా యిద్దరి మధ్యా, రాయబారాలు జరిపినై. నన్ను అతడు మనఃపూర్వకముగా క్షమించాడు. ఆతని చిరునవ్వు మెలికల్లో మా సంధి షరతులు గొలుసుకట్టు అక్షరాలతో లిఖిత రూపాన్ని పొందినవి. ఆ తరువాత నిశ్శబ్దత బరువైంది.

కొంచెముసేపు అయిన తరువాత ఆయన నా క్షేమ సమాచారాన్ని గురించి అడగటము మొదలుపెట్టాడు. నాకు అపుడు ఒకటితోచింది. ఏమిటీ అంటే:—

మద్రాసులో మేము ఇద్దరము కలిశాము ఽంటున్నాడు. ఆ సందర్భంలో నా సంగతి అంతా ఆయనకు చెప్పే ఉంటాను గదా! చెప్పిన సంగతులన్నీ జ్ఞాపకం ఉంచుకొన్నాడో లేదో ఇప్పుడు తెలుస్తుంది. ఆయన జ్ఞాపకశక్తి అంతంత మాత్రమేనని తెలిసిందా నీకుమటుకు ఏమి జాపకం ఉండి ఏడ్చింది, అని

ముఖం వాచేటట్లు చీవాట్లు వేద్దామని సంకల్పించుకొని కూర్చున్నాను.

"నీకు క్రాఫింగు పూర్వము ఇంత కంటే పెద్దదిగా ఉండేది కదూ?"

ఇది ఆయనగారి మొదటి ప్రశ్న!

"చాల్లే, నా క్రాపింగు ఎప్పుడూ ఇల్లాగే ఉంది" అని అంటానికి వీలులేదు. పట్టుకొని యీడించటానికి అవకాశం ఇచ్చే ప్రశ్నకాదు అది. ఎందుకంటే క్రాపింగ్ కాస్త పెరిగిఉన్నదేమో ఆయనగారు చూచినపుడు!! ఈ సిల్లీప్రశ్న వేశాదేమా అని మనస్సులో కించపడి "అవును" అని ఊరుకొన్నాను.

నేను అవును అనేసరికి ఆయన ఫక్కున నవ్వాడు.

"నువ్వు అంతా మారిపోయినావు. చిన్నప్పుడు నీవు దృఢముగా ఆరోగ్యముగా ఉండేవాడివి'' అన్నాడు.

ఇదికూడా కాదంటానికి వీలులేని ప్రశ్న. ప్రతివాడూ చిన్నతనములో దృఢముగానూ, ఆరోగ్యముగాను ఉంటాడు. ఆ ఏడుకాయేడు పైనబడ్డకొద్దీ బలహీనుడు కావటం సహజం.

అందుకని అవునన్నట్లు తలఊపి ఊరుకొన్నాను నేను.

ఆయన మళ్ళీ ఫెళ్లున నవ్వాడు.

ఒక్కనిమిషం ఆగి "నీవు పూర్వం కంటే ఛాలా నల్లబడ్డావు" అన్నాడు. ఈ మాటలు అన్నపద్ధతిలో, 'నీవు నన్ను కాదనలేవు. నేను ఏమన్నా నీవు చచ్చినట్లు అంగీకరించాలిసిందే' అన్న ధ్వని ఉన్నది.

అయినా నేను ''నేను ఒకప్పుడు తెల్లగా ఉన్నానా'', అన్నాను నవ్వుతూ.

ఆయన గట్టిగా నవ్వి, అన్నాడు. "అల్లాగకాదు. పూర్వము నీ దేహము చామనఛాయలో మెఱుస్తూ ఉండేది. ఇప్పుడు బాగా నల్లపడ్డావు."

సత్యమో అసత్యమో ప్రియమైన మాట అన్నాడు. నేను ఒకప్పుడైనా అందముగా ఉండేవాడిని అనుకోడము నాకు ఇష్టమే! కాబట్టి గట్టిగా కాదని అనలేకపోయినాను.

వీడి తెలివి తేటలకు సంతోషించి, తెల్లపోయి చూస్తూ ఊరుకొన్నాను.

వాడువేసిన ప్రశ్నలలో ఒక్కటీ వాడినా స్మృతిదౌర్బల్యాన్నిపట్టి ఇచ్చింది లేదు. ఎదురుతిరిగి అనటానికి ఎక్కడా అవకాశము చిక్కలేదు. అందుకని, యుద్ధములో పరాజయము పొందిన పృధ్వీపతిలాగ, శత్రువును సమయము చూచి దెబ్బకొట్టాలన్న నిశ్చయంతో మౌనము వహించి ఊరుకొన్నాను.

ఆయనకు నాపై జాలి కలిగింది. ప్రేమతో, జాలితో, నా వీపుపైన తట్టి ఆయన ఇల్లాగ అన్నాడు ఆఖరుకు.

"ఒరేయ్, నీ జుట్టు మారిపోయినది! కట్టు మారిపోయినది! రంగు మారిపోయినది! ఇంకొక్కమాట చెప్పనా? నీమాటకూడా మారిపోయినదిరా, రంగారావూ!!!" అన్నాడు.

రంగారావూ అన్న సంబోధన విని తెల్లపోయినాను.

వీడి దుంపతెగా! వీడెవరో నన్ను రంగారావు అని పిలుస్తున్నాడు!! నన్ను ఎవరో అనుకొంటున్నాడు!

వీడికేదో జ్ఞాపకశక్తి ఉందనీ, నాకు లేకపోయినదనీ సిగ్గుపడి చచ్చాను.

ఇంధాకటినుంచి, వెధవ ప్రశ్నలన్నీ వేసి చిక్కకుండా మాట్లాడాడు. సన్యాసి! చివ్వరకు చిక్కాడురా మిడతంబొట్లూ!! చచ్చేట్లు దెబ్బకొట్టాలె. తీవ్రమైన ఎదురు దాడి సాగించాలె అని నిశ్చయించుకొని "నాపేరు రంగారావు కాదు!!!" అని గట్టిగా అని పకపక నవ్వాను.

రామారావుకు ఇది ఎలక్ట్రిక్‌షాక్ లాగ తగిలి, ఆయన "ఢాం" అని చావాలిసింది.

తానేమో, అపూర్వమైన మేధాశక్తి గలవాడ్ని అని అనుకొన్న ఆ వ్యక్తికి ఇది ఆగనిపాతములేక ఏంజేస్తుంది!

నేను అనుకొన్నట్లు వాడు విరిగి క్రిందపడనూలేదూ, చావనూలేదు. ఒక్కసారి క్షణమాత్రం తెల్లబోయి, నా మాటలు విని ఎంతో ఆశ్చర్యపోయిన వాడిల్లాగ నటిస్తూ.

అరె! అన్నీ మార్చుకున్నావు సరే పేరుకూడా ఎప్పుడు మార్చుకొన్నావురా? అని వీపుపైని గట్టిగాచరిచి, నేను పేరు మార్చుకొన్నమాట సత్యమే అయినట్లు చేసిన ఆ వెధవ దొంగపనికి తాను ఉదార భావముతో క్షమిస్తున్నట్లు చూపులవల్ల తెలియజెప్పి, "అదుగో బస్ వస్తున్నది వెడతాను" అని చెప్పి, పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ నడిచిపోయినాడు రామారావు.

రామారావు ఎవరైనది నాకు అప్పటికీ తెలియలేదు. ఆయన అన్నమాట నన్ను నిశ్చేష్టుణ్ణిచేసింది. ఆయన ఎటు వెళ్ళింది కూడా నేను చూడలేదు. తలొంచుకొని ఊరుకొన్నాను. ఎవరా ఈ విచిత్రవ్యక్తి అని ఆలోచిస్తూ అల్లాగే కూర్చున్నాను.

ఆతడు నాకు చిరపరిచితుడూ, ప్రాణ మిత్రుడూ అని నేను అనుకొన్నాను కదూ, అందుకని నేనూ అతడూ కలిసి ఏవేవో తీపి వస్తువులూ అవీ తినేశాము. బిల్ ఎంత అయి ఉంటుందా అని ఆలోచించి అడిగాను ఆ కుర్రవాడిని. వాడు రూపాయి అని చెప్పి వెళ్ళిపోయినాడు.

రూపాయి అయిందీ అనేసరికి గుండె కొట్టుకొంది. అందులో అధమం అర్థ రూపాయి అయినా ఆయన తినేసి ఉంటాడు! ఆ మిత్రుడు!!

రామారావు టిఫిన్ కోసము తయారైన మిత్రుడన్నమాట!! ఆ విచిత్ర వ్యక్తి చాలా తెలివిగా ప్రవర్తించినా చివరకు మోసము చేసిపోయినాడు. ఛీ ఎంత నీచమైనపని చేశాడా అర్ధరూపాయి డబ్బులకోసము అని అనుకొన్నాను. తన తెలివినంతా నీచమైనపనికై వెచ్చించిన ఆవ్యక్తిపై నాకు పరమ అసహ్యం కలిగింది.

అప్పటికే చాలా సేపుఅయింది ఆయిన వెళ్ళిపోయి. నేనులేచి మెల్లగా యజమానిఉన్న బల్లదగ్గరకువెళ్ళి జేబులో నుంచి రూపాయినోటు తీసి, ఆయన కిచ్చాను. రూపాయి అయిందేఅని విచార పడుతూ.

ఆయన ఆనోటు తిరిగి నాచేతికి ఇచ్చి మీ మిత్రుడు చెల్లించి పోయినాడండి అన్నాడు.

మళ్ళీ నిర్ఘాంతపోయినాను. ఇది మరీ విచిత్రంగాఉంది!! ఎవరో రామారావు!!!

# ఇట్లా జరిగిపోతే....

ఆరోజు పంతులు మా కయిదు లెక్క లిచ్చాడు. అయిదింటికీ అయిదు మార్కులూ తెచ్చుకున్నాను....మర్నాడు మళ్ళీ మామూలే.

ఆరోజు మాఅమ్మా నాన్నా పోట్లాడుకోలేదు. మాఅమ్మ చెప్పిందల్లా మా నాన్న ఒప్పుకున్నాడు. ఆయన చెప్పిందల్లా ఆవిడా ఒప్పుకుంది. మాకొంప నెవరో మంత్రించినట్టయింది....తరవాత మళ్ళీ యధాప్రకారమే.

జీవితం ఈవిధంగా ఒక చిన్నవెలుగు వెలిగి వెంటనే ఎందుకు కొడ్డారిపోతుందో తెలిసేదికాదు.

ఇదంతా దేవుడిచేసే పరీక్ష అనుకునే వాణ్ణి....

★

ప్రెస్సుకు కొత్తటయిపు తెప్పించాం. అచ్చుగా దాంతోనే కొంత మేటరు కంపోజు చేయించాం. ప్రూఫులు చూస్తుంటే మా ప్రింటింగూ బాగున్నట్టే తోచింది. ఎప్పుడూ మా ప్రింటింగు అట్లాగే ఉండకూడదూ?....ఎప్పుడూ కొత్తటైపే వాడుతుంటే ఎందుకుండదూ? అయితే మరి, ఈ కొత్తటైపు పూర్తిగా అరిగితేగాని ఇందులోనుంచి మళ్ళీ కొత్తటైపుకు డబ్బురాదాయె!

విషమసమస్యగా కనిపించింది....

★

వాళ్ల అల్లుడు ఆరునెల్లకోసారి పెళ్లాన్ని అత్తవారింట దిగవిడిచి తనకు అయిదొందలిస్తేగాని మళ్ళీ తీసుకుపోడు. వాళ్లట్లాగే ఇస్తున్నారు....కాని ఎంత కాలమిస్తారు?

★

బాగా కలవాడు. అన్నదమ్ములులేరు. ఒకదేకొడుకు. ఒకటేకూతురు. హాయిగా కాలుమీద కాలేసుకుని కూర్చునే పరిస్థితి. మూడుతరాలు వెళ్లిపోతై. నందోరాజా భవిష్యతి....ఆయనకొడుకు నాతోపాటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ ఉద్యోగం పోతే వీధిలో నిలబడవలిసిందే!.... ఏమిటీ కర్మ?

★

"ఇటువంటి ఒడుదుడుకులు లేకుండా ఉండగలందులకే మన పూర్వీకులు వర్ణవ్యవస్థ తెచ్చిపెట్టారు. అందరికీ పనులు చూపించారు. తురకలూ, పాశ్చాత్యులూ రావటంతో అంతా పాడయిపోయింది. వాళ్లని బయటికి పంపించు, అంతా చక్కబడుతుంది," అన్నాడొక హిందూ మహాసభ మనిషి.

నమ్మకం చిక్కలేదు.

★

డైకాస్టింగు యంత్రంముందు నిలబడ్డాను. పూర్తిగా అరగంటసేపు ఏడిపించినమీదట యంత్రం సరిగా పని చెయ్యటం ప్రారంభించింది. అచ్చులు నున్నగా, నిగనిగలాడుతూ, సొట్టలూ, మట్టలూ లేకుండా రాసాగినై.

"ఆహా, ఈవిధంగా యంత్రం రోజల్లా పనిచెయ్యగూడదూ?" అన్నాడు



'పోయి [illegible]ఖలు వేసుకోరాదుటరా?'

'ఇవ్వాళ నాకు లెఖల్లో ఫస్టు మార్కు వచ్చిందినాన్నా!'

---

పనిచేసేకుర్రాడు, అచ్చుల్ని ప్రేమతో చూసుకుంటూ.

నాకాప్రశ్నకు సమాధానం తెలిసింది!

"అసంభవం," అన్నాను.

"ఏం?" అన్నాడు.

"బాగా రాకుండాపోవటానికి కారణం ఇప్పుడు మంచి అచ్చులు రావటంలోనే ఉంది," అన్నాను.

వాడు నామాట నమ్మలేకపోయినాడు.

"చూడు. బాగా వస్తున్నంతసేపూ అచ్చులు గబగబా లాగేస్తావు. లాగిన కొద్దీ నీ తొట్టిలోఉన్నలోహం తగ్గిపోతుంది. అందుకని కొత్తలోహపుదిమ్మెలు వేస్తావు. తొట్టి చల్లబడుతుంది. నీ అచ్చులు సరిగారావు. అదీకాక, నీ డై క్రమంగా వేడెక్కుతుంది. దాన్ని తగినంత చల్లబడేస్తేగాని అచ్చులు సరిగా రావు."

"తొట్టి ఎంతవేడిగా ఉండాలో, డై ఎంత చల్లగా ఉండాలో తెలిస్తే అచ్చులు బాగా వస్తాయేమో?" అన్నాడు మా వాడు.

"అంతేకాదు. తొట్టి ఏ వేగాన ఖాళీ అవుతుందో, డై ఏవేగాన వేడెక్కుతుందో తెలిసి, దానికి ఎప్పటికప్పుడు అవసరమైన చికిత్స చెయ్యగలిగితే తియ్యకుండా మంచి అచ్చులు వస్తా" యని చెప్పాను.

సంఘంలోమటుకు ఇంతేకాదా? ఒక వ్యక్తిగాని, వ్యక్తుల సముదాయంగాని శాశ్వతంగా సుఖంగా ఉండటానికి సులువుపద్ధతు లెక్కడున్నై?

ధనికుల సంతతి ధనికులుగానే ఉండగలందులకు వారసత్వంపెట్టారు. ఏమవుతున్నది? లక్షాధికారికి కాలక్రమాన లక్షమంది వారసులవుతున్నారు. దీన్ని కూడా తప్పించుకుందామని రాజరికాలకి ఒకడే వారసుణ్ణి పెట్టారు. ఈ సులువు మార్గం పనిచేసితీరాలి! పనిచేసిందా? ఆ సులువుమార్గం మూలంగానే రాజరికం సంఘానికి అనర్థంగా తయారయింది— వాళ్ల అల్లుడు వాళ్ళమ్మాయికి ఆనందం ఇవ్వటానికి అనర్హుడయినట్టుగానే.

మార్పుయొక్క తత్వాన్ని అర్థంచేసుకోకుండా, దానికి అనుగుణమైన మనుష్యప్రయత్నం చెయ్యకుండా, ఏదో ఓమంచిజాగా చూసుకుని, "అమ్మయ్య!" అని చతికిలబడి ఆమీదట శాశ్వతమైన ఆనందం పొందుదామని మానవుడు చేసే ప్రయత్నాలు ఫలించటానికి వీల్లేదు. పరిణామస్వరూపుడైన భగవంతుడామోదించడు. అటువంటిప్రయత్నాలు చేసే వాళ్లమీదికి సంఘాన్ని లేవదీస్తాడు.

—కుటుంబరావు.



# రచ్చ సావిడి

## జడలు

వామనుడు

"జడ పేరు చెప్పగానే ఆడపిల్లలు మనస్సుకు స్ఫురిస్తారు. ముసలివాళ్ళయిన ఆడవాళ్లు జడలు వేసుకోరు. అందువల్ల "జడ" అంటే పడుచు ఆడపిల్లలే కండ్లయెదుట కట్టినట్లుగా కన్పిస్తారు. మనదేశంలో నాటకాలు ఆడినరోజులలో భామకలాపం చాలా జనరంజకంగా ఉండేది. ముఖ్యంగా సత్యభామ వేషం చూడడం కోసమే జనం విరగబడేవారు. కాని ఆ భామవేషం త్వరగా తెరలోనుంచి బయటకు వచ్చేదికాదు. అలంకారం అంతా పూర్తియైనదనిన్నీ భామవేషం రంగంమీదకు రావడానికి తయారుగానే ఉన్నదని సూచించుటకున్నా కాబోలు, భామవేషగాని జడమాత్రం తెరమీదకు కొంతసేపు వ్రేలాడుతూ ఉండేది. తెరమీద జడవేసితే జనం కొంతవరకు దానినిచూస్తూ శాంతించి కూర్చుండేవారు. తరువాత గుగ్గిలంపొగ వగైరాలన్నీ వేసిన తర్వాత "సత్యభామనే" అంటూ అమ్మవారు అభినయంచేస్తూ తెరబయటికి వయ్యారంగా వచ్చేది. ఆమె జడకుచేసిన అలంకారములన్నీ శ్రద్ధగా ఆడియన్సు పరికించి చూస్తూఉంటే వారు ముఖ్యంగా ఆడవాళ్లు అటువంటి అలంకారములన్నీ తమకుకూడా ఉండవలెనని ఉవ్విళ్ళూరుతూ ఉండేవారు. తాము సత్యభామలు కావలెననిన్నీ తమ భర్తలు శ్రీకృష్ణుల వారివలె ఉండవలెననిన్నీ కోరుతూ ఉండేవారు. సత్యభామ తన కాలితో తన్నినప్పటికీ స్వామివారు ఏమీ ఆగ్రహించుకొనక, అమ్మవారి పాదమునకు నొప్పి కలిగిందేమో అని భయపడి ఆమె పాదములనుకూడా ఒత్తుతూ అమ్మవారిని స్వామివారు బుజ్జగించేరు. అమ్మవారికి కోపంవచ్చి స్వామివారిని తన కేళీగృహంలో ఉండగా తన కీల్జడతో ఫెడేలుమని కొట్టినదంటారు – కాని యివన్నీ బుజువయ్యే కేసులు కావు. ఆలుమగల్లు కొట్లాటలలో మూడోమనిషి సాక్ష్యం దొరకడం కష్టం–ఎవరు ఎవరిని ముందుగాకొట్టారో, కలహకారణం ఏవిధంగావచ్చిందోనిర్ణయించడం కష్టం–అందుచేత యీ విధమైన అయ్యవారి అమ్మవారి దొమ్మీకేసులన్నీ ప్రబంధాలలోను కావ్యాలలోను మాత్రమే ముచ్చటగా రికార్డుచేయబడినవిగాని, రచ్చకెక్కలేదు.

అయినా, పొరుగింటి పోరు వినసేరక–ఆ కారణంచేతనే శ్రీకృష్ణుల వారి అంతఃపురంలో ఏది జరిగినప్పటికీ, ఏ దాసీవాళ్ళ మూలంగానో కవులు అడిగి

తెలిసికొని, ప్రబంధాలు వ్రాసేవారని బాగా అనుమానించవచ్చు. ఏమైనప్పటికీ, అమ్మవారికి వాల్జడ, కీల్జడ అనేది ఆ రోజులలో అలంకారమే కాకుండా, అయ్యవారిని దండించుటకు కొరడా లాటి ఆయుధంగాకూడా ఉపయోగపడేదని చరిత్ర పరిశోధకులు నిర్ణయిస్తున్నారు. తన వాలుజడలో విసురుగా జోరుగా భర్త వీపుమీద సరసానికి నవ్వుతూ దెబ్బకొట్టినప్పటికీ చుర్రుమని తగులుతుంది. అయినా, అది మోట సరసం. విషయం తలుచుకుంటే, వాలుజడమీద ఉండే మోజు మొగవాళ్లకు తగ్గవచ్చు. అలంకారమని భ్రమించినటువంటిది ఆయుధంగా ప్రయోగింప బడినట్లయితే, ప్రమాదకరమేగాని ప్రమోదకరం కాదు.



పోలికలు

తలవెంట్రుకలు నిడివిగా విరివిగా నెమలి పింఛంలాగున పెరిగి విస్తరించి పిరుదులవరకు వ్రేలాడు చున్నప్పుడు జడ పొడుగుగా ఉండక మానదు.

అమ్మాయియొక్క యౌవనారంభ దశలో అవయవాల కన్నింటికీ అతిశయం వస్తుందని కవులు వర్ణించారు. ఆమె శరీరం కొన్ని తావులలో నిక్కుచు, మరికొన్నిట నీల్గుచు, మరికొన్నిట విర్రవీగుచు ఉన్నదట. "నిక్కెడు నీల్గెడు, విర్రవీగుడున్" అన్నాడు. నిక్కెడి అవయవాలు, విర్రవీగెడి అవయవాలు తెలిసినవేగాని నీల్గునటువంటిదేదో తెలియాలి. నిలువునిలువుగా పెరిగిన జుట్టు తెగనీల్గుచు క్రిందికి పిరుదులవరకు వ్రేలాడుచున్నది. "నిడుద పెన్నెరివేణి జడకుచ్చు గరువంపు బిరుదు రేఖకు గెల్పు బిరుదు చాటు"-

నిడుపుగా పెరిగి పెద్ద శిరోజములతో అల్లిన జడచివర వ్రేలాడుచున్న బంగారు జడకుచ్చులు, విజృంభించియున్న పిరుదు భాగమునకు గెల్పు బిరుదుగా (గౌరవచిహ్నంగా-బిరుదుగా ఇచ్చిన బంగారు ఆభరణంగా) అక్కడ వ్రేలాడుతూ నాట్య మాడుచున్నదని వర్ణించి, వాలుజడ శృంగారమునకు ఆ కవి ప్రాణప్రతిష్ఠ చేశాడు.

సౌరభ చిహ్నమైన మీసములో ఎంత జీవకళ ఉన్నదో వాలుజడలో అంతటి జీవకళ, శృంగారభావ కళ ఉన్నదని కాంతలు అల్లిన జడలపై కవులు పద్యము లల్లిరి.

పొడుగు జడను పొగడ నేర్వని మొగుడు, జడసొగసు తెలియని జడుడు.

పొట్టి జడలోనే ముద్దు మురిపెములుట్టిపడునని సిద్ధాంతము సైనను ఖండించ



పోలికలు

వచ్చునుగాని, పొట్టిజడ బాగుగాలేదని దానినికూడా ఖండిస్తామని వాదించడం భావ్యంకాదు. అట్టిపని అప్రాచ్యం— నగకట్టుకంటెను, తలకట్టు చనుకట్టు లిత్యాదులు "పెట్టని సొమ్ములు సుందరాంగికిన్"

కాని, అటువంటి శిరోజములను విరియబోసికొనడం శోభస్కరంకాదు. శ్రేయస్కరమును కాదు. ఈ మధ్య నొక యిల్లాలు తలకు స్నానంచేసి ఎలెక్ట్రిక్కు విసనకర్రను (ఫాన్‌ను) మేజాబల్లమీద పెట్టి కురులు బల్లమీద ఆరబెట్టుకొనను కుర్చీలో తనభర్త కెదురుగా కూర్చుండి ముచ్చటలాడుతోంది. ఆ చల్లనిపిల్లగాలిలో తల వెంట్రుకలు ఎగిరి ఎలెక్ట్రిక్కుఫాన్ చక్రపు ఆకుల మధ్య చిక్కుకొని ఆమె తలవెంట్రుకలనుపట్టి దుశ్శాసనుడు యీడ్చినట్లయింది. ఇంతలో భర్త వెంటనే స్విచ్చి త్రిప్పి ఎలెక్ట్రిక్కు వీవన యంత్రాన్ని ఆపీవేసి ఆమెకు ప్రాణంగండం తప్పించాడు. తల విరియబోసికొనుటకంటె జడ వేసికొనడమే శ్రేయస్కరం - శుభకరం.

తల దువ్వుకొనకుండా చిరకాలం తన తల వెంట్రుకలను ముడి వేసికొనకుండా ఒక్క ద్రౌపదీదేవి మాత్రమే దీక్షవహించి ఉంది. దుర్యోధనుని తొడలనుచీల్చి ఆ రక్తమును ఆమె కురులకు పూసి తల ముడివేస్తానని భీముడు శపథం చేసాడు. ఆఖరుకు ఆ ప్రకారంగా ఆమెకు వేణీసంహారం చేశాడు (తల ముడివేశాడు). వేణీసంహారం అంటే వెంట్రుకలు కత్తిరించి బాబింగు చేయడంకాదు. భారతదేశముయొక్క పటమునే భారతమాత ఆకారంగా నేర్పుగా చిత్రకారుడొకడు చిత్రించాడు. భారతమాతయొక్క నిడుపైన వెంట్రుకలనే విస్తరించిన హిమాలయ పర్వత శ్రేణిలాగున చిత్రించాడు. భారతమాత తల విరబోసుకున్నట్లుగా చిత్రింపబడి యున్నది. పాంచాలివలె భారతమాతకూడా ఏదైనాదీక్షవహించి యున్నదేమో అనే సంశయం కలుగుతోంది.

నిజంగా ఆలోచిస్తే భారతమాతకు ఇంకా జుట్టు ముడివేయవలసియున్నది. ఏజాతికి ఆ జాతికి ఏ కులమునకు ఆ కులము, ఏ మతమునకు ఆ మతము భిన్న భిన్నముగా విచ్ఛిన్నమైయున్న భారత జాతిని తేల్చి దిద్ది సంపుటీకరించి సొగసుగా జడ యల్లవలసియున్నది. ఒక్కటే సమాఖ్య ప్రభుత్వం (ఫెడరేషను) ఇండియాలో ఏర్పడాలి. అఖండ హిందూస్థాన్ కావాలి; అనేక నాగరికతలు, అనేక విజ్ఞాన సంప్రదాయ

ములు యీ దేశంలో వెలసినమాట నిజమే. కాని, దువ్వెన కురులను పాయలుగాతీసి చక్కని చదయల్లినట్లుగా, ఒక్కటే సమాఖ్యలోనికి భారతజాతిని తీసికొని రావాలి-గంగా యమునా సరస్వతులనే మూడు ప్రవాహాలు కలిసిన గంగా వాహిని లోకపావనియై భుక్తి ముక్తి ప్రదాయినియై ప్రవహిస్తోంది. అది శివుని జటాజూటంలోనుంచి ఉద్భవించింది.

మహా తపస్సంపన్నులైన వారి జడలలోనుంచి ఉద్భవించినదే గంగ-యుగయుగాంతరములు విజ్ఞాన పరంపరలన్నీ వారి తలలో జడలు కట్టిపోయినప్పుడు, ఆ జడలలోనుంచి నూతన తేజోప్రవాహం వస్తుంది. కాని, అవికూడా ప్రవాహాలతో సమ్మేళనం పొందుతుంది. ఇతర సంస్కార వాసనల సమ్మేళనం పొందినప్పటికీ దాని వ్యక్తిత్వం చెడకుండా ఉంటుంది.

యమునా సరస్వతులు గంగలో కలిసినందువల్ల చివరకు ఏర్పడిన మహాప్రవాహమును గంగాప్రవాహమే అన్నారు.

మన వర్తమానకాల ఉద్యమములలో గత పురపాంతరమువారి సంస్కారవికాసం ప్రతిఫలిస్తూనే ఉంటుంది. భవిష్యత్తును గూర్చిన మన స్వప్నలీలలు అనేక ఆదర్శముల రూపమున మన వర్తమానకాల ఉద్యమములను నడిపిస్తూనే ఉంటాయి. పూర్వవాసనలున్నూ, భవిష్యదాదర్శములున్నూ, మన ప్రస్తుత ఉద్యమంలో లీనమై ఉన్నాయి. కాని, యిది యీ కాలంలో మనము సాగించేవర్తమానకాల ఆధునిక సంస్థగానే వర్తిస్తూ ఉంటుంది. భూత భవిష్యద్వర్తమానము త్రివేణీ సంగమమే యీ కాలప్రవాహం. ఇదియే శివుని తలమీద యుగయుగాలనుంచిన్నీ అభేద్యంగా అల్లుకొని పోయిన జడ-కాని, జటాధరుడు జడత్వం వహించి స్థాణుడై ఉన్నాడు. ఆ జడలోనుంచి వచ్చినదే. జలం ఇదివడిగా ప్రవహిస్తూంది. జలం - చంచలం - రసభరితమైనది జడ - రసోత్పత్తి స్థానము ఈశ్వరుని జట - రససిద్ధి పొందిన వాల్మీకాది మహాకవులు జడదారులే. ఈ నిర్వ్యుత్పావసవల్లనే జడభరతుడు ముక్తిని సాధించాడు.

"కూకటుల్ గొలిచి చేసిన కూరిమి సోమిదమ్మ సౌఖ్యావహమై భజింప" అని ప్రవరుని అనుకూల దాంపత్యం వర్ణించాడు. అల్లసాని పెద్దన్నగారు పెళ్ళినాడే వధూవరులకు జుట్లుకొలిచి యీడు జోడు అని నిర్ణయించి చేసినారట. పిల్లల మేలుకోరు తలిదండ్రులు చేసిన వివాహాలు అవి. ప్రజల మేలుకోరి ప్రభువులుకూడా రాజ్యాంగ తంత్రాలు చెయ్యాలి. ప్రజాస్వాతంత్ర్యం అనే మాటనీటిమూట. ప్రజలకు స్వాతంత్ర్యం లేదు. ప్రపంచానుభావం లేని పిల్లల వంటివారు ప్రజలు. దూరదృష్టిగల పెద్దలనేవారు ఆశ్రయిస్తారు. ఏ పార్టీనాయకులైనప్పటికీ సామాన్య ప్రజలక్షేమం కోసం రాజ్యాంగ తంత్రాలు చెయ్యాలి. తమ అహంకారాన్ని వారు చంపుకోవాలి. ప్రజాసామాన్యక్షేమం ప్రధానంగా చూడాలి. ప్రజాసామాన్యక్షేమమే ప్రధాన లక్ష్యమైతే, ప్రపంచమంతా ఒక్కటే అంతర్జాతీయ జటాజూటం అవుతుంది.

ఆదేశివంకరం - మంగళకరం !!!

# కాలేజీ ప్రపంచం



[ఈ శీర్షికక్రింద విద్యార్థులు వ్రాసినరచనలు ప్రకటిస్తాము]

## నీవూ యింతేనా?

రాత్రి ఎంటర్‌టెయిన్‌మెంటు అయిన తర్వాత వస్తున్నాను. వీధుల్లో ఎవరూలేరు. మావీధి మలుపు తిరిగే టప్పటికి వీధి దీపాల మినుకుమినుకు వెల్తుర్లో ఇద్దరు పోతున్నట్టు తోచింది. మొదట ఎవరో ఆమె పోతున్నది. వెనుక యింకొకడు స్టూడెంటులాగే వున్నాడు; 10 గజాలదూరములో పోతు న్నాడు. ఎవరాఅని కుతూహలము కలి గింది. అట్లే చూస్తూ నేను నీడలో వస్తున్నాను; వెనుకపోతున్న వ్యక్తి చుట్టూ ఒక్కమారుచూచి 'సరస్వతీ!' అని ముందుపోతున్న ఆమెను పిలిచాడు. ఆమె తిరిగిచూడకుండా త్వరితగమనము సాగిస్తూంది. 'సరస్వతీ!' అన్నమాట వినగానే తెలుసుకున్నాను. మా క్లాస్ మేటే! మాయింటి మలుపు తిరిగిన తర్వాత పదోయింట్లో వుందామె. వాళ్లు కొత్తగానే ఆయింటికి వచ్చారు. అప్పటికి కాలేజీ తెరిచి ఒక నెల రోజులుమాత్రమే అయింది. ఆమె అక్కడుందని తెలుసు; కాని ఎప్పుడు ఆమెతో మాట్లాడిందిలేదు. ఆ 'సరస్వతీ!' అని పిలిచిన కంఠస్వర మెవరిదో కూడా చప్పున పోల్చుకున్నాను మాక్లాసులో వున్నాడులెండి 'గోపాల్'.. వాడు పెద్దగల్లంతు చేస్తుంటాడు. తుంటరికూడా. చాలాసార్లు క్లాసులో ఆడ పిల్లల్ని వేళాకోళము చేయడము—బోర్డు మీద కోతిబొమ్మల్ని వేసి ఏమేమో రాయ టము, ఇవంతా సాగిస్తుంటాడు. ఇప్పుడు వాని అభిప్రాయమేమిటో బాగా బోధపడింది. ఈమె ఒంటరిగా వస్తుం డటముచూచి వీడు వెంటపడివుంటాడని తెలుసుకున్నాను. వీడెంతకైనా తెగించే మనిషే! పాప మా అమ్మాయి భయ పడుతూ అట్లే వేగముగా వెళుతోంది. ఆమెను Save చేయటానికి నేను చప్పున 'గోపాల్, హల్లో,' అన్నాను. వాడు వెనక్కి తిరిగిచూచి నిలబడిపోయాడు. నేనా పిలుపువిన్నా నేమోఅని సందే హము పట్టుకున్నట్టుంది. అందువల్ల 'ఏమిటోయ్, అల్లా పోకుండా మా వీధి వెంబడి వస్తున్నావే?' అన్నాను. 'ఆఁ,



"ఫోండి, నేను పరిచయం లేనివాళ్ళతో మాట్లాడను."
"అయితే ముందు పరిచయం చేసుకుందాము పట్టండి."

ఏమీలేదు! రెడ్డితో పనుండి అతడిరూము కెళ్లాలని వస్తున్నాను' అంటూ ఏదో చెప్పాడు—ఇంతలో, ఆమె యిల్లు చేరి వుంటుందనుకొని 'సరే, Good night' 'వెళ్తాను' అంటూ యింట్లోకి వెళ్ళి పోయాను.

ఇది జరిగినతర్వాత రెండోదినము సాయంత్రము కాలేజీనుంచి వస్తున్నాను. సరస్వతి నాకు కొంచం దూరములో పోతోంది. ఇంతలో ఆమె నోటుబుక్కు నుండి ఏదో కాగితము క్రిందపడిపో యింది. ఆమె చూసుకోకుండా అలాగే వెళ్తోంది. నేను దగ్గరికెళ్లి చూస్తే ఏవో నోట్సు. పాపం! పుస్తకములో పెట్టుకొని వుంటే జారి పడిపోయింది. గబగబ నడచివెళ్లి ఆమెను కలుసుకున్నాను. నోట్సు అందిస్తూ 'ఏమండీ, యిది మీ Book లోంచి జారి పడిపోయినట్లుంది' అన్నాను. అమె తీసికొని తడబడుతూ "ఆఁ, Thanks" అంది. ఇద్దరమూ అట్లే నడిచివెళ్తున్నాము. నాకామెతో యింకా మాట్లాడాలనిపించింది. రోజూ ఆమే. ఆమెచెల్లెలు వస్తుండేవాళ్లు— అందువల్ల అన్నాను. "ఈ దినము మీ రొక్కరే వస్తున్నట్లున్నారే. మీచెల్లెలు రాలేదా?" "లేదండీ, నాలుగురోజు ల్నుంచీ జ్వరము వస్తోంది" అంది. "మొన్న మీరు ఎంటర్‌టెయిన్‌మెం టుకుకూడా ఒక్కరే వచ్చినట్లున్నారే?" అన్నాను. "ఆఁ - నేనూ హేమలత వచ్చాము. ఆమె రాత్రి వాళ్ళఫ్రెండ్సుతో హాస్టల్లో వుండిపోయింది. నేనొక్కర్తె వచ్చాను" అంది. తర్వాత నేనేమీ మాట్లాడలేదు. ఆమెను ఒంటిగావిడిచి ఆ హేమలత ఎట్లా వుండిపోయిందో? పాపం, నేను వుండబట్టికాని లేకుంటే

గోపాల్ ఎంతకు తెగించివుండునోవాడు: అనుకుంటుంటే మాయిల్లు వచ్చేసింది. "వెళ్తాను" అంటూ యింట్లో దూరాను.

మరుసటిరోజు ప్రొద్దున్నే నేను కాలేజికి వెళ్ళాలని డ్రెస్సుచేసుకొని పుస్తకాలు తీసుకొంటున్నాను. మా అమ్మ వచ్చింది. "అదో వాళ్ళ అమ్మాయి వచ్చింది. మీక్లాసులో చదువుతుండలా, వెళ్ళిచూడు!" అంది. నేను వెళ్ళాను. ఆమె Leave Letter యిచ్చి Principal's office లో యివ్వమంది. వాళ్ళ అన్న అదేదో వూళ్ళోవున్నాట్ట—తండ్రి లేడు; తల్లి, చెల్లెలు, తాను ఇక్కడున్నారు. వాళ్ళఅన్న డబ్బు పంపుతుండేటట్టుంది. అకస్మాత్తుగా వాళ్ళన్నకూడా అక్కడ బాగాలేదని నిన్న వుత్తరము వచ్చిందట. అందువల్ల వాళ్ళమ్మ తప్పనిసరిగా వెళ్లాలి. ఇంక యింట్లో చెల్లాయికి జ్వరము. తాను యింట్లో చూసుకోవాలి. కాలేజికి Leave పెట్టింది. 'సరే' నని Leave Letter తీసుకొన్నాను.

నాకు సరస్వతిస్థితే మనస్సులో మాటిమాటికి తలపుకొస్తోంది. ఇంట్లో మగదిక్కులేరు. వాళ్ళమ్మ ఒక్కతే. తాను వయసులోవుంది. మరీ వాళ్ళ పరిస్థితి చూస్తే అందరికీ అలుసే. లేనిది ఆ గోపాల్‌గాడి కంత ధైర్యమా? నా కామె మీద ఒకవిధంగా జాలికలిగింది. మరునాడు సాయంత్రము వాళ్ళింటికెళ్ళాను. ఆమె లోపలవుంది కామోసు, మెల్లగా హాల్లోకివెళ్ళి 'సరస్వతీ!' అని పిలిచాను. ఆమెవచ్చింది; "కూర్చోండి" అన్నది. కూర్చున్నాను. "డాక్టరెవరు?" "జ్వర మెట్లావుంది?" అంటూ ప్రశ్నలు సాగించాను. "మీ కేమైనా సాయం కావాల్సుంటే నా చేతనైంది చేస్తాను, చెప్పండి" అన్నాను. ఆమె కొంచము సేపు అట్లేవుండి, నా ముఖంలోకి చూసి అంది "ఇంకేమీలేదు; మీరేమీ అనుకోకుంటే పొద్దున్నే డాక్టరువచ్చేవేళ, ఒకసారివచ్చి అతనితో మాట్లాడిపొండి; నాకు అతనితో మాట్లాడాలంటే ఏట్లోవుంటుంది. అతను అదోమాదిరిగా చూస్తాడు" అంది. నేను అర్థము చేసుకున్నాను. ఒంటిగా, అనాధగా వుండే ఆడదాన్నిచూస్తే ఏ మగాడికైనా అట్లే వుంటుందేమో! ఆ డాక్టరు రామారావు కొత్తగానే వచ్చాడు. నే నెరుగున్నవాడే; "సరే, తప్పకుండావస్తా" నంటూ వచ్చేశాను.

తర్వాత రెండుమూడు దినాలు డాక్టరు వచ్చే వేళకుపోయి అతనితో పథ్యాన్ని గురించి, మందునుగురించి మాట్లాడేవాణ్ణి. అతడు వెళ్ళినతర్వాత ఆమెతో అట్లే మాట్లాడుతుండేవాణ్ణి. ఆమె సహృదయము నాకు చాలా ఆనందం కలిగించింది. అరమరికలేకుండా మాట్లాడేది. ఎప్పుడూ నవ్వుతూ వుంటుంది. ఏదోవిషయాలు—క్లాసు విషయాలు-సంసారపు గొడవలు చెప్తుతుంటుంది.

సరస్వతి చెల్లెలికి బాగా నయమైంది. నేనుమాత్రము వాళ్ళింటికి తప్పకుండా ప్రతిసాయంత్రము వెళ్ళేవాణ్ణి. ఆరోజు శనివారము—సాయంత్రము 5½ గంటల వేళ వెళ్లాను. ఆమె అద్దముముందు నుంచొని తల దువ్వుకుంటుంది. నేను కుర్చీలో కూర్చొని చూస్తున్నాను. నేను యిన్నాళ్లు గమనించని విశిష్టత, ఆకర్షణ ఆమెలో గోచరించింది. ఆ పొడుగ్గా వ్రేలాడే, నల్లటివెంట్రుకలు. అద్దములో ప్రతిబింబించిన ఆ చిరునవ్వు ముఖము, ఆ కళ్లల్లోఆకర్షణ నన్నేదో పిచ్చివాణ్ణిగా చేసింది. అల్లే కూర్చున్నాను ఆమె అందాన్ని ఆనందిస్తూ. జడ అల్లుకోవటము పూర్తిచేసి నా దగ్గరగావచ్చి నిలబడి, 'ఏమిటివ్వాళమాత్రం పరధ్యానం' అంది. నేనామె ముఖంలోకి చూశాను. నాకేదో మనసులో చెప్పరానికోరిక కలిగింది. 'నేడు చాల అందముగావున్నావు సరస్వతీ!' అన్నాను. ఆమెముఖములో చిరునవ్వు మాయమైనది. కాని నేను గమనించలేదు. అనేశాను "నేను నిన్ను ప్రేమిస్తున్నాను. సరా!" అంటూ చెయ్యి పట్టుకోబోయాను. ఆమె కళ్లల్లో నీళ్లు గిర్రునతిరిగాయి. కొంచముదూరముగా పోయి "అన్నా! నీవూ యింతేనా?" అన్నది. ఆ వాక్యము నాకెట్లానోవచ్చి తగిలింది. ఆమెతోడి స్నేహము మొదటి నుంచి నామనస్సులో తిరిగింది. సిగ్గుతో తలవంచుకుని చప్పున లేచి వచ్చేశాను. ఆమె ముఖం చూడలేకపోయాను. ఇంటికివెళ్ళి ఆలోచించాను. ఆమెను ఆరాత్రి రక్షించింది — ఆమె నన్ను తన యింటికిరమ్మని కోరింది. ఎందుకూ? ఏ దృష్టితో లోకం ఆమెను వెంబడిస్తూందో, అనాధగాగుర్తించి, ఆ దృష్టి నుంచి తప్పించుకోవాలని నా నీడలో చేరింది. కాని నాకూ అలాంటి తలపే కలిగింది. నేనూ లోకములో ఒక్కణ్ణేగా! "నేను ప్రేమిస్తున్నా" నని చెప్పానే! ప్రేమంటే యిదేనా? మనుష్యులు వాళ్లుకోరేతుచ్ఛ వాంఛలకన్నిటికీ పెద్దపేర్లు పెడతారుకాబోలు!

మరునాడు ఆమెయింటికి వెళ్లాను, క్షమార్పణ కోరుకుందామని. నేరుగా వంటయింట్లోకి వెళ్లాను. పకోడీలు కాలుస్తూంది. పళ్లెములోవేసి నవ్వుతూ తెచ్చింది. తలవంచుకుని "నన్ను క్షమించవు, చెల్లీ?" అన్నా. "నీవు నారెండో అన్నవు; చిన్నన్నవు!—నేను క్షమించడమేమిటి — రా, పకోడీలు తిందాము." అంటూ నన్ను చెయ్యిపట్టుకు తీసికెళ్లింది.

రాటకొండ సుదర్శనచౌదరి,
క్రిస్టియన్ కాలేజి, మదరాసు.



# మైకూ

ప్రేమచంద్.........

ఖాదరూ మైకూ కల్లుదుకాణం దగ్గరికి చేరేవరకు కాంగ్రెసు వాలంటీర్లు అక్కడ జండాలు పుచ్చుకుని తయారుగా ఉన్నారు. వాళ్ళను చుట్టుముట్టి వేలకొలది జనం. పొద్దుకూకబోతూ ఉంది. ఈవేళ టప్పుడు పెద్ద మనుషులెవరూ ఈ గల్లీ వంకకూడా తిరిగి చూడరు. తాగుబోతులు మాత్రం ముఠాలు ముఠాలుగా వస్తూ పోతూ ఉంటారు. వేశ్యలుకూడా ఒకరిద్దరు అక్కడ ఉండడంకద్దు, ఇవ్వాళకూడా ఉన్నారు. మైకూ ఆ జనాన్ని చూసి- "జనం చాలామంది పోగయ్యారురా! ఓ వెయ్యిమందన్నా ఉండరూ?" అన్నాడు ఖాదరుతో.

ఖాదరు నవ్వి—'జనాన్ని చూసి భయపడ్డావేమిటి? వీళ్ళంతా హూత్ అంటే పారిపోయేవాళ్లే—వీళ్లు తమాషా చూట్టానికి వచ్చారుగాని దెబ్బలు తింటానికి కాదు!' అన్నాడు.

'పోలీసోళ్లుకూడా ఉండారే! మరి ఈళ్లు నోరెత్తరన్నాడే, కంచరాక్టరు!' అన్నాడు మైకూ సందేహాన్ని వెలిబుస్తూ.

'అవునుబే! పోలీసోళ్లు మెదలరు, ఎందుకంత గాభరాపడతావు? నాలుగు దెబ్బలు రాలితేనో, ఆడోళ్ళ విషయంలోనూ పోలీసోళ్లు జోక్యం చేసుకుంటారుగాని, లాభం లేనిదాంటో అసలు వేలుపెడతారా? పైగా ఆసరాఇస్తారు. యీడాదికి ఎంత డబ్బు తింటారనుకున్నావు ఈ కంచరాక్టర్ల దగ్గర?' అన్నాడు ఖాదరు.

'పద, మనక్కూడా పదిరాళ్ళు చేతులోపడ్డయి—పైగా తాగినంత కల్లు. అది సరేగాని, ఈ కాంగ్రెసోళ్ళలో చానాడబ్బునోళ్లు ఉన్నారంట. వాళ్లు తలుచుకుంటే మన పని పట్టరూ?' అన్నాడు మైకూ.

'ఎందుకురా అంత జారిపోతావు. కాంగ్రెసోళ్లు తలుచుకునే రకం కాదు. వాళ్లనిచంపినా కుంయ్ కుంయ్ మనరు, లేకపోతే ఆయాల మీటింగులో పది మందివచ్చి పదేలమందిని బాదేవాళ్లా? నలుగురు అక్కడే చచ్చారు - కాని ఒక్కడూకూడా ఎదురు తిరగలేదు. ఈళ్ళ సాయకుడున్నాడే మహా మెతకరా! చచ్చినా సరే, ఎదురు తిరగ వద్దంటాడట' అన్నాడు ఖాదరు.

ఇలా మాట్లాడుకుంటూ ఇద్దరూ కల్లు దుకాణం ముందుకొచ్చారు. ఒక వాలంటీరు వాళ్ళ ఇద్దరిదగ్గరికీ వచ్చి 'భాయీ! మీ మతంలో కల్లు తాగటం తప్పు!'

అన్నాడు చేతులు జోడించి.

దీనికి సమాధానం మైకూ దెబ్బతో చెప్పాడు. దెబ్బ బలువుగా పడటం వల్ల వాలంటీరు కళ్లు బైర్లుకమ్మినై. అయిదేళ్ళూ అట్టతేలినై, పడబోతూ ఉండగా రెండో వాలంటీరు పట్టుకున్నాడు.

వాలంటీరు దెబ్బతినికూడా అక్కడి నించి కదలలేదు.

'దారి తొలుగుతావా, ఇంకేమైనా కావాలా?' అన్నాడు మైకూ.

'ఇదుగో, మీఇష్టం వచ్చినట్టు కొట్టుకోండి. కాని లోపలికి మాత్రం పోవద్దు!' అని వాలంటీరు విధేయతతో మైకూ ముందు కూర్చున్నాడు.

మైకూ వాలంటీరు ముఖంవంక చూశాడు. అతని బుగ్గమీద అయిదేళ్లూ తేలిఉన్నై. ఇదివరకు మైకూ లాఠీతో యెందరి బుర్రలో బద్దలు కొట్టాడుగాని ఒక్క మాటుకూడా పశ్చాత్తాప పడలేదు. ఇవ్వాళ ఈ అయిదేళ్ళూ అయిదు శూలాలలాగా అతని హృదయం గుచ్చుకున్నై.

'చూస్తావేమిటిరా? ఇంకోటి గట్టిగా ఇవ్వక?' అన్నాడు ఖాదరు బీడీ పీలుస్తూ.

'ఇదుగో! నువ్వులేచి నన్ను లోపలికి పోనియ్యి!' అన్నాడు మైకూ వాలంటీరుతో.

'మీరు నా పైగా వెళ్లిపోండి.' అన్నాడు వాలంటీరు.

'నామాటవిను. నేను తాగటానికి కాదు. వేరేపని ఉండిపోతున్నాను. నన్ను పోనివ్వు!' అన్నాడు మైకూ.

వాలంటీరు దారి తొలిగాడు, మైకూ నవ్వుతుంటూ అతనివంక చూశాడు. వాలంటీరు నమస్కారంచేస్తూ—'మాట తప్పకండి' అన్నాడు.

'దెబ్బతో దెయ్యం పారిపోయింది. ఒక్క చెంపదెబ్బతో!' అన్నాడు పోలీసు.

'వాడు బలికిఉండంతకాలం ఆదెబ్బ మరిచిపోడు. అందుట్లో మైకూ దెబ్బ!' అన్నాడు ఖాదరు.

'ఈళ్లు ఇక్కడికి రాకుండా బుద్ధొచ్చేటట్టు తన్నండి!' అన్నాడు పోలీసు.

'ఈళ్ళకి పాణాలంటే లెక్ఖలేదు. యెర్రిదైర్యం.' అన్నాడు ఖాదరు.

## 2

మైకూ లోపలిక అడుగుపెట్టగానే కంట్రాక్టరు 'స్వాగతమిచ్చి—'ఒక్క చెంపదెబ్బతోటే ఊరుకున్నావేం? ఆ దెబ్బ ఏమూలా? సిగ్గులేని ఎదవలు. ఇవ్వాళ పక్కలిరిగేటట్టు తంతే రేపన్నా రారు.' అన్నాడు కంట్రాక్టరు

'వీళ్లు రాకపోతే ఇంకొకళ్లొస్తారు.' అన్నాడు మైకూ.

'ఆఁ, రాకేం! రావాలంటే గుండెలుండొద్దూ?'

'మరి ఈచేరిన గుంపంతా నన్ను తంతేనో?' అన్నాడు మైకూ.

'పోలీసులు లేరూ? ఒక్కక్షణంలో వెళ్లగొడతారు అందర్నీ. సరే, ఈలోపల కాస్తె పుచ్చుకో, డబ్బు అక్కర్లేదులే.'

'వీళ్ళఅందరిక్కూడా ఊరిక నేనా?' అన్నాడు మైకూ.

'ఏంచేసేది? ఎవడూ రాలేదు! ఊరికనే అనేవరకు విరుచుకుపడ్డారు.'

'నేనివ్వాళ తాగను.' అన్నాడు మైకూ.

'ఎందుకని? నీకోసమని తాజాకల్లు తెప్పించాను.'

‘ఊరికనే ఇవ్వాళ తాగాలనిపించటంలేదు, సరే...వీళ్ళని చేత్తో ఎట్లా బాదేది? కర్రపట్టుకురా.’ అన్నాడు మైకూ.

కంట్రాక్టరు ఒక్కగంతున లోపలికి పోయి కర్ర తెచ్చి యిచ్చి, తమాషా చూట్టానికి వాకిట్లో నిలబడ్డాడు.

మైకూ కర్ర చేతికితీసుకుని, సడింపు చూసి, మొట్ట మొదటదెబ్బ కంట్రాక్టరునే వేశాడు, ఆదెబ్బతో కంట్రాక్టరు విరుచుకుపడ్డాడు. ఆతర్వాత ఒక్కొక్కణ్ణే త్రాగుబోతువాళ్ళను బాదటం మొదలుపెట్టాడు.

త్రాగుబోతుల మత్తు కాస్తా దిగిపోయింది. తత్తరబోయి పారిపోవటం మొదలుపెట్టారు. వాకిట్లో కంట్రాక్టరు పడిఉన్నాడు. అతన్ని తొక్కుకుంటూ అందరూ కాలికి బుద్ధిచెప్పారు.

లోపల కుండలు పగిలినమోత వినపడింది. వాలంటీరు లోపలికి తొంగి చూసి-‘నీకసి మామీద తీర్చుకోకపోయావా?’ అన్నాడు.

మైకూ మాట్లాడలేదు. మిగతా కుండలూ, సీసాలూ పొడిపొడిచేసి పోతూపోతూ కంట్రాక్టర్ని ఒక్క తన్ను తన్ని బయటికొచ్చాడు.

‘నువ్వు ఏంచేయటానికొచ్చి ఏం చేశావురా?’ అన్నాడు ఖాదరు.

మైకూ కళ్ళెర్రజేసి వాడివంకచూసి అన్నాడు— ‘ఒకటి చేయటానికొచ్చి ఒకటి చేసినందుకు నేను భగవంతుడికి మొక్కుతున్నా, నీలో శక్తిఉంటే వాళ్ళనికొట్టు—నాకిక ఓపికలేదు. నేనిదివరకు కొట్టినదెబ్బకే బాధపడుతున్నాను; ఇకముందుకూడా పడతాను. ఇతర్లు పాపకార్యాలు చేస్తుంటే వాళ్లని తప్పించటానికి ప్రాణాలు ఒడ్డేవాడు ఎంత గొప్పవాడు, ఇక వాళ్ళని కొట్టటానికి పొయ్యేవాడు ఎంత వెధవ! ఎంత శుంఠ! మైకూ రౌడీ, పేచీకోరు-కాని, నీచుడూ, మగసిరిలేనివాడు కాడు. పోయి పోలీసులతో చెప్పు, అరెస్టు చేసుకోమని.’

కొంతమంది త్రాగుబోతులు తల గోక్కుంటూ మైకూవంక చూస్తున్నారు. కొంతమందికి మాట్లాడడానికి అసలు గుండెచాలటంలేదు, ఆ-‘ఏయ్! నేను రేపు మళ్ళీవస్తాను. ఈ ప్రాంతాల కనిపించారా తోలువొలుస్తా. నాకు జైలన్నా ఉరిఅన్నాకూడా లెఖ్ఖలేదు. ఇటురాకండా మర్యాద కాపాడుకోండి, కాంగ్రెసువాళ్లు మీ విరోధులు కారు. మీకోసం,మీపిల్లల క్షేమంకోసం మిమ్మల్ని తాగవద్దంటున్నారు. ఈ డబ్బుతో కడుపునిండాతిని పిల్లల్ని కాపాడుకోండి, ఇంట్లోచూస్తే పొయ్యిరాజదు-పెళ్ళాం బిడ్డలు మీఎదానపడి ఏడుస్తూఉంటారు. మీరుతాగి తందనాలాడుతున్నారు.’

మైకూ కర్ర అక్కడపారేసి ఇంటికి బయలుదేరాడు. అక్కడ చేరిన వేలకొలది జనం అతన్ని శ్రద్ధాభక్తులతో చూస్తూ నుంచున్నారు.

—ఈ. ల. అనువాదం.



కృష్ణవేణి

గొల్లభామలో



★ ★ మంగళం

మాయా మచ్ఛీంద్రలో



★ సుందరీబాయి

కణ్ణమ్మ ఎన్ కాదలిలో



ఆ నా డూ



ఈ నా డూ




# సంస్కార లక్షణాలేనా యివి?

ఎస్. అన్నపూర్ణాదేవి

రైల్లో ఖాళీగావుందాఅని అడిగితే, "ఆ యేమిటిఖాళీ నామొఖం! అబ్బబ్బ యేమిజనం! యెంత అవస్త! నిజంగా యీరోజుల్లో ప్రయాణం చెయ్యకూడదు" అంటారు. ఇది నిజమైనా కాకపోయినా నాఅనుభవముబట్టి చెప్పవలసివస్తే ఆడవాళ్లం ఆడవాళ్లపెట్టెలో ప్రయాణం చెయ్యకూడదు, ఎంతైనా ఆ మొగాళ్ళే కాస్త నయం; జాలితలుస్తారు. వారు అవస్తపడుతున్నా, "ఆడవాళ్లు, పాపం" అంటూవున్న ఆ కాస్తలోనే కాస్త సదుపాయము చేస్తారు.

ఈనాడు, రైళ్లల్లో, బస్సుల్లో, ట్రాముల్లో అవస్థ నిత్యమూ చిన్నాపెద్దా అంతా అనుభవిస్తున్నదే; ఇది నిత్యము వుంటూవున్నదే.

నలుగురు స్త్రీలు బస్సులోగాని, ట్రాములోగాని యెక్కితే స్థలం లేనప్పుడు, ఆ నలువురుస్త్రీలకూ చోటు యివ్వడానికని పదిమంది మగాళ్ళు లేవబోతారు. మనం చక్కగా సర్దుకుని కూర్చుంటాం. మగవాళ్లు మనకోసం అలా మర్యాద చూపుతున్నప్పుడు మరొకచోట యిద్దరుస్త్రీలు బండియెక్కినప్పుడు, యింతసేపూ ప్రయాణము చేస్తున్న మనంలేచి వారికి స్థలంయివ్వడం భావ్యం. ఇంకో యిద్దరు మగవాళ్ల లేస్తూంటే చూస్తూవూరుకోవడం మర్యాద కాదు. —ఆడవాళ్ళకు మగాళ్ళు చోటు యిచ్చి అవస్తపడుతున్నప్పుడు, ఆడవాళ్ళకు ఆడవాళ్ళు చోటుయివ్వడం అవసరం కాదూ? తోటిస్త్రీకి ఆమాత్రం సదుపాయము చేయకూడదూ? 'మేము స్త్రీలం, మేము మీకన్నా యెక్కువ సుకుమారులం; మా కోసం మగాళ్లు బాధపడాలిగాని, మాకు మేం బాధపడవలసిన అవసరంలేదు.' అన్నట్టు స్త్రీలం ప్రవర్తిస్తున్నామనిపిస్తున్నది. ఈభావమూ ఈవిధమైన ప్రవర్తనా అహంకారమూ విద్యావతులైన స్త్రీలలో మరీ యెక్కువగా కనబడుతూవుంది.

మొన్న జరిగిన వొక్క విషయము: అది అసలే చిన్న కంపార్టుమెంటు. దానిలో అప్పటికి పదిమంది వున్నారు. పైరెండుబెర్తుల్లూ సామానుతోనింపారు. కొందరో గొప్పో చదువుకున్నవారే, అందులో యిద్దరుమాత్రం చెరోపరుపూ పరుచుకుని పేపర్లొకరూ, పుస్తకాలొకరూ ముందువేసుకుని కూర్చున్నారు. బండిలో యెక్కిన మిగిలిన స్త్రీలు యెక్కడ కూర్చోవాలని వారివుద్దేశం? 'కొంతసేపైతే వారే సర్దుకుంటారు' అని

వొకామె, 'ఆ వీరేనా డబ్బుయిచ్చారు మేం యివ్వలేదూ?' అని యింకోఆమె; 'కాస్త ముందువస్తే బాగుండేది యీ యిబ్బంది లేకపోయేది' అని మరొక ఆమె, ఇలా యిష్టంవచ్చినట్లు అను కుంటూ అవస్తపడుతున్నారు.

"చంటిపిల్లలతో యిలా యెంతసేపు నిలబడ్డం, కాస్త ఆ పరుపు తియ్యండి, మరోముగ్గురు కూర్చునే స్థలంవుంది." అంటూ వొక చంటిపిల్లతల్లి చొరవచేసి కాస్తపరుపు వొత్తిగించి కూర్చుంది.

దాంతో ఆ చదువుల స ర స్వ తి కి యెక్కడాలేని కోపం వచ్చింది. చర్రు మంటూ లేచింది. ఆమె చదువుకున్న యింగ్లీషంతా వరదలాపొర్లింది. "వీళ్ల మొద్దులు, మర్యాద తెలియదూ మట్టూ తెలియదు" అంటూ వొక్కలాగే—కళ్ల యింతలేసి చేసుకుంటూ వాగింది. గార్డుని పిలుస్తానంది; పోలీసులను పిలుస్తానంది. పోయి పక్కపెట్టెలో యెక్కు' అంటూ ఆమె కూర్చున్నంతసేపూ పోట్లాడు తూనే వుంది. అంతేగాని 'అయ్యో పాపం, మనలాగే ఆమెకూడా ప్రయాణం చేస్తున్నది; మనం అంతావొకటి, మనలో మనం సర్దుకొనకపోతే యెలాగు' అనే జ్ఞానమాత్రం ఆమెకు లేకపోయింది.

బండి జంక్షన్ స్టేషన్‌లో ఆగింది. అప్పుడు అంతవరకూ పడుతున్న యీ బాధమరి పడలేక చంటిపిల్ల తల్లితో దిగి పక్కపెట్టెలో యెక్కాము. ఆ పెట్టెలో అమెరికాస్త్రీ లనుకుంటాను,—వున్నారు. ఒకఆమె పడుకొని యేదో చదువు కొంటూవుంది. ఆ తల్లిపిల్లతో నిలబడి వుండడంచూచి, పడుకున్నది లేచింది. పరున్నపక్క కాస్త చుట్టింది; 'రగ్' మాత్రం అట్టే పెట్టింది. "ఇసూసూ, బేబీ బేబీ" అంటూ తల్లిదగ్గరకువచ్చి, ఆమెచేతుల్లోనిపాపను తీసుకుని 'రగ్' మీద పడుకోబెట్టింది. మాకూ చోటు యిచ్చింది. ఈ దొరసానికివున్నవుదారం ఆ ప్రక్కపెట్టెలోని మన 'నాటుదొరసా నుల'కు లేకపోయింది. అప్పుడు నా మనసు అనేకవిధాల పోయింది. 'వేష భాషలు నేర్చుకోగానే సరా, విశాలమైన హృదయం వుండాలి' అనిపించింది.

* * *

మరొకమారు ట్రాములో యెక్కు తాము. ట్రాములోనూ అంతే! 'పాపం స్త్రీలు' అంటూ మగవాళ్లు చోటుయిస్తారు తోటివారనేభావము మగవాళ్ళలో వుంది కాని మనలోవుండడంలేదు. అది ధర్మం కాదు. మనకు వారామర్యాద చేస్తుంటే మనము ఆమర్యాదను నిలబెట్టుకుంటే బాగుంటుంది. అది అనవసర మనుకుం టాము. యెందుకంటే యెదుటివాడు ఎంత ముసలివాడైనా వొకపురుషుడికి వొకస్త్రీ చోటుయివ్వడము యేమిటి అని వాదిస్తాము. మగవాళ్లు మనకు చోటు యిచ్చినప్పుడు మనము వాళ్ళకు చోటు యియ్యము సరిగదా, అవుసరమైనప్పుడు స్త్రీలం స్త్రీలకే చోటు యివ్వము! తోటి స్త్రీ కష్టపడుతున్నది. ఆమెకు సహాయం చెయ్యాలి అనుకొనేవారు స్త్రీలలో చాలా తక్కువ. నాగరికత అలవాటు చేసుకుం టున్నాము అనుకునేస్త్రీలలో యీస్వార్థం మరీ పెరుగుతున్నది.

ఒకనాడు బస్సులో యెక్కాను! జనంతో కిటకిటలాడుతూవుంది బస్సు. కూర్చున్నవారు కూర్చోగా కొంతమంది నుంచున్నారు. బస్సు యెక్కగానే ఎడమప్రక్కవున్న 'సీటులో' చదువు తున్న యువతులు, మంచి బలమైనవాళ్లు ముగ్గురు కూర్చున్నారు. ఆ ముందు సీటులో యింకోయిద్దరు కూర్చున్నారు.



ముందుకూర్చున్న విద్యావతుల ముందే చంకనో చంటిబిడ్డను వేసుకుని కొన్ని మాసాల గర్భవతి నిలబడ్డది. ఒకచేతిలో పిల్లాడు వున్నాడు. రెండవచేత్తో పై వూచ పట్టుకున్నది. ఆమె ముఖం చెమట్లు పోస్తున్నాయి. భర్తవున్నాడు కాని అతడు యేంచేస్తాడు. అతనిచేతిలో ఐదేళ్ళ పిల్లవుంది, బస్సు కుదుపుతో ఆమె అటూయిటూ వూగుతూ పోతూ వుంది. ఆ స్త్రీ అవస్తచెప్పలేను. ఆమెకు అనుకూలము చేయాలంటే ఆముందున్న ముగ్గురు విద్యావతులే చేయాలి. అదే వీలు. చేయగలరుకూడాను. కాని వారు అలాచేయలేదు. వాళ్లల్లో వాళ్లు మాట్లాడు కొంటూ నవ్వుకొంటూ కళ్ళతోచూస్తూనే వూరుకున్నారు. ఆ ముగ్గురిలో వొక్క రికీ—ఆ అవస్థపడుతున్నచూలాలికి చోటు యివ్వాలనిపించలేదు. చంకలో పిల్లాడు జనంలో నలిగిపోతూ యేడుస్తున్నాడు. ఆమె అవస్థపడిపోతూవుంది.

ముందుసీట్లో కూర్చున్న ఒకయిరవై యేళ్ళఅమ్మాయి వెనుకకు తిరిగిచూచింది. ఆ తల్లి అవస్తచూచింది. 'అయ్యోపాపం కొళందె' (చంటిపిల్ల) అంటూ లేచి ఆ చూలాలిని అక్కడ కూర్చోమన్నది. తాను నిలబడ్డది. నిజంలో ఆ అమ్మాయి,- అక్కడివారి ఎవరితోనూ ఎందులోనూ తులదూగదు. బంగారంలాంటి హృదయంమాత్రం ఉన్నది. నిజంగా ఇదే సంస్కారమూ సభ్యతాగాని, ఇంగ్లీషు ముక్కలు వచ్చనీ, చక్కగా సింగారించుకుంటామనీ అనుకోవడంలో సభ్యతలేదు.

# Musings

## చెలం

డెలెరిక్టు అనే నావెలులో భర్తని వొదిలిన భార్య, భార్యని వొదలిన భర్తా, ఇద్దరూ తమ దేశాన్ని వొదిలి అరణ్యంలో చాలా మోటకాపరం ఏర్పరుచుకుంటారు. ఇద్దరూవిద్యావంతులు, ధనికులు, సంస్కారులు, మంచి మేధావులు. పిచ్చి, మదం, whim, ఇట్లాంటివి ఏవీ వీళ్ళని అనడానికి వీలులేని మనుషులు. అట్లా అమర్యాదగా, తమ మనుషుల్లోంచి, దేశంలోంచి వెళ్లిపోవడం వాళ్ళిద్దరిలో ఎవరికీ వాళ్ళమనసులకీ కాని పని; తెలివితక్కువ, అమర్యాద, అవినీతికరమైన పని. కాని ఆ పనిచెయ్యకండా వుండలేకపోయినారు. లోకంలో చాలాగొప్పవి, అందమైనవి, ఘోరమైనవి, చాలా affairs, and events are so inevitable. అవివేకం, అసంభవం. అధర్మం. కాని inevitable. వాళ్ళిద్దరూ చేసిన యీ పనిని చూపి ఏమీ సానుభూతిలేని వాళ్లస్నేహితుల చేత ఆ కథ చెప్పించాడు కథకుడు. ఇట్లాంటివి, ప్రతివాళ్లూ (శేషాచారితో సహా) ఎంత వీలులేదన్నా, జరగకూడదని శాసించినా, ఎన్ని ఆటంకాలు కల్పించినా, ఆ మనుషుల మనసుల్లోనే, జీవితాల్లోనే, ఎన్ని ఆటంకాలున్నా, వీటి నన్నిటినీ మించిన mysterious power, attraction, ఎట్లా జీవితాల్ని ఐక్యంచేసితీరుతుందో చూపాడు.

వాళ్ళిద్దరి ప్రేమా ఎట్లాఅద్భుతమో, ఎట్లా inevitable అయిందో, ఎంత సుందరమయిందో, మనకి అర్థంచేయించాడు, ప్రతివాళ్లచేతా వాళ్లనితిట్టించి. ఆ పుస్తకంలో కళా, చమత్కారమూ అనుభవించడం చాతనవడం సులభం కాదు. కాని అట్లాంటిపుస్తకం చదివిం తరవాత, ఎంత ప్రయత్నించినా రామయ్యనాయుడిగారి offenheim చదవడం దుస్సాధ్యం. ఎవరి బూడ్సుల పాదధూళి తమని అధికుల్ని చేసిందో, వాళ్ళ వేపే చూస్తారు మానసిక బానిసలు తమ అనుభవాలకీ, tastes కి కూడా. ప్రవర్తనా, పుస్తకాలూ, బట్టలూ, ఉద్దేశ్యాలూ, తమపైవారివాటిని అనుసరించి వుంటాయి. పైగా ఆ కళా-బానిసత్వాన్ని చూసుకుని అహంభావం. ప్రస్తుతం చదువు ఏ విషయంలోనూ, ఏ taste నీ ఉద్దీపింపచెయ్యడంలేదు.

Ethics & tastes, వీటిల్లో ఎన్నో stages ఉన్నాయి. వెరయిటీలుగాక. సంగీతం, సినీమా, పుస్తకం, పటాలు, రుచులు, పరిమళాలు, వీటిని ఆనందించడంలో తక్కువా, ఎక్కువా ఉన్నాయి. High & low. కాని ఏది 'హై' ఏది 'లో'? ఎందుచేత అని ప్రశ్నిస్తే ఎవరూ సమాధానం చెప్పలేరు.

గగ్గయ్యకన్న పృధ్వీరాజు గొప్ప అనడం higher taste ఏం Higher

ఏది నిజం, ఏది న్యాయం, ఏది సుందరం; ఏది గొప్ప ? ఎక్కడవున్నాయి యీ విలువలు. మనుషుల ఎప్పుడూమారే మనసులలోతప్ప ! ఒక నాటకకర్త ఉన్నాడు. ఆయన ప్రతిసారీ తన ఫోటో వేయించుకుంటాడుట, అద్వితీయమైన కళాకారుడేగాక, తాను దివ్యసుందరుడనికూడా ఆయన అభిప్రాయం లాగు వుంది. ఎవరన్నా సందేహిస్తే వాళ్లకి అందం తెలీదనో, యీర్ష్య అనో అనుకుంటే ఆయన ! నూరుమంది కాదనవొచ్చు. కాని ఆయనచలించడు. నిజం ఏది? జీనస్ బతికివున్నప్పుడు, లక్షమంది ఆయన్ని ద్వేషించారు-నిందించారు. అందరి మనసుల్లోని వికారం ఆయన ఘనతని తక్కువ చెయ్యలేకపోయింది. గొప్ప కవులు. శిల్పులు; తమ గొప్పతనం తాము తెలుసుకోకచచ్చారు. మరి ఎక్కడవుంది ఆధారం ? ఎక్కడ ఉందినిజం ?మనసుల్లో గాక! కాని ఎన్నడూఏదో ఆధారం, నిజం, ఎక్కడోవున్నాయనిమాత్రం మనకు భ్రమపడుతో వుంటుంది. ఇట్లా పరీక్షించినకొద్దీశాశ్వతాలూ, Solid things అనుకున్న వాటి అడుగు భాగాలు వూడిపోతాయి. ఎక్కడ నిలకడ! ఎక్కడకాళ్లూనడం?

అగ్గిపెట్టెని యీడుస్తో రైలుబండిని లాగుతున్నాననుకుని అంత శ్రమపడే పిల్లకీ, గొప్ప నాటకకర్తనని, శాశ్వత సారస్వతం కల్పిస్తున్నా ననుకునే రచకుడికీ భేదమేమిటి ? ఎర్రని పువ్వు తలలో పెట్టుకుని, లోకమంతా తనకేసి చూస్తున్నారన్నట్లునడిచే మా వెంకమ్మకీ తన వంకర మొహం అందాలు చూసుకుని కులికే కవికీ ఏమిటి భేదం! తన ఘనతకోసం, తనతండ్రి అసామాన్య కథకుడనీ, తన భర్త గొప్ప సర్వకళా రచకుడనీ, తన మామ బౌద్ధ రుషి అనీ, నవీనయుగకర్త అనీ, తాను మోహినిననీ విశ్వసించే దిబ్బమొహం ఇల్లాలిని చూసి ఎవరు యీర్ష్యపడకండా వుండగలరు? తన బొర్ర చూసుకుని, ఆచారి ఇట్లాంటి బొర్ర ఎవరికీలేదు, ఇదే కీర్తి, ఇదే అందం, ఇదే ఐశ్వర్యం—అంటే, కాదని యే కొలతలవల్ల నిర్ణయించ గలవు?

'వంకాయ అంత రుచిఐన కూర లోకంలోలేదని వొకరు. అంతరుచిలేని కూర లేదని ఇంకోరు. నిజంగానే అంటారు, నిజం ఎవరిలో !

ఏ ఇద్దరి అభిప్రాయంతో సంబంధం లేని గొప్పరుచి ఆవంకాయలో వుందా?

వుంటే రెండో అతను మూర్ఖుడు, తక్కువవాళ్లు జాలిపడతగినవాళ్లు. లేదా మొదటివాడు పిచ్చివాడు. లేనివిలవల్ని చూసే మనిషి.

నిజం ఎక్కడవుంటేనేం, ఒకరికి ఇష్టం, రెండోవారికి అయిష్టం, అని వొదిలేసి ఆగరు మనుషులు. ఇట్లాంటి భేధాభిప్రాయాలు, మతంలో, నీతిలో, రాజకీయాలలో ఏర్పడ్డప్పుడు, సంఘాలు కొట్టుకు చస్తాయి, విధానాలు కూలిపోతాయి, దేశంలో విప్లవాలు సంభవిస్తాయి. ఒక కక్షవారు రెండోవారిని జైళ్లలో పెడతారు, కాలుస్తారు.

వంకాయరుచి ఐనవారు, ప్రజాసామాన్యానికి వంకాయకూర రుచి తెలీటంలేదని, వారి కళ్లు తెరవడం వా ధర్మమని, కాన్ఫరెన్సులు పెట్టి ఉపన్యాసాలిస్తారు, గీతాలు రచిస్తారు, బుర్రకథలు చెపుతారు. వాళ్లరుచుల్ని వంకాయవేపు అభివృద్ధి చెయ్యడానికి ఉపాయాలు సూచిస్తారు. కొందరు వం

కాయకూరరుచి ప్రచారకభజనసమాజం స్థాపిస్తారు. వంకాయ మతాలు, పీఠాలు స్థాపితమౌతాయి. ఇప్పుడిప్పుడే వంకాయవేపు ప్రజలు కళ్లుతెరుస్తున్నారు. కనక వారికి కాంతి నందివ్వాలని నాబోటివాడు పుస్తకాలు వ్రాస్తాడు. 'నా ఉద్రేకాన్ని దీక్షనీ చూపి, "ఏం శైలి! ఇది శైలిచేసే ఇంద్రజాలమేగాని ఆ వంకాయలో ఏ మీ రు చి లే దు" అంటారు.

ఇంతలో వంకాయ రుచి తెలీనివాళ్లు "ఈ వంకాయరుచిగాళ్లు, యేమీ లేని దాన్ని ప్రజలకి బోధించి వాళ్లని మూఢత్వంలోకి దింపుతున్నారు. మోసంచేస్తున్నారు. వాళ్లు వంకాయ సేద్యంవాళ్లు. వాళ్ళ వంకాయలు ఖర్చయేందుకు యీ యెత్తు. ఆ ప్రచారాన్ని నమ్మకండి" అని వాళ్ళు కొన్నరెస్సులూ, పుస్తకాలూ కీర్తనలూ ప్రారంభిస్తారు. తరవాత విరోధాలు. తగూలు. యుద్ధాలు.

ఇంకా పెరిగి "ఈ వంకాయకూర రుచి తెలుసుకున్నారా, యీ లోకంలోని బాధ, క్షామం, ఆరాటం, అన్ని సమస్యలూ తీరతాయనికూడా ప్రచారం జరుగుతుంది.

"వం కా య రు చి లో పడ్డారా, ప్రజలు నాశనమైనారన్నమాటే. అన్ని కళలూ, జ్ఞానం నశిస్తాయి. ఈప్రచారం సాగనీకూడ"దని ఇంకొందరూ.

ఎక్కడవుంది నిజం. దేన్ని ఆధారం చేసుకుని విలవ కడతాము?

అట్లాచూస్తే చాలావిలువలు లోకం మీదకన్న,మనసుల్లోనే వాటి వాస్తవికతని ప్రతిష్ఠించుకున్నాయి.ఏ మనసుల్లో, పిచ్చివాడి మనసుల్లో, కవి మనస్సులో! లోకంలో లేనివాటికి చాలావాటికి నిజత్వం వుంది. కాని ఏపనికైనా, ప్రయత్నానికైనా. ఈవిలవలు వాస్తవికతల్లో నమ్మకం అవసరం. ఆ నమ్మకం తప్పిందా, నిర్వీర్యులో, ప్రపంచంతో సంబంధంలేని ఋషులో అవుతారు మనుషులు.

"ఏ ఆలోచన సత్యం? ఏ పని సుందరం! అనే ప్రశ్నకి జవాబు లేదంటారా మన మనుసు తప్ప?" అని దిక్కరించి అడిగారు లీల.

"ఏదీ కనపడదు. మీరు అంద మనుకున్నది. నాకు అందవికారం. నిజంగా అంద వికారం."

"కాని మీలోపలే ఎక్కడో తెలుస్తుంది మీకే. మీది అబద్ధపువిలువఅని"

"తెలీటంలేదు. మీదే అబద్ధపువిలవ అని మీలోపలే తెలుస్తోందేమో! అది కాదు. మీ విలువ మీదీ, నా విలువ నాదీ. ఇద్దరిదీ సత్యమే. చెరో మూల నించీ చూస్తున్నాము."

"రెండు విరుద్ధాభిప్రాయాలూ, రెండు సత్యమనడం-వుత్త తార్కికం. సత్యంకావడం అసంభవం."

"మరి ఏది సత్యం? ఎవరు తేలుస్తారు? ఇతరులా? వాళ్లప్రమాణం నేనెందుకు అంగీకరించాలి. చాలామంది అభిప్రాయమా? మెజారిటీ అభిప్రాయం ఎప్పుడూ తప్పేనని మీరూ వొప్పుకుంటారు! పండితులా? వాళ్ళు చేసేతప్పులు ఎవరికి తెలీవు?"

"మరి ఎక్కడ?"

"ఎక్కడో కనపడదు. ఎక్కడాలేదనుకుంటాను. ఈ మాయమనసుల ఆలోచనలకి నిలకడైన సత్యం ఎక్కడోవుండాలా?" అన్నాను.

"ఏమన్నా చెప్పండి. ఎదో సత్యం ఎక్కడో వుంది, కుర్చీని పిచ్చివాడు

గాడిద అంటే అది అతనికి సత్యం అని వొదిలేస్తారా?"

"అతనికి సత్యమే. నాకు కాదు—వ్యవహారికంగా నా ప్రవర్తన నాచూపు మీదే ఆధారపడుతుంది."

"మరి తక్కినవాళ్ళ అభిప్రాయాల్ని మార్చాలని ప్రయత్నిస్తా రెందుకు?"

"నాకు ఎట్లా కనపడుతోందో చెపుతాను. అంతే."

"చెప్పడమేకాదు. 'మీది తప్పు. మూర్ఖం' గట్టిగా వ్రాస్తారు."

"నా కట్లా కనపడుతోంది గనక" అన్నారు తోవ తడుముకుంటూ.

"మరి వాళ్లవి వాళ్లవి సత్యాలైనప్పుడు...వాదనతోవ మళ్లించాను.

"మనం మాట్లాడామంటే మనకి తోచే నిజం మాట్లాడక తప్పదు. 'అది ఇల్లు' అని నేనంటే. దాంట్లో నిజమైన అర్థం: "అది నేను అనుకునేవాడికి 'ఇల్లు'గా తోస్తోంది అన్న మాట. అక్కడా 'ఇల్లు' అంటే దేన్ని అంటావు అనే ప్రశ్న రావొచ్చు. ఈ చెప్పడాల్లో అనేక విధాలున్నాయి. వూరికే మనిషి మనిషితో చెప్పడం ఓరకం. దాన్నే మనం చెప్పినా, వ్రాసినా, పత్రికలూ. ప్రకటనలూ, మందులమ్మేవాళ్లూ ఓరకం, దాంట్లో స్వార్థమైనమోసం వుంటుంది. మత గురువులూ, ఉపాధ్యాయులూ ఓరకం. వాళ్లకి బైటినించి అధికారం పెట్టుకుని మాట్లాడతారు. ఈ భర్తలూ తలితండ్రులూ ఇంకోరకం. వెనక ధన బలం, శరీరబలం వెనకవుంచుకుని బోధిస్తారు. బలవంతం చేస్తారు. ప్రభుత్వం చేసే ప్రచారం మరీ అన్యాయం. దాని వెనక ఫిరంగులుంటాయి. ఈ ఫాసిజం, బోల్షివిజంలో వుండే ఘోరం అది. నేను గోలపెట్టేదంతా, 'బలవంతం కూడదని."

కాని లీల వదలరు.

"అదంతా సరే. కాని వాళ్ల అభిప్రాయం తప్పుఅనడం ఎందుకుమీరు?"

"నాకు తప్పుగా తోస్తోందిగనక."

"మీకు తప్పుగాతోస్తోందని వాళ్లకి తెలీకపోతే నేం?"

"వాళ్ల అభిప్రాయాలవల్ల వాళ్లకీ, ముఖ్యం ఇతరులకి బాధకలుగుతోంది గనక."

"మీఅభిప్రాయాలవల్ల ఎంతబాధ"

"నావి చాలా గొప్ప అభిప్రాయాలనీ, అవి అందరూ నేర్చుకోవాలనీ నా అభిప్రాయం గనక."

"మరి ఆనోటితోనే ఎవరిమనసులో సత్యం వాళ్లదని ఎట్లా అన్నారు?"

ఇద్దరం నవ్వాము.

నాకు తెలీనిదీ, ఆమె చెప్పలేనిదీ, నాకు తెలిసే నేను గుర్తించనిదీ, ఆమెకి తెలీకండానే ఆమె గుర్తించిందీ. ఏదో సత్యం వుంది.

"ఎవడికితోచింది వాడికి ఈనాడు సత్యంగా కనపడ్డా-ఏదో వుంది-నాకు చాతకావడంలేదు చెప్పడానికి. కాని మీ వాదనమాత్రం-ఎవరికి తోచింది వారికే సత్యం అనేది వొప్పుకోడానికి వీలులేదు."

నిజమే. నాకు వీల్లేదు. కాని వొప్పుకోక గతి ఏదీ! ఎంతచెప్పినా కళ్ళు తెరవక. తెరవడం ఇబ్బందై, తెరిచే శక్తిలేక అట్లానే వెళ్లిపోతున్నారు ఈలోకంనించి, ఏ లోకంలోనో,ఏజన్మలోనో తెలుసుకుంటారా? ఆ నిజమేదో, ఎక్కడో వుంటే అది తెలుస్తుందా?

taste అని గట్టిగా అడగరు ఎవరూ, అడిగితే? 'నాకు నగ్గయ్యే గొప్పగా వుంటాడు—అంటే? argument కోసం కాక, సిన్సియర్‌గా నగ్గయ్యే గొప్ప వాడు అనేవాళ్లు వేనకువేలు. వోట్లు తీసుకుంటే వింధ్యకి దక్షిణాన ఎక్కువ నగ్గయ్యకే వొస్తాయి. మరి పృథ్వీరాజు గొప్ప అని ఏ కొలతలవల్ల రుజువు చెయ్యగలవు? నువ్వు నిర్ణయించే కొలతలు నేనెందుకు అంగీకరించాలి?

నేనట్లా feel అవుతున్నానంటే, నేనిట్లా feel అవుతున్నాను, అని జవాబు.

Tastes are defferent అని వాదించెయ్యడానికి వీల్లేదు, కొన్ని established standards వున్నాయి. established laws మల్లే, customs మల్లే, beliefs మల్లే. వాటిని ఎవడో తప్ప ప్రశ్నించలేడు.

బ్రహ్మసమాజంవాళ్లు customs ని ప్రశ్నించారు, ఎదిరించారు. ethics ని ప్రశ్నించే జవ లేదు. రివల్యూషనరీలు ethics ని ప్రశ్నించినా, aesthetics ని ప్రశ్నించరు. aesthetics ని ప్రశ్నించాలని ప్రయత్నించే కమ్యూనిస్టులు aspirations ని ప్రశ్నించరు.

ఎవరి Taste వారిది అని వాదిలేద్దామంటే, ఎవరి కులాలు వాళ్లవి అనే అసందర్భమే వొచ్చింది. వీటిల్లో ఎక్కువ తక్కువలు వొచ్చి పడ్డాయి—అదీ గోల.

ఈ కథ చాలా బావుంది చదువు అని, రూపవాణి జన్మదిన సంచిక నిచ్చి నాచేతికి చప్పన అటు తిరిగారు.

'ఏమిటా ఆకథ లీల మెచ్చుకున్నది అని పేజీకి తీశాను, మొదటివాక్యం "ప్రకృతి శోభ చూడ్డానికి కమ్మగా వుంటుంది" అని చదివి ఆ మందు మధ్యాహ్నంగుండెపట్టి పెద్ద కేక పెట్టాను.

లీల నావేపు వీపు తిప్పి ఒకటే నవ్వుతున్నారు.

ఎట్టా ఆ కథ చదవడం ఆ ప్రకృతి కమ్మదనం తరవాత!

సంస్కారం, నాగరికతా ఎక్కువైనకొద్దీ, ఈ అభిరుచులు మారేవిధంలో ఒక decided స్పష్టమైన మార్గం కనపడుతుంది. అందువల్లనే అపక్వాహారం. తిరిగీ నాటకరంగం, పల్లెటూరి జీవనం. బట్టలు వొదుక్కోడం, అంటే, కొత్త నాగరికతలవల్ల కలిగే ఇబ్బందులూ, అనారోగ్యాలూ. Surfeit భరించలేక తాత్కాలికంగా వెనక్కి పోవాలనే ఉబలాటం తప్ప, గట్టిగా నడిచిన దోవనే వెనక్కిమళ్లడం మానవ స్వభావానికి విరుద్ధ మనిపిస్తుంది. Progress అంటే in a circle అనో లేక extremes meet అనో సమర్థించుకోవాలి.

ఈ tastes లో కూడా, యీ అందాల అనుభవంలోకూడా వెనక వున్నాము అనేవాళ్లు ముందుకు సాగడానికి చేసేప్రయత్నం కనపడుతుంది. కన్నాంబని ఎంత మెచ్చుకున్నా క్రమంగా, కాననబాలలోకి ప్రజలు సాగడం కళ్లముందు కనపడుతోంది. ఎంత గుంపు 'అనసూయ'నీ దక్షయజ్ఞాన్ని చూసి ఆనందించినామాటల్లోనైనా; డాక్టర్నీ శకుంతలనీ మెచ్చుకున్నట్టు నటించడమైనా జరుగుతూంది. సినిమా కాని రాగాలు తీసినా, త్యాగయ్య అని కళ్లు తేలవేస్తోనే వుంటారు.

కాని..., కాని...ఎదో వుంది.

ఉన్నతం, సత్యం, అందం, అనే విలవలు మనుషులచిన్న వైనమనసుల్లోనే కాక, ఎక్కడో ఆదర్శాల్ని గూడా మించిన వాస్తవత్వంలో నిలిచివున్నాయా అనిపించేటంత నిజంగా కనపడతాయి.

కొన్ని విలవలు స్థిరంగా నిలచినట్లూ మానవులు క్రమేపీ అటు కళ్లు తెరుస్తున్నట్టూ, తోస్తుంది. అట్లా నిలిచినట్టు వాళ్ల నా మనసులోమాత్రమే కనిపించడం గాదుకదా. అనిపిస్తుంది.

ఒక ప్రత్యేక వ్యక్తిలో అభివృద్ధి కనపడకపోయినా, మానవ ప్రవాహంలో ఆ ముందుకి సాగే ప్రయత్నం కనపడుతుంది. ముందుకని నీకేం తెలుసు? చెప్పలేను. అనిపిస్తోంది. విలవలు సత్యాలనీ, గొప్పవనీ, నీకెట్లా తెలుసూ? ఓట్లు తీసుకో.

ఎట్లాగో తెలుసు. గొప్పనమ్మకంతో తెలుసు. నాకేకాదు, లోకక్షేమానికై తహతహలాడే జ్ఞానులందరూ అట్లాగే అంటున్నారు. కొన్ని విలవలూ వాస్తవాలూ జన సామాన్యంమీద వాటి in'fluence అమితంగా వుంది.

అది తప్పుకావొచ్చు. మాయకావొచ్చు. ఎక్కడ వుందో ఎట్లా వుందో తెలీకపోవొచ్చు. కాని వుంది.

లీలగారి మాటల్లో చాలా సత్యం వుంది.

Tastesలోనే కాదు. ధర్మం, అధర్మం, నీతి, అవినీతి అనే పదాల్లో కూడా, దేవుడూ, శాస్త్రం, పాపం, ఇట్లాంటి అధికారాలు తీసేస్తే, ఎవరి మనసుకితోచింది అదేకాని ఒకదాంట్లో నిజం వుందని ఎవరూ రూఢిగా మాట్లాడలేరు.

"అంతరాత్మా, పాపం చేసేవాడికి పాపం అని ఎక్కడో లోపల తెలుసు. ఇప్పుడు తెలీకపోయినా ఎప్పుడో తెలుస్తుంది" ఇట్లాంటి మాటలు వుత్త నాన్సెన్సు. సన్మార్గంలో నీతిలో బాధపడే మనుషుల ఈర్ష్యా, వాళ్ల కోర్కెలూ, కల్పించిన అబద్ధాలు. దుర్మార్గులుపొందే సుఖాల్ని తాము చూసి ఓర్వలేక, వాళ్లుచేసే అన్యాయాలకి తాము ప్రతీకారం చెయ్యలేక, ఈ లోకంలోనో, ఆ లోకంలోనో, వాళ్లకి శిక్ష జరుగుతుందని సమర్థించుకునే ఓదార్పులుఅవి. అనేకమంది గొప్ప ధర్మపరులకీ, వాళ్ల ప్రవర్తనలో మోసం, మాటల్లో అనృతం, జీవితంలో అవినీతీ కనిపించవు. ఎన్ని ఆత్మవంచనలు, ఎన్ని అబద్ధాలు! ఇతంత ఆస్తుల్ని తమవి అనుకోడంలో, భార్యా బిడ్డలమీద అధికారాలలో, పెళ్లిఖర్చులలో, మర్యాద దొంగమాటలలో, కప్పిపెట్టుకుని పైకిచూపే గౌరవాలలో, ఉద్యోగపు బానిసత్వాలలో, వర్తకపు లాభాలలో, వడ్డీలలో, యీ చౌర్యాలూ, నీచత్వాలూ, ఎంతమంది ధర్మపరులకి అర్థమౌతాయి. ఈశ్వర ప్రార్థనలలో నీచత్వం, సంసారపు గూళ్లల్లో అంధత్వం, సంకుచితత్వం! కులాలు, విద్య, ధనం, అధికారం ఇచ్చే గౌరవాలని జీవితంలో అంగీకరించడంలోని క్షుద్రత్వం!

ఏ మనిషీకూడా ధైర్యంగా నాకు అందం, నీతీ తెలిసి ప్రవర్తిస్తున్నానని చెప్పగలగడం మూర్ఖం.

మరి ఏ మనుషుల నిలవలువాళ్ళవే ఐతే మనుషుల మనసుల్లో తప్పు

higher values ఎక్కడా నిజమైన హెచ్చే లేకపోతే, ప్రజలు educate అవడం, సంస్కారం పొందడం, అభిరుచుల్ని అభివృద్ధి చేసుకోడం, ఏదో తెలిసినవారు ఇతరులకి ఇవన్నీ నేర్పడం మేల్కొలపడం ఇవన్నీ అర్థంలేని పనులూ, మాటలూ అన్నమాట.

శాంతిలో నిద్రపొయ్యే ప్రజల్ని—విద్య పేర, స్వేచ్ఛ పేర, మతం పేర, జ్ఞానం పేర, అభివృద్ధిలోకే, అశాంతిలోకే లాగడం, ఘోరకార్య మనిపిస్తుంది. ఎలికని వొండుకుని, గొప్ప సౌధాల వేపు, ఐశ్వర్యాల వేపు కన్నెత్తి చూడక నడిచేయానాది దంపతులు ఎప్పుడూ ఆదర్శం నాకు, అట్లా నేను బతకలేకపోవడం నాదౌర్భాగ్యం. వాళ్లకి కాన్ఫరెన్సులు పెట్టి వాళ్ళ ఆచారాలలో అవినీతి కనిపెట్టి, అకస్మాత్తుగా వారిమీద జాలిని అంకురింప చేసుకున్న జిల్లా నాయకులమీద ఎంత అసహ్యం కలుగుతుంది! ఇట్లా లోకంలో మూల మూలవున్న సుందర జీవితాల్ని, జాతుల్ని ఎన్నిటిని ధ్వంసంచేశారు యీ క్రిస్టియను మిషనరీలూ! ఈదేశంలో బోర్డింగులలో తయారైన కృత్రిమ జీవితాల విషాదాలను ఎవరన్నా గమనించారా?

ఏ మనుషుల్నిగాని, యే సంఘాల్నిగాని, జాతుల్నిగాని, సుఖంగా నిద్రపోయేవారిని, శాంతిలో వున్నవారిని, జ్ఞానం పేర, స్వాతంత్ర్యం పేర, హక్కుల పేర, నిద్రలేపడం పాపం. అశాంతి వాళ్ళలో వుదయించినప్పుడు, వాళ్లు మేల్కొని, కాంతికోసం దోవ తడుముకుంటున్నప్పుడు తోవచూపడం, బాగా కళ్లు తెరవడం చెయ్యడమే దయాపరుల ధర్మం. పిల్లల విద్యలో ఇది ముఖ్యమైన విషయం. కాని ఎవరూ గమనించనిది ఇది. ఇదే పెద్దవారియడల వర్తిస్తుంది.

ఎప్పుడూ higher tastes అంటున్నామే వాటికి ఎగబాకాలని ప్రయత్నంవుంది మనుషుల్లో. ముఖ్యంగా విద్యావంతులలో. తమ Tastes-upto date అని తెలుపుకోడానికి ఎన్నిపాట్లు కాళ్ళని కరిచే బూడ్సులు, సగం ఆకలి తినడం, ఆవలిస్తో సినిమా చూడడం, చదవనివి చదివామనడం, ఎరగనిదానికి అవునవునని తలవూయించడం, పట్టుబడ్డప్పుడు సిగ్గుమొహం! తను ఆనందించేదే గొప్పదని తప్పడు సమర్థించుకోడం! Taste విషయమై argue చెయ్యడమంత బుద్ధితక్కువవుంటుందా ప్రపంచంలో!

మనుషుల tastes ని educate చెయ్యడం ఒక ధర్మం. ఆధర్మాన్ని ఇప్పుడు ఉపాధ్యాయుల చేతుల్లోంచి సినిమా నిర్మాతలు తీసుకున్నారు. పోనీ మనుష్యుల్ని ఎట్లావుంటే అట్లానే వుంచితే నేంవాళ్ళని! కాదు education అనే పేరుతో, తమ పుస్తకాలనీ, ఫిల్ముల్ని, సంగీతాన్ని, బొమ్మల్ని కొనే వారినిగా చెయ్యడమన్న మాట—Civilization and education are mostly commerce. Evolution పరిణామం ఎట్లానూ ఆగదు. ఎప్పుడు నేర్చుకోకండా నిలవలేదు మనుషుడు. కాని గంజితాగినప్పుడూ ఆనందం వొచ్చింది; అకస్మాత్తుగా ధనికుడై పరమాన్నం తాగినప్పుడూ ఆనందం వొచ్చింది. రెండు ఆనందాలకీ భేదం వుందా, లేదా? పోనీ ఎక్కువ తక్కువ

లున్నాయా? పరమాన్నం అలవాటైన తరవాత గంజిలోంచి ఆనందం తీసుకునే శక్తిపోవడమేనా తటస్థించింది? ఈ tastes లో అభివృద్ధి మొత్తానికి, for more complicated and expensive pleasures లాగు కనపడుతుంది. ధనవంతులు కులస్తులు గొప్ప కళలను, చివరికి శరీరాల్లోకూడా గొప్ప అందాన్ని సృష్టించుకోగలిగారు. ఎంత ప్రయత్నించనీ, ఏ పరిస్థితులురానీ, ప్రజలందరికీ సమత్వంరానీ, ఒకటే పదార్థాలని అనుభవంకోసం అందరికీ పంచనీ, యీ tastes లో అనుభవ ప్రజ్ఞల్లో భేదాలుతప్పవు. పచ్చిగడ్డినీ, మంచుబొట్టునీ, చీమలగుంపునీ, మనిషి నడకనీ, మిణుగురుల వెలుగుగీతల్నీ చూసి అద్భుతమైన ఆనందంలో పడడం ప్రతివారికీ చాతనవుతుందా? రాత్రి ఆకాశంవంక చూసి నిశ్చలత్వం పొందగలగడం ఎట్లా పంచుతారు? Art and enjoyment of art is always exclusive, లోకంలోని సుందర ప్రతిమలనన్నిటినీ రోడ్డుప్రక్కన వరసగా పాతినా, వాటికి పీపుల్ని రాస్తారు దురద పోవడానికి.

'కొన్ని విలవలు లోకంలో స్థిరంగా ఏర్పడాయి. గాడిదకూత కఠోరం, కాకినడక అందవికారం, మోసం చెయ్యడం అవినీతి, ముగ్గిన పేడకంపు—ఇట్లాంటివి ఎన్నో-శరీరానికి బాధనీ సుఖాన్నీ ఇచ్చేవి సులభంగా విభజనని పొందుతాయి. కాని ఏకవో, పిచ్చివాడో, ఫిలాసఫరో...

'గాడిద సంగీతం ఎంతశ్రావ్యంగా వుంది?'

'కడుపునెప్పి వింతహాయి?'

'దుఃఖమే నాకుసుఖం!'

'మనసారగా ఏడ్వనీము వస్తుందీ?'

'నల్లనిదానిలో ఛాకౌము లేదా?'

'తాటకిలో శృంగారం?'

'మురుగు కాలవలోని సుగంధం.'

అని వ్రాయవొచ్చు. నిజంగా అనుభవించవొచ్చు అతనికి, కానీ జనసామాన్యానికి ఆ అనుభవాన్ని మనసులోకైనా అందుకోడానికి చాలా ప్రయత్నం చెయ్యాల్సి వుంటుంది.

అందరూ అంగీకరించిన యీ అనుభవాలు ఆధారంగా, మానసికమైన tastes విలవలు కొంతవరకు జనులు అంగీకరించింది. సంగీతంలో ఏది శ్రావ్యం, పాతకావ్యాల్లో ఏది ఉత్తమం, ప్రవర్తనలో ఏది నీతి; ఇట్లాంటివి కాలంలోనిలిచి ఏర్పడాయి. కొత్తది ఏదివొచ్చినా చప్పున ఆ వెనకనించి నిలిచిన విలవలతో పోల్చికొలిచి కొత్తదానివిలవ నిర్ణయిస్తారు. కొత్తదానికి బాగా కొత్తదానికి, పాతదనికొలతతో విలవలు నిర్ణయించడం అన్యాయమే. పాతవిలవలే శాశ్వతమైనవైతే, ఏమార్పూ, అభివృద్ధి వీలులేనివౌతాయి. ఏది ఏమనిషికి అందంగా ఆకర్షకంగా కనపడితే అది అతనికి విలువైనదనే మాట నిజమే. కాని విమర్శగా, జనసామాన్యం అంగీకారం, కాలంలో నిలవడం, అనే సంగతి వొచ్చేప్పటికి, పురాతనంనించి నిలవబడ్డ విలవలతో కొలత తప్పదు. ఆ విలవలకినిలిచి, కొత్తదనాన్ని గట్టిగా ప్రవేశపెట్టిన కళలు, అవీ కొన్నాళ్ళకి పాతవై, నిలుస్తాయి. కాలం నిలకడ కావ్యానికి సరైనవిలువ కట్టగలదా! అంటే, చాలా

సందేహం-నిల్చిపోయినవాటిలో గొప్ప తనంవుందని చెప్పకోవొచ్చు, కాని గొప్పతనంవున్న వన్నీ నిలిచాయి, నిలుస్తాయి అని చెప్పకోడానికి వీలులేదు. ఆనాడు ఏమీ అర్థంకానంత గొప్పవై, ఎక్కడా నిలవక నశించిపోయిన వెన్నో! ప్రజలకి అంగీకారమైన విలవల్ని కొన్నిటిని పునాదిగా తీసుకొని, తక్కింది కొత్తదనాన్ని కల్పిస్తే నే ప్రజల మనసుల్లో స్థలం ఏర్పడుతుంది. అందాలకి, ప్రజలకి అర్థంగాని భావలో, లేక అనుభవానికి దూరమైన ఉపమానాలతో, ఊహలతో, ఆలోచించే పద్ధతులకి వ్యతిరిక్తమైన నడకలతో, వ్రాస్తే ఎంత విపరీతమైన గొప్పతనం వున్నా ఎక్కడాపలకదు. అరసికుడికి మనసులోతప్ప విలవనిలవదు. Sumea-lesin మొదలైన పద్ధతులకి వొచ్చిన ఇబ్బందే అది.

'సత్యమైనది, అందమైనది, ఎన్నడూ నశించదు. ఏకాలానికో ఓ కాలానికి అది బైటికివొచ్చి అంగీకారం పొందే తీరుతుందనేదానికి—లోకపు పోకడలు చూస్తే చాలా సందేహం కలుగుతుంది. ఆనాటికి విరుద్ధాలుగా, కనబడ్డ విషయాలు—మతాలలో కళలలో, నీతులలో—ఏనాటికో లోకంలో విజృంభించినమాట నిజమే. జీసస్ మరణంతో అంతమై పోయిం దనిపించిన క్రిష్టియానిటీ, వెయ్యి సంవత్సరాల తరవాత ప్రపంచాన్నే పాలించింది. ఇట్లాంటి విలవల విజృంభణలు ఎన్నో చూస్తాము. కాని నిలిచినవే మనకళ్ళకి కనపడుతున్నాయి గాని, నిలవక పూడ్చుకోనిపోయిన గొప్పవిలవలు ఎన్ని లక్షలో! జీసస్ బోధించాడు-కాళిదాసు వ్రాశాడు, రాఫీల్ చిత్రించాడు, మీరాబాయి పాడింది. కాని బోధించక, వ్రాయక, పాడక, తమహృదయాల్లోనే ఆనందించి జీతింపచేసుకున్న మానుల సంగతి! పైకిచెప్పినా అర్థంగాక వెర్రివాడికింద తరిమేసి, ఏనాటికీ గుర్తులేక నశించినవారి సంగతి! కాని యీ భౌతికవాతావరణాన్నించి పైకి తేస్తే, లేవడంలో వివేకమూ అర్థమూ వుంటే, మనిషి మనసులోనైన సరే, గట్టిపైన వాస్తవమైన కలలకీ, కళలకీ, యత్నాలకీ, సదుద్దేశ్యాలకీ, ప్రేమకీ, ఎక్కడో ఏ ప్లేస్‌లోనో వాస్తవత్వముంది-ఎక్కడో ఎట్లానో ఏSpiritual ether లోనో, పలుకుతాయని వుంది. మనకి కనపడే యీసూర్యకాంతి గాక, ఏవో Cosmic rays భూమి మీద శక్తికి కారణమన్నట్టే, మనదేశంలోని యోగులు, ఏమీవ్రాయని కవులు, హృదయాల్లోని కవిత్వాన్ని ప్రేమని మాటలోకూడా వెల్లడి చెయ్యలేని, చెయ్యడంచాతకాని, ప్రేమికులు, వీళ్ల బాధలు, కలలు, కవిత్వాలు, ఏ వాతావరణంలోనో నిలిచి, ఎవరిద్వారా పలుకుతున్నాయో ననిపిస్తుంది. కాని ఇట్లా అనిపించడమేగాని, నిజమని రూఢి ఏమీలేదు.

మనిషికి తన మనస్సులోవున్న విలవలలే, పై ప్రజలలో విలవలకీ, భేధం స్పష్టంగా తెలీనప్పుడుహాస్యాస్పదుడూ, విషాదకుడూ అవుతాడు. Don quixote కొద్దో గొప్పో!

ఓసారి క్రిష్ణశాస్త్రిగారితో అన్నాను పూర్వం. 'మనం గొప్పవి కల్పిస్తున్నామనీ, మనం తద్వారా గొప్పవాళ్ళమనీ అను

కునేవిలువ మన మనస్సుల్లోదే. దాన్ని లోకంమీదపడేసి, ఆ విలువ బైటకూడా వుంది అనుకున్నట్టు ప్రవర్తిస్తే, దెబ్బ తింటాము. అవమానపడతాము. మన వ్రాతలవిలువ లోకంలో అంగీకారం పొందినప్పుడుగాని మన మనసులో గొప్పతనం, అక్కడే అంతరించాలి?'

దుష్యంత పాత్రధారి, తాను దుష్యంతుణ్ణని రైలుస్టేషన్లో తిరిగితే, ఇతరులకి ఎంత Entertainment! కాని పూర్తిగా ఆ పిచ్చలో నిలిస్తేనేగాని, అతని కెంతబాధ!

ఆపుస్తకంలో వ్రాస్తున్నాడుకదా.

When a woman is perfectly sane, head screwed on tight, full of culture and art, and has a vote, and all that, it is impossible to be happy with her.

పూర్తిగా వివేకమున్నదీ, సంస్కారమూ, కళాజ్ఞానమూ, ఓటూ అట్లాంటి వన్నీవున్న స్త్రీతో సుఖించడం అసాధ్యం అని.

క్రమంగా స్త్రీలందరూ అట్లానే తయారవుతున్నారు. జ్ఞానాన్ని, స్వతంత్రాన్నీ, సంతుష్టినీ, అధికారాన్నీ వెతుకుతో. వారి ఈమార్గం తప్పా!

ఒకవిధంగా తప్పే. స్త్రీ అబలత్వాన్ని, నిర్ధనత్వాన్ని, సంఘంలో గౌరవహీనత్వాన్ని, పిల్లలతో సంబంధాన్ని, బాగా advantage తీసుకుని, తనధర్మాల్ని, బాధ్యతలనీ, పురుషుడు ఉపేక్ష చేసుకోకపోతే, మార్కెట్ లోకి నడవవలిసిన దుర్గతి స్త్రీకిపట్టదు, ఆమె సంసారంకోసం, పిల్లలకోసం చేసిన త్యాగాల్ని, లొంగిపోవడాన్ని అవకాశంతీసుకుని ఆమెని ఎన్నినీచత్వాలకి వొంచాడు! గతిలేక తిరగబడి, మగవాడి అవసరం, అధికారంలేకండా బతకాలనే ప్రయత్నంలో, ధిక్కారం చేస్తోంది స్త్రీ. కనకనే ప్రస్తుతం నాగరికతపొందిన స్త్రీతో సుఖించడం అంత అసాధ్యమౌతోంది. అది స్త్రీ తప్పుకాదు, తన పూర్వపు అధికార ప్రతిష్టని మరవలేని పురుషుడి తప్పు.

అనాదిగా సర్వత్రా జరుగుతున్న పురుషుడి యీ అధికారంలో పూర్వం ముందే ధర్మమూ, దయా, ఐకమత్యమూ క్రమేపీ స్త్రీ అసహాయత్వంవల్ల నశించి, యీ లోకపుకాంతినీ, విలవల్నీ, అందాల్నించి తనని వేరుచేసి ఉక్కిరిబిక్కిరి చేస్తోందని నాగరికతపొందిన కొద్దీ స్త్రీకి వ్యక్తమౌతోంది—అందువల్లనే చదువుకున్న స్త్రీలలో పురుషుడిమీద మనసులోనించి యీతిరగబాటు. అతని అధికారాన్ని అధిక్యతని సహించలేని యీ స్తితి. తన చదువువల్ల romance లో విశ్వాసం. ఆ చదువులు చెప్పే నీతివల్ల శరీరసంపర్క నీచం ఆమె మనసులో. సృష్టిప్రోద్బలంవల్ల పురుషుడిమీది ఆకర్షణ, మనసు ధిక్కారంవల్ల ఆతనిమీద అసహ్యం. ఆమెలో జరిగే యీ విరోధాలవల్ల చాలా వికృతంగా తయారౌతోంది స్త్రీ నాగరికతపొందిన కొద్దీ.

స్త్రీలో ఈ తిరగబాటంతా తాత్కాలికం అనిపిస్తుంది. ఎందుకంటే ఆమెలో చాలావరకు emotional side అమితం. ఎక్కువ జీవితంలో తాను కల్పించుకోగల అందంమీద ఆధారపడుతుంది ఆమె. ఆమె ప్రోద్బలాలు సృష్టికి దగ్గిర, ఫలించేభూమికి, ఈనేచేనుకి. పైనించి మనం ఎన్ని సౌఖ్యాలు, సంతో

షాలు సంతుష్టులు తెచ్చుకున్నా, మన లోపలి sub-conscious నించి శాంతి రానిది, ఏదీ మనలో రాణించదు. అంత శ్శాంతికి మనకి తెలీని కారణాలుగాని, సుఖమైన భోజనం, కామవాంఛతృప్తీ, a sense of safety, ముఖ్యం.

ఈ కొత్తస్వేచ్ఛా సమరంవల్ల స్త్రీ చాలాత్వరలో పురుష అధికారాన్ని తెగకొట్టి, బాధ్యతల్ని గుర్తించి తనని గౌరవించేట్టుగా పురుషుణ్ని మచ్చిక చెయ్యాలి. లేకపోతే తమ స్త్రీత్వాన్ని శాంతిని వేళ్లతో కదిలించేసుకుంటుంది స్త్రీ. స్వేచ్ఛవల్ల శాంతిరాని స్వేచ్ఛ అర్థ హీనమయింది. శాంతి అంటే నిద్రా అలసతా కాదు. దానికన్న కాల్చేసమరం చాలా ఆరోగ్యం. శాంతిఅంటే నిజమైన చుట్టూఆనందాన్ని వెలిగించే శాంతి.

నిజమైన పాతివ్రత్యానికి అదేఅర్థం. మనిషి ఏకళలోనో, దేశభక్తిలోనో, తనని తాను ఐక్యంచేసుకుంటే-దానిని బానిసత్వం అనం. అతన్ని బలవంతం చేసినప్పుడే—ఏసేవకైనాసరే—లాక్కుని వెళ్ళినప్పుడే అది భారమౌతుంది. అట్లానే స్త్రీ తనవ్యక్తిత్వాన్ని స్వచ్ఛంధంగా ఏభర్తసేవకో, పిల్లల అభివృద్ధికో, సంసారంలో ఐక్యంచేసుకుంటే, అది ఆమెకి ఆత్మశాంతినీ చుట్టూవాళ్లకి సుఖాన్ని, గృహానికి తేజస్సునీ ఇచ్చేటుండాలి. ఆ ఆదర్శాన్ని మనసులోపెట్టుకునే, యీ పురాణాల్లో యీ వికృతస్వరూపాల్ని, సీత, చంద్రమతి, సావిత్రుల్ని సృజించారు. అసలు మూలగ్రంథాలలో యీ పతివ్రతల్ని సరిగానే పోషించారేమో! అసలు spirit చచ్చి, యీ కొత్తగ్రంథకర్తల చేతుల్లో ఇట్లా ఐనారో!

అట్లానే సంసారంలేని స్త్రీలూ సరైన సంసారంలేనివాళ్ళూ, ఏమి కోరక, ప్రత్యుపకారం అడక్కుండా, మోహానికి తమనితాము ఇచ్చుకున్న స్త్రీలు వున్నారు. పతివ్రతలు ఎవరు పాదధూళిని తలలధరించడానికి పనికి రారో, అటువంటి గొప్ప శృంగార మూర్తులు. అట్లాంటి శోభాన్వితలు - నే నెరిగిన తాయారు మేరీవంటి యువతులు. Not for money, not for contract అంటుంది. Voyage అనే గొప్పపుస్తకంలో థరసీ, తన జీవిత యాత్రలో.

'లీల్ ఇట్లా మీతోచర్చిస్తే, ఎన్ని కొత్తవూహలు సమన్వయాలు, నా మనసులో అంతరాంతషంగా వున్నవి ఎన్ని పైటికి స్పష్టంగా కనపడుతున్నా యంటారు? ఇద్దరమూ ఏమూలాలంగీకరించకపోవటంలో, ఒకరివాదనకి ఒకరు ఒకఅంగుళం చోటివ్వకండా నిలిచి తర్కించడంలో, ఎన్ని కొత్త కోణాలమీద వెలుతురు పడుతోందనుకున్నారు? ఈ నావ్రాతలలో మీ విరుద్ధమైన సహాయానికి, నన్ను ధిక్కరించి, నిలిచి ప్రశ్నించే మీబలానికి ఎట్లా acknowledgement కనబరచను?' అన్నాను.

'లీల' అని పేరుపెట్టి మీరుచెప్పడం వృత్తమూర్ఖం-ఎక్కణ్ణించో యీ జ్ఞానం వూడిపడ్డదన్నా, ఏ అమెరికానించో ఇంద్రలోకంనించో జారివొచ్చిందన్నా, చచ్చినవాళ్లు ఎవరో పలికిస్తున్నారన్నా, వాళ్ళెరగని వాళ్ళెవరన్నా



నేను సర్ యస్. పి. గారి బంగళా కొందామనుకుంటున్నాను.
సరే, నే నెప్పుడో బయానా ఇచ్చాను దానికి.

అయ్యితేచాలు మీతోవొచ్చి చెప్పారంటే, మీరు వ్రాసిందాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తారు. గాని, 'లీల' ఎవరో తెలిసేప్పటికి, మీరువ్రాసిన స్పష్టమైన విలువైన విషయాల్లో తేలికలూ అబద్ధాలూ కనపడతాయేమో. నన్నెరిగిన మనుషుల్లో మరీపుడుతుంది జబ్బు. నా ఎదటిమనుషుల్లో వాళ్లమాటల్లో స్పష్టంగాకనపడే లోపాలకి నాకళ్లు మూసుకోలేకపోవడం వల్ల, వొచ్చిన అనర్థం ఇది.'

'మరి వాళ్ల గొప్పతనాలు!'

'గొప్పతనం అంటూ ఒకటివుంటె అది ప్రత్యేకమే నామనసులో. లోపాలు లోపాలే. ఆ గొప్పతనంవల్ల యీ లోపమూ కప్పపడదు. ఈ లోపం వుండడంవల్ల ఆ గొప్పతనాలూ కొరత పడవు. ఈపనిలో ఈమాటలో నువ్వు నీచపడ్డావంటే, 'నువ్వు నీచుడివి' అన్నానన్న అర్థంలో తీసుకుంటారు. అందరూ ఆప్తులే. సమయంవొచ్చేప్పటికి వాస్తవానికి నిలబడ్డవాళ్లు ఒక్కరూ కనబడరు నా చిన్నజీవితంలో. ఎక్కడో అక్కడ తేలిపోతారు. ఈప్రజలకి తెలిసివున్న గొప్ప స్త్రీకన్న, కాలంలో స్థలంలో దూరమైన క్షుద్రురాలు విలువ ఎక్కువ. ఏమాట ఎటు పెడఅర్థం తీస్తే, ఏకార్యానికి ఏ వంకరవిలవకడితే, తమకళ్ళల్లో, ఇతరుల కళ్ళల్లో, పడిపోతుందో, ఆకోణం చప్పనగ్రహించడంలో చాలా కుశాగ్రతవుంది యీ తెలుగువాళ్లకి. ఆర్టిస్టు, చివరికి వంటలో ఆర్టిస్టునైనాసరే గౌరవిస్తాను నేను. కాని ఆగౌరవాన్ని చూసి, తాను అన్నిట్లోనూ చాలా ఘనతకలవాణ్ణని, గర్వపడడం కనపడుతుంది. ఎంతమూర్ఖం చూడండి.

నన్ను మీరు 'మీరు'ని సంభోధించడంలోనే, ఎంతగాయం? నన్ను తెలిసివున్నవాళ్లకీ ఎంతవెకిలి!' అన్నారులీల.

rాజకీయాలమీద భగవంతుడికి నివేదికలు :

# గాంధీ జిన్నా సమావేశం

హే జగన్నాటక సూత్రధారీ!

గాంధీ జిన్నా సమావేశ సందర్భంలో, ప్రజల ప్రార్థనలు వినలేక, విసుగెత్తి తమరు నిద్రింప నిర్ణయించారనీ, అందులో కమ్యూనిష్టులు కూడా, "భక్తవర్గాన్ని" హస్తగతం చేసుకుని వారిమీద నాయకత్వం సంపాదించే ఉద్దేశంతో ప్రార్థనలు ఏర్పాటు చేస్తున్నారని విని వెంటనే మునుగెట్టేశారనీ తెలిసి, తమకి అప్పటి విషయాలు నివేదింప సాహసిస్తున్నాను. నా సాహసం మన్నిస్తే ధన్యుణ్ణి. మన్నించకపోతే, మరేం ఫరవావేదు. తమరు 'జనులపాలిట వొత్తి నల్లమందని' మాకు ఎలానూ తెలుసు!

జబ్బుపడి జైలుగేట్లు తెరిపించుకు బయటకొచ్చిన గాంధీజీ పరిస్థితులో క్రమాటుగా సింహావలోకనం చేశాడు. రణరంగంలో తన బలగం గోతులు తీసుకు పాతుకు పోయివుంది. ఎటూ కదలకుండా 'స్థావరయుద్ధం' ఎప్పుడూ కూడదని శాస్త్రవేత్తల శాసనం. అప్పటి స్థావరయుద్ధం "చలన" యుద్ధంక్రింద మార్చడం ఎలాగా అని గాంధీజీ ఆలోచించాడు. అంతర్వాణి పలికింది.

"ఒక శత్రువు మరీ మూర్ఖుడై లొంగనప్పుడు, వాడి నలా తాత్కాలికంగా విసర్జించేసి, మరెవరైనా శత్రువు లున్నారేమో వెతికి, అక్కడ నీపాచిక పారుతుందేమో చూడు," అని శాస్త్రం. వేవెల్ దుర్గం పడనంది. కనక, చప్పున రథం మళ్లించి జిన్నా దుర్గమేమన్నా కదులుతుందేమో చూడూ అంది మహాత్ముల అంతర్వాణి.

అదే సమయంలో మాల్వీజిన్నా సాయిబుగారికీ అదే స్ఫురించింది. పంజాబు యుద్ధంలో పరాజితుడయిన జిన్నాసాయిబు తన ద్వితీయ విరోధి, గాంధీజీని పల్టీ కొట్టించడానికి వీలుందా అని ఆశ్చర్యపడసాగాడు.

మానసికంగా, మాల్వీ, మహాత్ములు, ఉభయులూ, పోటీకి, తయారయారు.

ఎవరు ముందు తొడ కొట్టాలా అన్నది సమస్య! అంతర్వాణి సలహామీద మహాత్ముడే ముందు తొడగొట్టాడు. మాల్వీసాయిబు పంట్లాం విప్పకుండానే తనూ తొడ గొట్టాడు. సైం అంటే సైం. అనుకున్నారు వస్తాదులిద్దరూ. ఇది ధర్మయుద్ధం కనక, అనుచరుల్నందర్నీ దూరదూరంగా ప్రేక్షకులుగా వుండమని అట్టే బెట్టేశారు.

గొప్ప వస్తాదుల పోటీ! చూడాలని ఎవరికుండదు?

పోటీ జరిగితే లోకానికి అరిష్టం! మహాత్ముడు చిత్తయిపోతాడు; మాల్వీ మహాత్ముడి గుండెలమీదెక్కి కూచుంటాడని 'అఖండు'లంతా గోల. పూర్వాపరాలు విచారిస్తూ మిగతావాదులంతా, అమితంగా పేపర్లకి వ్యాఖ్యానాలు వ్రాశారు. వస్తాదుల అనుచరులుమాత్రం మా ఉజ్జీ నెగ్గకపోతుందా, అంటే, మా ఉజ్జీ నెగ్గకేంచేస్తుందని తలపూపుకున్నారు.

కాని అసలు సందడంతా మన కమ్యూనిష్టు భాయీలది. వాళ్లు విప్లవ

దృష్టితో పోగుచేసిన సంతకాల ఫలితమే యిదనీ, ఇహ వాళ్ళ ప్రతికక్షులందరూ ఈ దెబ్బతో అణగారిపోయారనీ సంతోషపడి పోయారు. గాంధీ జిన్నాలు చిత్తవడమేఖిటి? వాళ్ళిద్దరూ ఒకర్నొకరు కౌగలించుకుని, విడిపోకుండా అర్ధనారీశ్వరుల్లా అలా వుండి పోతారనీ వాళ్ళ ఆశ—వాళ్ల సంతకాల ఫలితంగా!

అనుకోగా, అనుకోగా, అరో జొచ్చింది. అందరుచూస్తూండగా-గాంధీజీ, జిన్నాని కౌగలించుకున్నాడు. జిన్నా గాంధీజీని, తిరిగి కౌగలించుకోకపోయినా, తోసెయ్యలేదు. శుభచిహ్నమే అన్నాయి పత్రికలు. మరేమనుకున్నారు అన్నారు కామ్రేడులు.

ఇక మేం చేసేది మీకు 'ఊహ్యమే' కాని దృశ్యం శ్రవ్యం కాదని ప్రక్క ఉన్న అందరికీ చెప్పేసి, గాంధీ జిన్నాలు గదిలోకి అదృశ్యమయ్యారు.

గదిలో ఏం జరుగుతోందో యెలా ఊహించుకోడమా అని ఆలోచనలో బయట జనం. గదిలో గుసగుసలు.

"ఎవరు నువ్వు" అన్నాడు జిన్నా.

"నా పేరు గాంధీ."

"నీ పేరు కాదు. నీహోదా నే అడుగుతున్నది." "నాకు వేరే హోదాలేదు. నేనే హోదాని."

"నువ్వెవరివో, నీ పుట్టుపూర్వోత్తరాలేమిటో నీ హోదా యేమిటో ముందు చెబితేగాని నే చెయ్యి కలపలేను. నాకు సమాన ఉజ్జీ కావాలి కాని, ఎవరితో పడితే వాళ్ళతో కలబడ్డం నామతం కాదు" అన్నాడు జిన్నా.

"ఇష్టముంటే కలబడు లేకపోతే మాను. నేనే నాహోదాని. నాకు నేనే సర్టిఫికేట్టుని" అన్నాడు గాంధీజీ.

"అయితే కుదరదే."

"మా చక్కగా కుదురుతుంది" అన్నాడు గాంధీజీ.

"కుదరదు. అయినా ఇంతదూరమూ వొచ్చి, అసలేం చేసుకోకుండా పోతే బాగుండదు కనక మొదలెడుతున్నాను. నా కిష్టమొచ్చినప్పుడు యెలాగా మళ్ళీ మొదటికొచ్చి, నీహోదా చూపించమని పేచీ పెడతానుగా" అన్నాడు జిన్నా.

"అప్పుడూ అదే జవాబు" అన్నాడు గాంధీజీకి. పోటీ ప్రారంభమయింది. ప్రధాన పేచీలు 'మాటలు.'

"నీకూ నాకూ మధ్య ఓ సముద్రముంది" అన్నాడు గాంధీజీ.

"అది దాటేలంటే నాకు నావ కాదు కదా, తెప్పయినా కనిపించడంలేదు."

"క్షణంలో తెప్ప చూపిస్తాను" అన్నాడు జిన్నా.

తెప్పకోసం వెతకడం ప్రారంభించారు. తెప్ప కనిపించదు. చీకటి పడిపోయింది. ఇహ అసలు కనిపించదు. రేపు పగలు వెతుకుదాం అనుకున్నారు. ఎవరిళ్ళకి వాళ్లు వెళ్ళిపోయారు.

తెప్ప చూపించమని జిన్నాసాయిబు నమాజు చేశాడు.

గాంధీమహాత్ముడు ప్రార్థనచేశాడు. కాని చాలామందిని సాక్ష్యం పిలిపించుకొని తమరు గాఢ సుషుప్తిలో వుండినందువల్ల కాబోలు అవి వినలేదు. వారికోరికలు మంజూరు చెయ్యలేదు.

గాంధీ జిన్నాలు మళ్ళీ కలుసుకున్నారు. మళ్ళీ మళ్ళీ కలుసుకున్నారు. మాటలు గాలికి పోతాయి. అన్నది కాదంటే సాక్ష్యమేది కనక! ఉత్తరాల యుద్ధంకూడా కానిద్దామన్నారు. ఉత్తరాలు విసురుకున్నారు ఒకరిమీద ఒకరు.

జిన్నా సాయిబుగారన్నారు. "నేనేం చెబుతున్నానంటే...కొంతకాలం కిందట మేము లాహోరులో చెప్పిందే మళ్ళీ చెబుతున్నాను."

మహాత్ముడు కేలు మోడ్చి సవినయంగా అన్నాడు. "తమరు లాహోరులో చెప్పినది నేను విన్నాను. కాని నాకేమీ అర్థంకాలేదు."

"అర్థంకాలేదా? అయితే విప్పి చెబుతాను" అని ఒకగంటసేపు లెక్చరిచ్చాడు. అంతసేపూ విని గాంధీజీ "తమరు చెప్పినది నిజమని తోచదు. మీరు అప్పుడు నిజంగా అననివన్నీ, ఇప్పుడు అన్నామంటున్నారు. మా రాజాజీ వున్నాడే, అతను మీరు లాహోరులో చెప్పింది బాగా అర్థంచేసుకుని నాకు విడమర్చి చెప్పాడు. అది నాకు నచ్చింది" అన్నాడు.

"నేనేం చెప్పానో నాకు తెలుసు. రాజాజీ కేం తెలుసు" అని ఉరిమాడు జిన్నా.

"తమరు అలా శలవియ్యకూడదు. రాజాజీ చాలా తెలివయినవాడు... "మీరు చెప్పినదానికి అతను వ్యాఖ్య చెప్పి మీ కోరికకి రూపమిచ్చాడు." అన్నాడు గాంధీ.

"నా కోరికకి రూపమివ్వడమేమిటి? దాన్ని 'అపరూపం' చెయ్యడానికి ఎత్తేశాడు". అన్నాడు జిన్నా.

"మీది తప్పు అభిప్రాయం"

"కాదు నా అభిప్రాయమే రైటు" లాహోరు రిజల్యూషను నాది. నా సొత్తు. దానిమీద మరెవరికీ వ్యాఖ్యానానికి హక్కు లేదు"

"నాకు, అయితే, అది ఎంతమాత్రమూ నచ్చలేదు" అన్నాడు గాంధీ.

"లాహోరు..." అని ప్రారంభించబోయాడు జిన్నా.

"లాహోరు సంగతి మళ్ళీ ఎత్తొద్దు. అది వింటే నాకు గుండె దడుపట్టుకుంటుంది. రాజాజీ..." అన్నాడు గాంధీజీ.

"రాజాజీ పేరు ఈ ఆవరణంలో ఎత్తడానికి వీల్లేదు. నాబుర్ర పేలిపోతోంది" అన్నాడు జిన్నా.

మాటలు స్తంభించిపోయాయి.

కొల్లాయి గుడ్డ కట్టుకుని తన చక్కటి మెత్తని సోఫామీద గాంధీ కూచోడం జిన్నాకి నచ్చలేదు.

"నువ్వెవరివి? నీ పుట్టుపుర్వోత్తరాలేమిటి? నీ సర్టిఫికేట్లేవి? రికమెండేషన్లేవి? నీ హోదాయేమిటి?" అని అకస్మాత్తుగా అడిగాడు జిన్నా.

"ఇదివరకే చెప్పానుకానా, నాకు నేనే సర్టిఫికేట్టునని. నాకు హోదా లేదని. ఇప్పుడు మళ్ళీఅడిగితే, వేరే, నేనేం చూపించగలను" గాంధీజీ.

"అయితే నీకూ నాకూ డిల్లాయ్. నువ్వు నా వుజ్జీ కావు" అని జిన్నా లేచిపోయాడు.

గాంధీజీ, జిన్నాని మళ్లీ కావలించుకోబోయాడు.

"నీకూ నాకూ మధ్య ఓ సముద్రముందన్నావు. ఇప్పుడు నిన్ను కౌగలించుకుంటే నేనా సముద్రంలో పడిపోతాను. అధమపక్షం నాబట్టలయినా తడిసిపోతాయి. నీలాగా నాదేం కొల్లాయి గుడ్డ కనక నా తేలిగ్గా ఉతకెయ్యడానికి. వీల్లేదు నన్ను కావలించుకోడానికి" అని కసిరేశాడు జిన్నా.

అఖండులు "అమ్మయ్య!" అన్నారు.

గాంధీ జిన్నాలు మళ్ళీ కలుసుకుని అతుక్కుపోవాలని కమ్యూనిస్టులు పుస్తకంరాసి అమ్మడం ప్రారంభించారు.

అనవసర ప్రయాణాలు చెయ్యొద్దని రైలువాళ్ళ నోటీసు. ఏంచెయ్యాలో తెలీక, గాంధీజీ, తమరిని ప్రార్థించనుంటాడు—ఇవేమీ పట్టించుకోకుండా హాయిగా నిద్రపోయిన తమరిని!



# పులిస్త్రాకులు

బ్బాలకిట్టయ్యగారింటో బాల కిట్టయ్య కూతురు పెళ్ళి అయితుండది గనక, భోజనాలకి పూళ్లో రావల్చిన జనం రేత్తిరి పదిగెంటలకి రవిలు పెట్టెలకు మల్లే తోసుకుంటా, ఆ గ్యాసులైటు ఎలుగ్లో తలుక్ తలుక్కుమంటా రంగులు కురిపిత్తా, సోల్పన లోనకు జేర్తుండారు సల్లగా పెల్లోరిల్లు గబ్బలెగుపుతా.

కాత్తెపెడగా యాప సెట్టు కింద గోడకాడ సీకట్లో, ఆయాల్డాకా లోన పెల్లివంటకాలగాలిబీలుత్తా వూగులాడ్తా కూకునుండ యానాది ఎర్రాయి, ఎర్రాయి సెల్లెలు ఎంకటాం, బామ్మరిది ఎంకాయి, భోజనాల జనం రాటం సూసి, సగం వాలుండ మడుసులు లెగిసి నిటారుగా కూకుండారు మల్లీ, ఎర్రగుడ్లను గురిబెట్టి నిలుపుతా.

"బాలకిట్టయ్య గోరే వన్నాడూ?" అన్నాడు ఎర్రాయి.

"గేటుకాడి కొత్తే కాళ్ళిరగేత్తానన్నాడు" అంది ఎంకటాం.

"నే వుండానా ఆడా?" అన్నాడు ఎర్రాయి.

'ఎనిక్కెత్తే వుంటివే!' అంది ఎంకటాం.

"పానీలే!" అన్నాడు ఎర్రాయి.

"అయితే యిదివుప్పడ ఇద్దంటూ?" అనడిగాడు బామ్మరిది ఎంకాయి.

"ఇదేందీ?" అనంది ఎంకటాం.

"నూగాగులే ఎర్రాయి నడుగుతుంటే" అన్నాడు ఎంకాయి.

"యిదేందీ?" అనడిగాడు ఎర్రాయి, సమాదిలోనుంచిలెగిసి నోడికిమల్లే.

"యీరిప్ప డొచ్చారుగందా! తింటంఅయ్యేతలికిఎంతలెక్కయిద్దంటూ?" మల్లీ సెప్పాడు ఎంకాయి.

"జెమ్మకు తెలవాల" అన్నాడు ఎర్రాయి, ఇశారంగా.

"అంతే నంటూ!" కాత్తె ఎనిక్కితగ్గాడు ఎంకాయి.

"ఇత్తరాకు ఏసిన కాణ్ణుంచి వుపాచస తాగేయాలకు గెంటయిద్ది" అంది ఎంకటాం.

"వుపాచ నేందే ఎంకటాం?" అనడిగాడు ఎంకాయి.

"నీకు తెలవదెట్టా? అదేందో నీలంట! కూడు తినకబొయ్యే ముంగల ఏలుముడిసి తాగుతారు" అందిఎంకటాం.

'నీకు చిసలగా దెల్చంటూ?' అనడిగాడు ఎంకాయి.

"చరేలే! వోపాలియిటనే బొమ్మలింటో పెల్లయితే, కూడుకెల్లిన జనం గెంట లెక్కయినా బెయిటకి రాకుంటేనీ, ఏందబ్బాయిదీ అనుకుంటా తడిక మాలకెల్లి చందుకుండా సూశా. ఆడకి దెగ్గిర్లో కూకునుండ వో ముసాలి బాపనాయిన పక్కనే నిదరబోతుండ పిల్లోణ్ణి 'లేవరా వుపాచన కానిత్తుబిడారూ' అనంటన్నాడు. ఆ నీలు తాగారూ, ఇగ తింటం మొదులు బెట్టారు" అనంది ఎంకటాం.

"పానం దీశావే! వుపాచం తాగేయాలకి గెంట లెక్కయితే, ఇంక తింటం మొదులు పెడ్తే ఏయాల కయిద్దీ?" జారుగా అన్నాడు ఎంకాయి.

"సిత్రం ఏందంటే, ఆనక యిత్తరాకుల్లో అయ్యన్నీ అట్ట ఏసుంటయి గందా, వుపాచన లాగేదాకా అట్నీ సూత్తా బిగదీసు కూకోటం కట్టవంటావా కాదంటావా? అట్ట నూ కూకుంటావంట్రా ఎంకాయ్?" అనడిగింది ఎంకటాం.

"ఎవురు, నేనా? ఆ, అటనే కూకుంటా. సమచ్చరాల్చమచ్చరాలు కూకోమంటే కూకునేదే! అచలు ఆవజాన ఆట్నిసూత్తా కూకుంటే నేబవు ముచ్చట గుండదంటే ఎంకటాం!" అన్నాడు ఎంకాయి సొంగకారుత్తా.

"అట్ట నేవుండలేనయ్యా సెప్పొద్దూ. అట్ట యిత్తరాకులో బూరిముక్క పడ్డదంటే, అటిటుసూసి గబిక్కన నోట్లో ఏసుకుని కల్లుమూసుకోనూ, ఇ హి హి హీ!' నవ్వాగలా ఎంకటామకు.

"నేఅయితేనా, పొప్పుసుద్దనోట్లోకీ, బూరిముక్క బొడ్డోకీ యిహ్హా యిహ్హా యిహ్హా!" అంటా తనూజోడు కలిపాడు ఎంకాయి.

"లోన యాడా వుపాచన యినిపియటంలా!" ఆయాల్దాకా కైలాసానికి పోయి నాడికి మల్లే కూకునుండ ఎర్రాయి, తబిక్కన ఆమాటన్నాడు.

"ఆఁ?" అన్నాడు ఎంకాయి.

"వుపాచనా?" అంది ఎంకటాం.

"గెంటయింది. లోనెవురూ కూడు దింటం అగుపియదు" అన్నాడు ఎర్రాయి సన్నగా.

"ఇంత పొద్దుబోతే జనానికి కాకెక్కి మొత్తం నాకి పారేత్తే, గోడయీ తల్లికి. వుత్తపులిత్రాకు వొత్తయ్యేవోఁ!" అంటా గుటకేశాడు ఎంకాయి.

"యాడన్నా తడికుందేవోఁ సూసిరానెట్టా?" అంది ఎంకటాం.

"మొదులు సెడుద్ది వుండమ్మోప్" అన్నాడు ఎంకాయి.

"ఇప్పటికి వుపాచన కాకుంటే ఇగ తెల్లారుద్ది" అంది ఎంకటాం.

"హుఁ" అన్నాడు ఎర్రాయి.

"ఎట్టా?" అన్నాడు ఎంకాయి.

"కల్లు దిరుగుతుండై" అంది ఎంకటాం.

"మంది యాదవ జలమ!" అనేశాడు ఎర్రాయి.

"మెల్లిగా అంటావేం?" అన్నాడు ఎంకాయి.

"సనే శరబ్బతుకు!" అంది ఎంకటాం.

తుబుక్కున వూసి, అట్టనే పొండుకుండాడు ఎఱ్రాయి, కడుమ్మీన సెయ్యేసుకుంటా.

శానాసేపయ్యింది...

"ఎంకటాం?" అన్నాడు ఎంకాయి సల్లగా.

"ఏందిరా?" అంది ఎంకటాం.

"ఆకలయితుండదా?" అన్నాడు ఎంకాయి.

"నీకో?" అంది ఎంకటాం.

"రగుల్తుండది."

"నాకూ రగుల్తుండది."

"ఎప్పుడూ మనిద్దరం వొకటేనే."

"అటనే బాగుంటది."

"మనంగూడా పొండుకుందావా?"

"వూఁ."

"మీన సెయ్యెయ్యి."

"అమ్మో; యీడా!"

"ఎఱ్రాయి అటుదిరిగి పొండుకుండాళ్ళే."

అనువంటప్పుడు మద్సులకి జీవాలు ఎటుపామంటే అటు లెగిసిపోతయి.

పక్కన మురుగ్గుంటలో కప్పోటి గోడమీనకి గెంతేసి పడింది.

మొండితోక నల్లకుక్క వొచ్చింది. పెళ్ళోరిగేటు కల్లి మోరెత్తి గాలి బీల్సింది. వొచ్చి ఎఱ్రాయి ఎంకాయి ఎంకటావుల్ని వొకంట సూసింది. తబ తబ వొల్లుగోక్కునీ ఎటో లగెత్తింది గెంట అవలేదనుకుంటా.

పొడుగాంటి మడిసి యిగ్రహం—పెళ్ళోరింటిపక్క తలుపు తెర్సుకుని బెయిటకొచ్చింది.

ఆడ సీకటిమయం.

సుప్పాల్ల ఎలిగిచ్చింది యిగ్రహం చిగిరెట్టు ఎలిగియను—ఏందనీ? ఆడ ఏందో కన్నుకు సురీటిగా తగిలింది యిగ్రహానికి. మల్లీ సుప్పాల్ల ఎలిగింది—పైట తొలిగి పడుండ ఎంకటాం వొల్లు తలుక్కుమం దాడ.

వొల్లు జలబరిచ్చింది యిగ్రహానికి.

బంగారం వుండదాడ. రతనాలుండయ్యాడ. సొరగం వుండదాడ.

యిగ్రహానికి మైకం కమ్మింది. రఖతం కాగింది యిగ్రహానికి. లోన ఏందో పచ్చికి మల్లే రెక్కలాడిచ్చింది యిగ్రహానికి—అటనే వొరిగింది యిగ్రహాం ఎంకటాం పైట తొలిగినకాడికి—

తబీ తబీ మంది ఏందో—

'అబ్బా' అనరుత్తా యీపున సెయ్యేసుకుని బూమ్మీన పడివుంది యిగ్రహం రఖతం గక్కుతా.

"ఓమ్మో!" అని మూలిగింది ఎంకటాం, లెగిసి పయిట సరుదుకుంటా.

"యదవా!" అన్నాడు ఎఱ్రాయి, గెడకుమల్లే నిలబడి బుసలిడుత్తా.

"గోయిందా" అనరిశారు బోజనాల కాడ పెల్లిజనం.

"బాబో - సచ్చాంరా లగెత్తండ్రా లగెత్తండ్రా, బెయిటికొత్తుండారూ-" అనరిసింది ఎంకటాం, ఎఱ్రాయినీ, లెగిసి తెరసూపులు సూత్తుండ ఎంకాయినీ సేతులు పట్టుకుని లగెత్తుతా.

ఆడ పుల్రాకులు లెగిసాణ్ణయి శానాసేపుటికి.

మూ. గోఖలే.

# ఆంధ్రజ్యోతి పజిల్స్ 2

## శ్రీ. శ్రీ. రచన.

[ప్రస్తుతం వినోదంకోసమే. ఇంకా విత్తంమీద కాంక్షలేదు.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ప | | | 2 | ద | 3 | | | 4 ము |
| | ■ | ■ | | ■ | | ■ | ■ | |
| | ■ | 5 | | ■ | 6 | 7 | ■ | |
| 8 | | | డ్డి | ■ | 9 జి | | | |
| మా | ■ | ■ | ■ | ■ | ■ | ■ | ■ | గు |
| 10 | | 11 | 12 కు | ■ | 13 జ | 14 | | |
| | ■ | 15 | | ■ | 16 | | ■ | |
| | ■ | ■ | | ■ | | ■ | ■ | |
| 17 ము | | | – | మూ | | | | లు |

### అడ్డము :

1. వైకుంఠ పాళీమెట్టు.
5. సాగనంపటానికి మొదలు.
6. అయా సమయాలలో ఉచ్చారణ విశేషం.
8. సుబ్బమ్మగారి ఇంటిపేరు గల తెలుగు కవి.
9. మజిలీలో మార్పు.
10. — కొన్ని కిటుకులు క్రిందటి సంచికలో ప్రకటించాం.
13. అపరాధం.
15. తలతిరుగుడు.
16. పులిని ఇమిటేట్ చేసిన జంతువు.
17. బహుశా.


## ని లు వు :

1. భీష్మలో బలిజేపల్లి.
2. వేస్తే భగ్గునమండే శత్రుత్వం.
3. 15 న — (భారతకవి)
4. జిన్నా వగైరాలు.
5. — గదిలో కిర్రుగానుద.
7. సంవత్సరం.
11. నోటికివచ్చిన తిట్లలో నమస్కారం.
12. గోదావరి ఈదటానికి పనికిరాదు.
13. ఎవరికైనా తండ్రే; ముఖ్యంగా సీతకు.
14. ఒకతార.

—సొల్యూషన్ వచ్చేసంచికలో

## జూలై నెల సొల్యూషన్

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | ■ | ■ | 1 జా | 2 క | వి | ■ | 3 బూ | 4 రా |
| ■ | 5 ఉ | సి | రి | క | ■ | 6 వై | చి | త్రి |
| ■ | ద | ■ | ణి | ■ | 7 మ | ఖ | ■ | ■ |
| 8 క్రా | య | లు | ■ | 9 మే | ద | రి | ■ | 10 శ |
| 11 వే | ము | ■ | 12 ల | ■ | ము | ■ | 13 రం | కు |
| రి | ■ | 14 వే | ల | ము | ■ | 15 ర | జ | నీ |
| ■ | ■ | 16 న | న | ■ | 17 ఆ | ■ | న | ■ |
| 18 జా | 19 బా | లి | ■ | 20 పా | య | స | ము | ■ |
| 21 రీ | టా | ■ | 22 న | ట | న | ■ | ■ | ■ |



3

రెండుమాసాలయింది, వనమాలి చనిపోయి. కలకత్తాలోని వారి అంత పెద్ద ఇంట్లో ఇప్పుడు విజయ ఒక్కతే ఉంటున్నది. గ్రామంలోని ఆమె ఆస్తిపాస్తులన్నీ రాసవిహారి చూస్తున్నాడు. ఆ సంబంధంతోనే ఒకవిధంగా అతను విజయకు గార్డియన్ అయి కూర్చున్నాడు. కాని తాను గ్రామంలో ఉండటంచేత పుత్రుడైన విలాసవిహారిమీద విజయయోగక్షేమాలు కనుక్కునే భారం పెట్టాడు. అంచేత ఇప్పుడు విలాసుడే గార్డియన్ అయాడు.

ఆ రోజుల్లో ప్రతి బ్రాహ్మకుటుంబంలోనూ 'సత్యము' 'సునీతి' 'సురుచి' మొదలైన శబ్దాలు మహాగొప్పచేసి నేర్పుతూ ఉండేవారు. ఎందుకంటే పట్నంలో చదవటానికి వచ్చిన హిందూ యువకులు తల్లిదండ్రులమీదా, దేవీదేవతలమీదా, ప్రాతుకుపోయిన సమాజంమీదా, ఎదురుతిరిగి బ్రహ్మసమాజపు రిజిష్టరులో తమ పేరు ఎక్కించుకున్నప్పుడు, వారి లేత తలలను వాలిపోకుండా ఈ మాటలే నిలబెట్టుతూ ఉండేవి. 'ఏది సత్యమని తోస్తుందో అదే చేస్తాము. తల్లి కన్నీరుగానీ, తండ్రి నిట్టూర్పులుగానీ మేము చూడము, వినము. ఈ దుర్బలత్వాన్ని మేము అన్నివిధాలా ప్రయత్నించి దాటిపోతాము. లేకపోతే నిజమైన ప్రకాశాన్ని మేము చూడలేము.' అని వారంటూ ఉండేవారు. ఈ మాటలు విజయకూడా నేర్చుకున్నది.



# వాగ్దత్త

ఇవ్వాళ ఊరునించి విలాసుడు ముసలి తాగుబోతు, జగదీశుని మరణవార్త తీసుకొచ్చాడు. విజయ తండ్రికి ఆయన బాల్యమిత్రుడే. కాని, జగదీశుడు చిత్తుగా తాగి డాబామీదినించి క్రిందపడి చనిపోయాడని విలాసుడు చెప్పినప్పుడు విజయ బ్రాహ్మమతంలోని సునీతిని తలచుకుని దురదృష్టవంతుడైన, తండ్రిబాల్యమిత్రుని మీద అసహ్యించుకోటానికి ఆమె లేశమాత్రం వెనుదీయలేదు. విలాసుడు చెప్పనారంభించాడు:

"జగదీశబాబు మా నాయనకుకూడా, బాల్యస్నేహితుడే; కాని మా నాయన అతని ముఖంవంకకూడా చూసేవాడుకాదు. రెండుసార్లు డబ్బు అప్పు ఇవ్వమని నాన్నదగ్గరికి వచ్చాడట. ఆయన రెండుసార్లూ నౌకర్లచేత బయటికి గెంటించాడట. నాన్నగారు ఎప్పుడూ "ఇలాంటి దుర్నీతి పరాయణులకు మనం ఆశ్రయం ఇస్తే మంగళకరుడైన భగవంతుని సన్నిధిని మనం తప్పుచేసినవారిమవుతా మని అంటూ ఉంటారు."

"మహాసత్యమైన మాట" అన్నది విజయ దాన్ని ఆమోదిస్తూ.

విలాసుడు ప్రోత్సాహితుడై ఉపన్యాసం ఇచ్చే ధోరణిలో మాట్లాడటం మొదలుపెట్టాడు:—"స్నేహితుడుగానీ, ఆఖరికి చుట్టంగానీ, బ్రహ్మసమాజపు చరమాదర్శాన్ని మనం దౌర్బల్యంవల్ల కించపరచకూడదు. ఇప్పుడు న్యాయతః జగదీశబాబు ఆస్తి మనది. అతనికొడుకు తండ్రి అప్పు తీరిస్తే సరే సరి, లేకపోతే మనం చట్టప్రకారం ఈ క్షణానే ఆ ఆస్తి స్వాధీనం చేసుకోటం మంచిది. అసలు వదిలిపెట్టటానికి మనకేవిధమైన అధికారమూ లేదు. ఎందుకని అంటే మనం ఈ డబ్బుతో ఎన్నో సత్కార్యాలు చేయగలం. మన సమాజంలోని కుర్రవాణ్ణి ఎవణ్ణయినా విదేశాలకి పంపించగలం; మతప్రచారానికి ఖర్చుపెట్టగలం; ఇంకా

ఏమైనా చేయగలం. మనం, అసలెందుకు చేయకూడదో చెప్పండి? అదీకాక, జగదీశబాబుగానీ, అతని కొడుకుగానీ మన సమాజం వాళ్ళయినా కారు, పోనీ దయ చూపిద్దామనుకుంటే! మీరు గనక ఒప్పుకుంటే నాన్నగారు అంతా సరిచేస్తానన్నారు. ఈ వ్యవహారం మీదే నన్ను మీదగ్గరికి పంపించిందికూడా."

విజయకు చనిపోయిన తండ్రి తుదిపలుకులు జ్ఞాపకంవచ్చి ఆలోచనలో పడింది—వెంటనే జవాబు ఇవ్వలేకపోయింది. ఆమె సందిగ్ధంలో పడటంచూసి విలాసుడు బిగ్గరగా, దృఢస్వరంతో చెప్పసాగాడు:

"ఊహుఁ. మిమ్మల్ని నేనెంతమాత్రం సందిగ్ధంలో పడనివ్వను. సందిగ్ధత, దుర్బలత—పాపం! పాపమేమిటి—మహాపాపం! నేను ఎప్పుడో స్థిరపరుచుకున్నాను—ఆ ఇల్లు మీ పేర వ్రాయించి, ఇంతవరకు ఎక్కడాలేనిది, ఎవ్వరూ కనీ వినీ ఎరగంది—నేను చేస్తాను. ఆ పల్లెటూళ్ళో బ్రాహ్మమందిరం ప్రతిష్ఠించి దౌర్భాగ్యులూ, మూర్ఖులూ అయిన పల్లెటూరి వాళ్ళకు మతబోధ చేయిస్తాను. మీరు ఒక్కసారి ఆలోచించి చూడండి, ఈ మూర్ఖులబాధ పడలేక కాదా, స్వర్గీయులైన మీ పితృదేవులు విరక్తితో ఆ గ్రామం వదిలిపెట్టింది? వారి కన్యారత్నమైన మీకు—ఈ విధంగా కొత్తపద్ధతిని అపకారికి ఉపకారంచేసి, ప్రతిక్రియచేయటం—ఉచితం కాదా! చెప్పండి—నామాటకు జవాబుచెప్పండి."

విజయ చలించింది కొంచెం. విలాసుడు గంభీరంగా చెప్పుకు పోసాగాడు.

"దేశమంతటా ఎంత పేరూప్రతిష్ఠా, ఆందోళనా కలుగుతుందో కొంచెం ఆలోచించి చూడండి! బ్రహ్మసమాజంలో మనుషులున్నారనీ, వారికి హృదయమున్నదనీ, వారు స్వార్థత్యాగం చేస్తున్నారనీ హిందువులు వొప్పుకోవలసిందే. కాదంటూరా ఈ భారం నామీద ఉంచండి. ఎవరినైతే వాళ్లు నానా హింసలూ పెట్టి ఊరునుంచి వెళ్ళగొట్టారో, ఆ మహాత్ముని పుత్రికారత్నమే ఈనాడు వాళ్ళ మేలుకోసం ఇంత పెద్ద స్వార్థత్యాగం చేసింది. ఇది భారతదేశానికి ఎంత గొప్ప మోరల్ ఎఫెక్టు ఇస్తుందో చెప్పండి." అని విలాసవిహారి ఎదురుగాఉన్న టేబిలు మీద చరిచి గుద్దువేశాడు. ఈ మాటలు వింటూవింటూ విజయ ముగ్ధురాలయింది. నిజానికి ఇంత పెద్ద కీర్తి మీది లోభాన్ని వదులుకోవడం పద్దెనిమిదేళ్ళపిల్ల పట్ల కష్టం. ఆమె ఇది పూర్తిగా ఆమోదిస్తూ—"అతని కొడుకుపేరు నరేంద్రుడని విన్నాను, ఇప్పుడతను ఎక్కడ ఉంటున్నాడో ఎరుగుదురా?" అని అడిగింది.

"ఆఁ, ఆ దౌర్భాగ్యుడు తండ్రి చనిపోయినమీదట ఆ గ్రామంవచ్చి, తండ్రికి శ్రాద్ధంపెట్టి, ఇప్పుడా ఊళ్లోనే ఉంటున్నాడు."

"మీకు పరిచయమున్నదేమో అతనితో?"

"పరిచయమా! ఛీ! అసలు ముందు నన్నుగురించి మీరు ఏమనుకుంటున్నారో చెప్పండి!" అని విజయనోరు కట్టివేసి, మందహాసంచేస్తూ మళ్ళీ అన్నాడు:—

"జగదీశముఖర్జీ కొడుకుతో మాట్లాడాలని నేనెప్పుడూ తలవనే తలవను. కాని ఆవాళ హఠాత్తుగా రోడ్డుమీద ఒక పిచ్చివాడిలాంటివాడు పోతూఉండడం చూసి ఆశ్చర్యపడ్డాను. తర్వాత విచారిస్తే అతనే నరేన్‌ముఖర్జీ అని తేలింది."

"పిచ్చివాడిలాగానా? అతను డాక్టరని విన్నానే!" అన్నది విజయ కుతూహలంతో.

విలాసబాబు ఏవగింపుతో ముఖమంతా కుదించుకుని అన్నాడు:—"ఆఁ, సరిగ్గా పిచ్చివాడిలాగా. అతను డాక్టరని నాకేమీ నమ్మకంలేదు, తలనిండా బాగా పెరిగినజుట్టు—అతనెంత పొడుగ్గా ఉన్నాడో అంత రోగిష్ఠిగా కనపడుతు న్నాడు. ఎదురురొమ్ము వెళ్ళుకొచ్చింది, పక్క టెముకలన్నీ లెఖ్ఖపెట్టవచ్చు—ఇదీ ఆకారం, సరిగ్గా తాటాకుబొమ్మ! ఛా—"

నిజానికి ఆకారం చూసుకుని గర్వపడే హక్కు విలాసునికి ఉన్నది. అతను కొంచెం పొట్టి, లావు-దిట్టమైన మనిషి. అతని ఎదురురొమ్ముమీద బాంబువేసి నప్పటికికూడా ఎముకలు బయటపడవు.

అతను ఇంకా ఏమేమో చెప్పబోతూ ఉండగా విజయ అడ్డువచ్చి—"సరే, గాని విలాసబాబూ, మనం గనక జగదీశబాబు ఇల్లుతీసుకుంటే ఊళ్ళో అసహ్య మైన ప్రచారమేమీ జరగదు కదా?" అని అడిగింది.

"ఏమాత్రంజరగదు" అన్నాడు విలాసుడుగట్టిగా. "ఆ చుట్టుప్రక్కల ఐదారు గ్రామాల్లో జగదీశబాబుమీద సానుభూతి ఉన్నవాళ్లు మీకు ఒక్కరు కూడా దొరకరు. అస లిలాంటి మనిషిని ఈ ప్రాంతాల్లో ఎప్పుడూ చూడలే దంటారు వాళ్ళు." అని విలాసుడు మందహాసంచేసి—"ఒకవేళ అలాంటిదేమైనా ఉన్నా నేను బ్రతికి ఉన్నంతవరకూ మీరలాంటి దిగులేమీ పడనక్కర్లేదు. కాని, మీరొకమాటు కొద్దిరోజులపాటైనా అక్కడికి వచ్చి ఉండటం మీ కర్తవ్యమని నేననుకుంటాను." అన్నాడు.

"ఎందుకూ? నే మెప్పుడూ అక్కడికి పోలేదుగా!" అన్నది విజయ ఆశ్చర్యంతో.

"అందుకనే మీరు పోవాలంటాను నేను! ప్రజలను వాళ్ళ మహారాణీని చూడటానికి అవకాశమివ్వండి! ఇలాంటి సౌభాగ్యంనించి వాళ్ళని వంచితుల్ని చేయటం మహా పాపమని నా ఉద్దేశం." అన్నాడు విలాసుడు గంభీరంగా.

సిగ్గుతో విజయముఖం కందింది. ఆమె తలవంచుకుని ఏదో చెప్పటాని కుప క్రమించగానే విలాసుడు అడ్డువచ్చి—"ఇందులో వెనకా ముందాడవలసిందేమీ లేదు. ఒక్కమాటు ఆలోచించి చూడండీ, అక్కడ మీరు చెయ్యవలసిన పను లెన్ని ఉన్నాయో! మీ తండ్రిగారు అంతపెద్ద ఆస్తికి యజమానులై ఉండికూడా కొద్దిమంది పిచ్చికుక్కలకు వెరచి కలకత్తా పారిపోయి రావటం ఏ మాత్రం మంచిది కాలేదని నేను మీ ముఖం ఎదటే చెప్పతున్నాను! ఇదేనా మన బ్రహ్మ సమాజపు ఆదర్శం? ఇది అసలు ఏ సమాజానికీ ఆదర్శం కాదని వేరే చెప్పాలా?" అన్నాడు.

విజయ ఒక్కక్షణం మెదలకుండా ఉండి అన్నది:—"కాని మా నాన్న గారు, మా ఊళ్ళో ఉంటే ఇల్లు ఉంటాని కేమాత్రం పనికిరాదని చెప్పేవారేఁ?"

"మీరు ఆజ్ఞ ఇవ్వండి, నేను పదిరోజుల్లో ఆ ఇల్లు బాగు చేయిస్తాను. ఆ ఇల్లు మీ గౌరవానికి ఏమాత్రం లోటు రానీకుండాకూడా ఉండేటట్టు నేను నా శక్తి కొలదీ ప్రయత్నిస్తాను, ఈ భారం నామీద వెయ్యండి. చూడండీ. మీరు ఊరక ఎదటఉంటే చాలు, నేను ఎంతెంత పనులైనా అవలీలగాచేసి పారవెయ్యగలనని నాకు ధైర్యం ఉంది."

విలాసుడు విజయను ఒప్పించి వెళ్ళిపోయినమీదట ఆమె అక్కడే కూర్చున్నది. ఆమె పుట్టిన తర్వాత తన గ్రామం ఎప్పుడూ పోలేదు. కాని, అప్పుడప్పుడూ తండ్రినోట దాని వర్ణనవింటే విజయకు పట్టరాని ఆనందమూ ఉత్సాహమూ కలిగేది. కాని అప్పుడవి అంతగా ఆమెను ఆకర్షించలేదు—అందుచేత ఇటు వింటే అటు మరిచిపోయేది. కాని ఇవ్వాళ ఆ వర్ణనలే అకస్మాత్తుగా ఒకరూపు ధరించి ఆమె కళ్ళకు కనిపించసాగినై. గ్రామంలో ఉన్న ఇల్లు ఈ కలకత్తాలో మేడకు ఏ విధంగానూ సరితూగదు. కాని దీంట్లోనే కదా తన పూర్వపురుషులు తరతరాలంచీ ఉంటూ వచ్చింది! తన తాత ముత్తాతలూ, జేజి ముత్తవలూ, తల్లి తండ్రులూ, ఇంకెంతోమంది పూర్వీకులు తమ కష్టసుఖాలూ, పండగపబ్బాలూ ఆ యింట్లో జరుపుకుంటే తనకుమాత్రం ఎందుకు గడవదూ? అని ఆమెకు తోచసాగింది.

గల్లీకి ఎదురుగాఉన్న హాజరాగారి మూడంతస్తులమేడచాటుకు సూర్యుడు మాయమయాడు. ఈవిషయమై ఆమెతండ్రితో ఎన్నోసార్లు ఏమేమో మాట్లాడింది. అవన్నీ ఆమెకు జ్ఞాపకం రావటం మొదలుపెట్టినై. ఆయన సాయంత్రం ఈజీచైర్‌లోకూర్చుని, దీర్ఘంగా నిట్టూర్చి అనేవాడు:—"విజయా! మన ఊళ్లో అయితే ఎప్పుడూ ఈబాధ ఉండదు. అక్కడ ఏ హాజరాగారి మూడంతస్తుల మేడా లేదు, మన ఈ అస్తమించబోతున్న సూర్యుణ్ణి దాచటానికి. నువ్వు ఎరగవుగాని తల్లీ, నా కళ్లురెండూ ఈ హృదయంలోంచి తొంగిచూస్తున్నై. స్పష్టంగా కనపడుతున్నదికూడా. మన పూలతోటపక్కనున్న చిన్న నదిలో నీళ్లు బంగారపు రంగుతో తళతళ మెరుస్తూఉండటం; మనచూపు పోయినంతవరకూ పొలాలమీదుగా, సూర్యభగవానుడు క్రుంకాలని అనుకుంటూకూడా వీటిమీదిమోహంతో క్రుంకలేకపోవటం. ఇలాంటిసమయంలో ఇళ్లకు తిరిగివస్తున్న ఆవులూ, లేగలూ ఏవి ఏయింట్లోకి పోతైయోకూడా నాకు గుర్తుఉండేది. కాని తల్లీ, ఈ రోడ్డుమీదుగా సాయంత్రందాకా నాకరీచేసి ఇళ్లకుపోతున్న జనంవంక చూడూ, వాళ్ళకు నడవటానికికూడా రెండుమూడు గజాలకంటే స్థలంలేదు," అని ఆగిదీర్ఘంగా నిట్టూర్చాడు. ఇంత ఐశ్వర్యంలోనూ సౌఖ్యంలోనూ ఉంటూకూడా ఒకప్పుడు వదిలిపెట్టి వచ్చిన గ్రామాన్ని తలచుకుని తండ్రి బాధపడుతున్నాడని విజయ గ్రహించేది. ఐనా, ఒక్కనాడుకూడా దీనికికారణం ఏమిటా అని ఆమె విచారించలేదు. కాని, ఇవ్వాళ విలాసబాబు ఆమెదృష్టిని ఆవైపుకు మళ్ళించేవరకు ఆమెకు, చనిపోయిన తండ్రిగారి మాటలు గుర్తుకువచ్చి, వారి ప్రచ్ఛన్నబాధ కొంత గ్రహించగలిగింది. కలకత్తాలో ఇంతపెద్దఇంట్లో ఆమె ఏవిధంగా ఏకాకిగా ఉంటున్నదో తలుచు

కు నేవరకు ఆమెకు భయం ఎత్తిపోయింది. చిత్రమేమంటే, పుట్టినప్పటినించీ ఆమె ఏ యింటినైనా కంటితో కూడా చూడలేదో అదే ఇప్పుడీమెను బలవంతంగా ఆకర్షించటం మొదలుపెట్టింది.

- 4 -

ఎంతో కాలంక్రితం వదిలిపెట్టబడిన జమీందారుగారి గృహం విలాసుని అధ్వర్యంక్రింద బాగుకావటం మొదలుపెట్టింది; కలకత్తానించి కనీవిని ఎరగని విచిత్రమైనసామానులన్నీ ఎడ్లబళ్ళమీదరావటం మొదలుపెట్టినై. జమీందారుగారి ఏకైకపుత్రిక స్వగ్రామంలో నివసించటానికి వస్తున్నదని తెలియగానే కృష్ణపురంలోనేకాదు, రాధాపురం, వ్రజపురం, దిఘరా ఇంకా చుట్టుప్రక్కల ఐదారు గ్రామాల్లోనూ విడ్డూర్యంగా చెప్పుకోవటం ప్రారంభించారు. అసలు ఇళ్లప్రక్కన జమీందారు ఉంటానికి ఏ ప్రజకూ ఇష్టం ఉండదు. అందులో జమీందారు ఊళ్లో లేకుండాఉండటం వీళ్లకు బాగా అలవాటయింది. అందుచేత కొత్తగా జమీందారిణివచ్చి స్వగ్రామంలో కాపురం పెట్టడం, అన్యాయమైన ఒక ఉత్పాతం లాగా కనిపించింది, వాళ్లకి. మొదలు రాసవిహారి శాసనంక్రింద నే వాళ్ళకష్టాలకు అంతులేవు. పైగా జమీందారుకూతురు రావటంచేత కొత్తగా ఏమికష్టాలు రానున్నవో అని వాళ్లు రచ్చసావళ్ళలోనూ, నీళ్లరేవుకడనూ—చెడుగా విమర్శింపనారంభించారు. స్వర్గస్తుడైన వనమాలి జీవించి ఉండగా ఈ కష్టాలు ఉన్నప్పటికీ ఒక వీలుకూడా ఉండేది. ఈవిధంగా కలకత్తాపోయి పడగలిగితే వాళ్లు వనమాలి దగ్గరనించి ఉత్తచేతుల్తో తిరిగి వచ్చేవాళ్లు కాదు. కాని, ఇప్పుడు జమీందారిణి వయసా కొద్ది, తలబిరుసుతనమా జాస్తి, పక్కా దొరసాని, పైగా రాసవిహారి కొడుకుతో వివాహం కాబోతున్నదని వదంతికూడా బయలుదేరింది. ఇకముందు రాసవిహారివల్ల రానున్న కష్టాలు తలచుకునేవరకు ప్రజల మనసులో శాంతిలేకుండా పోయింది. జందెంవేసుకున్న బ్రాహ్మలూ అంతే, జందెంలేని శూద్రులూ అంతే. ఇలా భయంతోనూ చింతతోనూ వర్ష రుతువు గడిచింది. శరదృతువు ప్రారంభం కాగానే ఒకనాటి మధుర ప్రభాతాన జోడు గుర్రాలబగ్గీ ఎక్కి, వందలకొద్ది జనుల కుతూహల దృష్టి తనమీద పడుతూఉండగా, తరుణ జమీందారిణీ హూగ్లీ స్టేషనునించి పితామహ-ప్రపితామహుల ఇంటికి వచ్చింది.


బెంగాలీకన్య—పద్దెనిమిది పందొమ్మిదేళ్లు దాటినా ఇంకా వివాహం చేసుకోలేదు—బహిరంగంగా కాళ్లకు మోజాలు వేసుకుంటుంది—ఖాద్యాఖాద్య విచక్షణ లేదు—అని గ్రామస్థులు చాటుగా విమర్శించ మొదలుపెట్టారు ఒకవైపున; రెండో వైపున మూడిదలూ కానుకలూ తీసుకుని ఒక్కరొక్కరే జమీందారిణి దగ్గరకు వచ్చి అనేకవిధాల తమ ఆనందాన్నీ, శుభకాంక్షనూ వెల్లడించటం మొదలు పెట్టారు.

ఇలా అయిదారు రోజులు గడిచినై. ఆనాడు ఉదయం విజయ టీ తీసుకుని క్రిందహాల్లో కూచుని విలాసునితో, జమీందారీకి సంబంధించిన విషయమేదో

మాట్లాడుతుండగా నౌకరువచ్చి 'ఎవరో పెద్దమనిషి తమను చూడగోరుతున్నా' రని విజయతో చెప్పాడు.

''ఇక్కడికి తీసుకుర''మ్మని విజయ చెప్పింది.

ఈ మధ్య విజయను చూడటానికి చాలామంది పెద్దమనుషులు – ఆమె రైతులు – రోజూ వస్తున్నారు. అందుచేత, మొదట ఆమె ఈవార్తకు అంతగా ప్రాముఖ్యత ఇవ్వలేదు. కాని ఒక్కక్షణం గడిచిన తర్వాత నౌకరువెంట లోపలికి వచ్చిన వ్యక్తిని చూసేవరకు విజయకు ఆశ్చర్యం వేసింది. అతని వయస్సు 24, 25 ఏళ్లు ఉండవచ్చు. మనిషి పొడుగు, దానికి తగిన లావులేదు–బక్కపలచగా ఉన్నాడు. బంగారపు వర్ణం, మీసాలూ గడ్డం గొరిగించాడు, కాళ్ళకు



చెప్పులు, వొంటిని చొక్కాలేదు. వేసుకున్న ఖద్దరుశాలువా సందులోంచి జందెం కనపడుతున్నది. అతను చిన్న నమస్కారం ఒకటిచేసి కుర్చీలాగి కూర్చున్నాడు. ఇదివరకు ఈమెను చూడటానికి వచ్చిన పెద్దమనుషులెల్లా దక్షిణ తీసుకునే వచ్చారు. అంతేకాదు, వాళ్లు చాలా సంకోచిస్తూ లోపలికి వచ్చారు. కాని ఈవ్యక్తి ప్రవర్తనలో సంకోచమెంతమాత్రం లేదు. అతని రాకకు ఒక్క విజయే కాదు, ఆశ్చర్యపడింది. విలాసునికూడా ఆమెకంటే ఎక్కువ ఆశ్చర్యం కలిగింది. విలాసుడు తరుచుగా గ్రామంలో ఉండనప్పటికీ ఈచుట్టుపక్కలవారి నందరినీ

ఎరుగు. కాని ఈ యువకుడు అతనికి బొత్తిగా అపరిచితుడు. ఆ వచ్చిన వ్యక్తే ముందు మాట్లాడాడు:-"మీ పొరుగు పూర్ణగంగూలీ మా మామగారే. మీ ప్రక్క ఇల్లే వారిది. తాత ముత్తాతల నాటినించీ చేసుకుంటూ వస్తూఉన్న దుర్గాపూజ ఈనాడు మీరు ఆపమని ఉత్తరువిచ్చారని వినేవరకు నాకు ఆశ్చర్యంవేసింది. దీని భావమేమిటో కొంచెం చెప్పతారా?" అని రెప్పవాల్చకుండా విజయ ముఖం వంక చూశాడు.

ఈ ప్రశ్న, ప్రశ్నించే ఈధోరణీచూసేవరకు విజయకు ఆశ్చర్యంవేసింది; లోలోపల విరక్తీకూడా చెందింది. కాని జవాబేమీ ఇవ్వలేదు.

దీనికి జవాబిచ్చింది విలాసుడు. అతను పెళుసుగా—"మీరు మీమామ తరపున పోట్లాడటానికి వచ్చారా? అయితే మీరు ఎవరితో మాట్లాడు తున్నారో మాత్రం మరిచిపోవద్దు" అన్నాడు.



వచ్చినవ్యక్తి ముందు నవ్వి తర్వాత నాలుక కరుచుకుని — "ఆ సంగతి మరిచిపోలేదు. అదీకాక నేను పోట్లాడ టానికికూడారాలేదు. ఈమాట నేను నమ్మలేదు కనకనే, నిజమెంతో కను క్కుపోదామని వచ్చాను." అన్నాడు.

'ఎందుకు నమ్మకంకలగలేదూ నీకూ?' అన్నాడు విలాసుడు వెటకారంగా.

"ఎలా కలుగుతుంతో చెప్పండి? అనవసరంగా పొరుగింటివారి మతవిశ్వా సాలకు అడ్డువస్తారని ఎందుకనుకుంటాను?"

మత విశ్వాసాలను తర్కించటమంటే విలాసునికి చిన్నప్పటినించీ చాలా ఇష్టం. అతను ఉత్సాహంతో ప్రకాశించాడు

"మాకు అనవసరంగా కనిపించినంత మాత్రంచేత, ఇంకొకరికి అందులో అర్ధముండదనీ, మీరు మతమని అన్నంత మాత్రంచేత అందరూ దాన్ని నెత్తిమీద పెట్టుకుని ఆరాధిస్తారనీ అనుకోవటానికి నాకుహేతు వేమీ కనిపించలేదు. విగ్ర హారాధన మాకు మతంకాదు - దాన్ని నిషే నిషేధించటం మేము అన్యాయమని కూడా ఎంచము," అన్నాడు, విలాసుడు వెటకారంగా.

ఆగంతకుడు మహావిస్మయంతో విజయముఖం వంక చూసి— "మీరుకూడా ఇదే అంటారా?" అని అడిగాడు.

అతని ఈవిస్మయం విజయను నొప్పించింది. కాని, ఆమె దాన్నిదాచి, మామూలు గొంతుతో—"దీనికి విరుద్ధంగా నేను ఉత్తరువిస్తాననే ఆశతోనే వచ్చారా మీరు?" అన్నది.

విలాసుడు సగర్వంగా నవ్వి—"అలాగేఉంది. చూడగా, వీరిది ఈదేశం కానట్టుగా ఉంది—బహుశా మిమ్మల్ని గురించి ఏమీ ఎరిగి ఉండకపోవచ్చు!" అన్నాడు.

ఆగంతకుడు క్షణకాలం విజయముఖం వంక నేచూసి, ఆమె నుద్దేశించే అన్నాడు:—"నాది ఈదేశమేకాని ఈవూరివాణ్ణి మాత్రంకాను. ఇదిమాత్రం నిజం. అయినా ఈజవాబు మీదగ్గరినించి వస్తుందని నేను ఆశించలేదు. విగ్రహారాధన సంగతి మీరు ఎత్తకపోయినప్పటికీ, సాకార నిరాకార ఉపాసనలమీద జరుగుతున్న వెనుకటి చర్చ మళ్లీ నేను లేదలచలేదు. మీరు బ్రాహ్మసమాజీకులని కూడా నాకు తెలుసు. కాని, దానికీ దీనికీ సంబంధమేమీ లేదు. గ్రామస్థులకు ఇదొక్కటే ముఖ్యమైన పండుగ. ఈ మూడురోజులకోసం వారు సంవత్సరంనించీ ఎదురుచూస్తూ కూచుంటారు. అని ఇంకోమాటు విజయవంక తీక్షణంగా చూసి అన్నాడు:—" ఈగ్రామంమీది. ఇక్కడి ప్రజలు మీకు సంతానంలాంటివాళ్లు. మీరు ఇక్కడికి రావటంవల్ల వాళ్ళ ఆనందోత్సవాలు పూర్వంకన్న ఇమ్మడిగా చేసుకోవచ్చునివారు అనుకుంటారు. అది అలా ఉండగా ఉత్సవాలు అసలే ఆపి తమ నింత దుఃఖపెడతారని వారు అనుకునే ఉండరు. నేనుకూడా నమ్మలేక పోయాను."

విజయ వెంటనే జవాబివ్వలేకపోయింది. పీడిత ప్రజలనామం వినేవరకు ఆమె కోమల హృదయం బాధతో నిండిపోయింది. ఒక్కక్షణం ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. విలాసబాబు విజయముఖంలో మార్పు చూసి లోలోపల మండిపోయాడు. అతను కొంచెం తొందరపాటుతో నిర్లక్ష్యంగా అన్నాడు:

"మీరు చాలా మాట్లాడారు. సరే, సాకారనిరాకార తత్వాలు మీతో చర్చించటానికి మాకుతీరికకూడా లేదు. అదలా గంగలో కలవనివ్వండి. ఇక మీ మామగారు వారింట్లో ఒక బొమ్మనుకాదు, నూరు బొమ్మల్ని పెట్టి పూజచేసుకోవచ్చు. మాకేమీ ఆటంకంలేదు. పోతే రాత్రింబగళ్లూ వీరి చెవిక్రింద తప్పెట్లూ తాళాలూ పెట్టి వేధించటం దగ్గరనే వచ్చింది చిక్కు."

ఆగంతకుడు మందహాసంచేసి—"అహోరాత్రు లెప్పుడూ మేళాలుఉండవు. కాని ఉత్సవమన్న తర్వాత అల్లరిలేకుండా ఉండదు!" అని, ముఖ్యంగా విజయ నుద్దేశించి మళ్లీ అన్నాడు:—"కొంచెం ఇబ్బందిగాఉంటే ఉండనివ్వండి. మీది మాతృజాతి. ఇలాంటి ఆనందోపద్రవాలు మీరు సహించకపోతే ఇంకెవరు సహిస్తారు?"

# సిమ్లా నాటకం

(23-వ పేజీ తరువాయి)

తరఫున సమావేశానికి హాజరయినాడు. గాంధిమహాత్ముడు సమావేశానికి హాజరు కావటంలేదని తెలిసినప్పుడే అందరికీ మొహాలువాడినై. కాని జిన్నాకు మరీ కష్టం కలిగింది. వ్యక్తిగతంగా కాకపోయినా రాజకీయంగా గాంధీమహాత్ముడిని ఎప్పుడూ జిన్నా తనతో సమానంగా వేసుకునేవాడు. ఇప్పుడు ముస్లింలీగు తరఫున తను అయితే కాంగ్రెసుతరఫున అజాద్. జిన్నా అజాద్‌తో సమానమైనాడన్న మాట జిన్నా దృష్టిలో—జిన్నా అజాద్‌ను చూడగానే అటు తిరిగాడంటే ఆశ్చర్యంలేదు!

తాత్కాలికంగాగానీ, శాశ్వతంగాగానీ జాతీయకు విరుద్ధంగావుంటే ఏ ప్రణాళికనూ కాంగ్రెసు వొప్పుకోదనీ, ఏ ప్రణాళికనైనా ఆమోదించటానికి ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీకీ హక్కుగలదనీ, మొదలైనవి అజాద్ సూచించాడు. మాటల సందర్భంలో జిన్నా కాంగ్రెసు అంతా హిందువులే అన్నాట్ట. ఆపైన ఖాన్ సాహెబ్ లేచి తను మహమ్మదీయుడా లేక హిందువా అని ప్రశ్నించాడు!

సిమ్లాలో సమావేశం జయప్రదంగానే ముగుస్తుందని అభిప్రాయపడ్డారు. కారణం వైస్రాయి మాటల మనిషికాక క్రియాపరుడుగా వ్యవహరించుటమూ అసలు సమావేశానికి ఆహ్వానించిన వారంతా రావటమూ, హాజరయిన నాయకుల సంభాషణ వాతావరణమూ అన్నీ ఆశనే హెచ్చించినై. కాని హిందూ మహాసభ వాళ్ళు ఈ సమావేశానికి ప్రతికూలంగా ప్రచారం చేస్తూనేవచ్చారు. రాజగోపాలచారిని ఒకతను లాఠీ తీసుకున్ని ఎదరించబోయినాడు! రాజగోపాలాచారి కాగితాలు కూడా ఎత్తుకుపోయినాడు!

సమావేశం మొదట్లో అన్ని పక్షాలవారూ చాలా షరతులను వొప్పుకున్నారు. పేర్లు ఇయ్యటం దగ్గిరే పేచీ వచ్చింది. "సవర్ణ హిందువుల" సమస్య తీవ్ర స్వరూపం దాల్చటంచేత "సవర్ణహిందువులు" అన్నపదం "హిందువులు" గామార్చబడింది. అయినా సమస్య తీరలేదు. ఈ చిక్కువిడిపోతే సమావేశం జయప్రదమైనట్టే.

అంతలో జిన్నా గోవింద వల్లభ పంత్‌ను కలుసుకుని మాట్లాడాలని సూచించాడు. జిన్నా పంత్ సంప్రదింపులు జరిగినై. కాని సఫలంకాలేదు. సమావేశం జూన్ 29 తేదీన కలుసుకున్నప్పుడు కాంగ్రెసు అధ్యక్షుడు, ముస్లిలీగు యక్షుడూ సభ్యులను ఎన్నుకోవటంలో ఒడంబడిక కుదరలేదని విశదీకరించారు. వైస్రాయి అందరినీ తమ తమ సభ్యుల సూచనలను జూలై 6వ తేదీన ఇయ్యమని కోరాడు. సమావేశము మళ్ళీ జూలై 14వ తేదీన కలుసుకోటానికి ఏర్పాట్లు జరిగినై. ఈలోపల అజాద్ జవహరలాల్ నెహ్రూను త్వరగా సిమ్లా రమ్మని ఫోను ద్వారా పిలిచాడు. కాంగ్రెసు వర్కింగుకమటీ సిమ్లాలో హాజరుకాబడింది. చివరకు కాంగ్రెసు సభ్యుల విషయమై తమ సూచనలు చేసింది. ముస్లింలీగు తమ సభ్యులని సూచించలేదు. యూరోపియను ప్రతినిధికూడా ఏపేర్లు ఇయ్యలేదు. మిగతా వారంతా తమ తమ పేర్లు ఇచ్చారు.

సమావేశం తిరిగి జూలై 14వ తేదీన కలుసుకున్నప్పుడు వైస్రాయి సమావేశం భగ్నమయిందని చెప్పాడు. ఇది జయప్రదం కాకపోవటానికి ఎవ్వరితప్పూ లేదనీ, సమావేశం జయప్రదం అయినట్లయితే తనకే ప్రశంస వచ్చేదని అందుకని అది విఘ్నంకావటం ఇతరువల్లనని తనుచెప్పలేనని వైస్రాయి వుద్దేశం.

అన్ని పక్షాలవారూ ఈ సమావేశానికి హాజరయి విశ్వప్రయత్నం చేసినా ఇది జయప్రదంకాలేదు. కారణం వూహించటం అసాధ్యంకాదు.

మొదటి సంగతి దేశాయి-లియాకత్ ప్రణాళిక కాంగ్రెసు లీగు పక్షాల సమానం సభ్యత్వంమీద ఆధారపడింది. వేవెల్ ప్రణాళిక హిందూ ముస్లింల సమానత్వంమీద ఆధారపడింది. దాస్యంలోవున్న భారత దేశంలోతప్ప మరే దేశంలోనూ ఇటువంటి ప్రణాళిక తయారుకాదు. మొత్తంజనాభాలో మూడు వంతులున్న హిందువులతో ముస్లింలకు సమాన సభ్యత్వం! అప్పటికీ ఏజాతినుంచి ఎంతమంది సభ్యులు అన్న ప్రశ్నలేనేలేదు. కాని వారే రాజకీయతత్వం కలవారు అన్నది ముఖ్యమైనది అని అజాద్ అన్నాడు. ముస్లింలీగు రాజకీయాలు మహమ్మదీయులను దాటిపోవు. ఏ ముస్లింలీగు నాయకుడు మాట్లాడినా దేశవిభజన, పాకిస్తాను తప్ప దాస్య విముక్తి, దేశక్షేమం-ఈ సంబంధం వుండదు. భారతదేశానికి దాస్యవిముక్తి విషయమై ముస్లింలీగుకు అట్టేపట్టదు. గదిలో మరోడులాంతరూ కిరసనాయలూ తెస్తే వీడూ చదువుకునే రకం—కిరసనాయిలుకోసం వీడే ప్రయత్నం చెయ్యడు. కిరసనాయలు లేకపోతే వీడూ చీకట్లో వుండటానికి అభ్యంతరం లేదు! అలాంటి ముస్లింలీగు ఎప్పటికప్పుడు రక్తం ధారపోసి, స్వాతంత్ర్య సమరంలో మడియటానికి వెనుదీయని కాంగ్రెసుతో సమానం చేయబడటం ఏం ధర్మం—ఏం రాజనీతి ?

అయితే భూలాభాయి వుద్దేశప్రకారం తన ప్రణాళికకంటె వేవెల్ ప్రణాళిక మెరుగైనదని. కారణం కాంగ్రెసు సభ్యులలో మహమ్మదీయులుకూడా వుండటంవలన కాంగ్రెసుకు లీగుకు సమాన సభ్యత్వం ఉన్నట్లయితే మొత్తం మహమ్మదీయుల సంఖ్య హిందువులకంటె ఎక్కువవుతుంది, వారే రాజకీయ పక్షానికి చెందిన వారైనప్పటికీ. వేవెల్ ప్రణాళికలో ఈ చిక్కులేదు. హిందువులకూ మహమ్మదీయులకూ సమాన ప్రాతినిధ్యం వున్నదని దేశాయి వుద్దేశం! ఇక్కడే పొరబాటు. దేశాయి ప్రణాళిక అమలులోనికి వస్తే ప్రభుత్వం రాజకీయ పక్షాలమీద ఏర్పడుతుంది కాని జాతికులాలమీద ఏర్పడదు. అసలు భారతదేశానికి పట్టుకున్న దరిద్రమే ఈ జాతికులాల భేధం. ఇది అందరూ తెలుసుకున్నారు. అయినా ఈ రోజున దేశంలో ఈజాతికులాల భేదం చిరస్థాయిగా ప్రభుత్వంద్వారా ఏర్పాటకాబోతున్నదన్నమాట! దీంతోగాని భారతీయులకువున్న అడుగూబాడుగూ శ... అడుగంటదు! వేవెల్ ప్రణాళికలోని సుడిగుండం ఇదే. అయితే బ్రిటిషువారు ఇంత ప్రమాదకరమైన ప్రణాళిక ఎందుకు ఏర్పాటుచేశారు? ఇంత సామ్రాజ్యాన్ని సంపాదించిన బ్రిటిషువారికి ఈ మాత్రం రాజకీయాలు అర్థంకావా? అర్థం అవుతయ్యి కనకనే అలా చేశారు!

అదీకాక సిమ్లా సమావేశంలో హాజరయిన సభ్యులు తమతమ సభ్యుల సూచనల్ని వేవెల్ కియ్యాలి. కాంగ్రెసు 3 హిందువులు, 2 మహమ్మదీయుల పేర్లు

ఇయ్యొచ్చు. ముస్లింలీగు 5 మహమ్మదీయుల పేర్లే ఇస్తుంది. కాని వేవెల్ ప్రణాళిక ప్రకారం ఇవి ఆమోదించబడాలని లేదు. ఈ పేర్లను తీసుకుని ప్రభుత్వంలో మొత్తంమీద 5 గురు మహమ్మదీయులు, 5 గురు హిందువులు వుండేటట్టు చూస్తాడు వైస్రాయి. అంటే ఈ 5 హిందువులలో కాంగ్రెసువారే వుండనక్కరలేదు. అందులో హిందూ మహాసభ వారుకూడా వుండచ్చు. అలాగే 5 మహమ్మదీయులలో ముస్లింలీగువారే వుండనక్కర్లేదు. అందులో కాంగ్రెసు మహమ్మదీయులుకూడా వుండచ్చు. ఇది వేవెల్ ప్రణాళిక. కాంగ్రెసు దీనిని స్వీకరించటానికి కారణం హిందువులకూ మహమ్మదీయులకూ సమాన సభ్యత్వం వున్నప్పటికీ కాంగ్రెసు జాతీయత చెడకుండా మహమ్మదీయ సభ్యులలో కాంగ్రెసు మహమ్మదీయులు కూడా వుండటానికి అవకాశం వున్నది కాబట్టి. ఆ కారణంచేతనే దీన్ని పరిశీలించటానికే అజాద్ సిమ్లా సమావేశానికి హాజరయినాడు. అలాకాక కాంగ్రెసు మహమ్మదీయులు అసలు మహమ్మదీయుల సభ్యులలో వుండటానికి వీల్లేదని మొదటే స్పష్టమయినట్లయితే అసలు కాంగ్రెసు సమావేశానికి హాజరే అయ్యేది కాదని ఘంటాపథంగా చెప్పచ్చు.

అయితే ముస్లింలీగు ఎందుకు హాజరయినట్టు? ప్రభుత్వపు సభ్యులలోవున్న మహమ్మదీయులలో అందరూ ముస్లింలీగువారే అవుతారని ఎక్కడాలేదు. అలాంటప్పుడు విపరీతమైన జాగ్రత్తకల జిన్నా ఏ వుద్దేశంతో సమావేశానికి హాజరయినాడు? బహుశా ఈ సంగతి తెలిసే ప్రభుత్వంలోని మహమ్మదీయులంతా ముస్లింలీగువారే కావాలని పట్టుపట్టటానికే వెళ్ళివుండచ్చు జిన్నా. దీన్నిపట్టి కాంగ్రెసు లీగులదృష్టి అర్థం అవుతుంది ఎవరెవరు ఏఏ వుద్దేశాలతో సమావేశానికి హాజరయినారో. అదికాక ఇంతవరకూ ఎన్నడూ కాంగ్రెసు బ్రిటిషు ప్రభుత్వంతో "సరే" అనలేదు. ఆ కారణంచేతనే కాంగ్రెసు తన విప్లవతత్వం చెడగొట్టుకోకుండా దేశంలో ప్రజాబాహుళ్యానికి స్వరాజ్యకాంక్షను ప్రేరేపించి, చిలవలూ పలవలూ వేయించింది. కాంగ్రెసుకు అఖండమైనశక్తి చేకూరింది. ప్రపంచంలోని అన్నిరాజకీయ పార్టీలలోనూ కాంగ్రెసు ప్రథమస్థానం అలంకరిస్తుందని ఏభారతీయుడూ మరవకూడదు. అలాంటిపార్టీ ఈ రోజున సిమ్లాసమావేశానికి హాజరవుతున్నది! అయితే వేవెల్ ప్రణాళికను కాంగ్రెసు ఆమోదిస్తుందని ఎక్కడవుంది? ఈ వుద్దేశ్యాన్ని మనస్సులో వుంచుకుని జిన్నా సమావేశానికి హాజరయి వుండచ్చు. కాంగ్రెసు బ్రిటిషువారితో "సరే" అనకపోతే జిన్నా కాంగ్రెసుతో "సరే" అనక గొప్పవాడయి కూచున్నాడు! ఇదివరకట్లా కాంగ్రెసే ఆటో ఇటో తేలుస్తుండేది. క్రిప్స్ సూచనలు కాంగ్రెసు నిరాకరించింది. ముస్లింలీగూ నిరాకరించింది! ఇప్పుడుమటుకు కాంగ్రెసు జిన్నా అనుకున్నట్టు ప్రవర్తించలేదని తోస్తుంది. కాంగ్రెసువారు వేవెల్ ప్రణాళికను ఆమోదించటమే కాక ఈవిషయంలో సిమ్లా సమావేశంలో వారుచూపిన స్నేహభావం అతింతా కాకపోవటంవల్ల జిన్నాకు వూపిరాడలేదు! కాంగ్రెసు నీడలో నడ

వటం నేర్చుకున్న ముస్లింలీగు నీడంత త్వరగా కదలలేకపోయింది. చదరంగంలో అవతలవాడు వేసే ఎత్తే ఇవతలవాడువేస్తే ఇవతల వాడికేనష్టం! మరో ఎత్తులో అవతలవాడి ఆటకట్టచ్చుగాని ముందరేవీడి ఆటకట్టి కూచుంది. ముస్లింలీగు సంగతి అంతే అయింది, ఈసిమ్లా సమావేశంలో బైటపడ్డట్టు ముస్లింలీగు ఎన్నడూ బైట పడలేదు. ముస్లింలీగును ప్రపంచంఅంతా నిరసించింది. దీనికి కారణం ప్రణాళికలో మార్పులు చెయ్యగలనన్న జిన్నా అహంకారమూ, కాంగ్రెసు ఎలా ప్ర[illegible] స్తుందో జిన్నా వూహించుకోలేకపోవటమూ!

చివరకు అసలుపేచీ సభ్యత్వందగ్గిరే వచ్చింది. కాంగ్రెసు వర్కింగు కమిటీ సమావేశమయి కాంగ్రెసు ప్రభుత్వపు సభ్యుల పేర్లు సూచించింది: ఇందులో 3 కాంగ్రెసు హిందువులు (నెహ్రూ, పటేలు, రాజేంద్రప్రసాద్) 1 హిందుమహాసభ హిందువు (ముఖర్జీ) 2 కాంగ్రెసు మహామ్మదీయులు (అజాద్, అసఫాలీ) వీటితోపాటు ఇంకా పేర్లు ఇచ్చింది కాని అది అనవసరం. కాంగ్రెసు ఇద్దరు కాంగ్రెసు మహమ్మదీయుల పేర్లు ఇయ్యకుండా ఒక్క పేరే ఇచ్చి రెండో మహామ్మదీయుడిని (కాంగ్రెసులోకి హిందువైన ముఖర్జీని సూచించినట్లు) ముస్లింలీగు సభ్యుడూ, కాంగ్రెసు సభ్యుడూ కాని వాడిని సూచించితే బాగుండేది. ముస్లింలీగు వున్న మహమ్మదీయు లందరికీ ఏకైక పార్టీ కాదని నిర్వివాదాంశం. అయితే కాంగ్రెసులోనూ, ముస్లింలీగులోనూవున్న మహమ్మదీయులే కాక ఇతర మహమ్మదీయ పార్టీలకు చెందిన మహమ్మదీయులు కూడావున్నారు. వీరి తరపున ఒక మహమ్మదీయుడిని సూచించినట్లయితే ఫలితం ఏమయినప్పటికీ బాగుండేది. ఈసందర్భంలో ఎవరేమన్నా కాంగ్రెసు పొరబాటే చేసింది. పోతే కాంగ్రెసు ముస్లింలీగు తరపునకూడా మూడుపేర్లు ఇచ్చింది. ఒకటి జిన్నా, రెండు లియాకత్. జిన్నా పేరు కాంగ్రెసు సూచించిందని తెలియగానే జిన్నాకు అరికాలుమంట నెత్తికి వచ్చిందట! కాంగ్రెసు అలా చెయ్యటం తనకి పరాభవమని జిన్నా అభిప్రాయం, అంతవుక్రోషం దేనికి? అజాద్, అసఫాలీ మొదలైనపేర్లు సూచించి కాంగ్రెసునుకూడా పరాభవించి పగ తీర్చుకోమని ఒకపత్రిక జిన్నాకు సలహా ఇచ్చింది అలాంటిదేమీ చెయ్యకపోవటమే కాక చివరకు జిన్నా తన పేరుకూడా సూచించుకోలేదు!

ముస్లింలీగు వైస్రాయికి ఏపేరూ ఇయ్యకపోవటానికి కారణం అవి ఆమోదించబడతయ్యని భరవసా వైస్రాయి ఇయ్యకపోవటమే! ఈ సంగతి తేల్చుకోటానికి జిన్నా సిమ్లాదాకా వెళ్లనక్కర్లేదు. వేవెలు ప్రణాళికలో అలాంటి భరవసా ఎవ్వరికీ ఇయ్యబడలేదు. కాంగ్రెసు సూచించినపేర్లు ఆమోదింపబడతయ్యని ఎక్కడాలేదు. అయినా కాంగ్రెసు పేర్లు ఇచ్చింది. అదీకాక జిన్నాకు మూడుసమస్యలు పట్టుకున్నయి. ముస్లింలీగు మహమ్మదీయు లందరిపక్షానవున్న పార్టీ అవునాకాదా? కాదని వేవెల్ జవాబు. ముస్లింలీగు సూచించే పేర్లు 5 ఆమోదించబడతయ్యా? పడదని జవాబు. ముస్లింలీగు ఈ ప్రణాళికను ఆమోదించక దూరంగావుంటే ఏం జరుగుతుంది? ఆలోచించాలిసినవిషయమని జవాబు. నువ్వు వున్నాలేకపోయినా ఈ ప్రణాళిక అమలులోకి వస్తుందని వేవెల్

జిన్నాకు చెప్పినట్లు ఒక వదంతి వుంది. ప్రణాళిక ప్రకారం 5 మహమ్మదీయు లన్నూ సూచించటానికి ముస్లింలీగుకే అధికారంవుందని జిన్నాపట్టుదల. దీనికి పోటీగా పంజాబు ప్రధానమంత్రి పంజాబు యూనియనిస్టు మహమ్మదీయుడని ఏర్పాటు చెయ్యాలంటూ వచ్చాడు. జిన్నాకు కాంగ్రెసుఅన్నా పడదూ పంజాబు అన్నా పడదూ! ఇదివరకే జిన్నాకు ఈ ప్రధానమంత్రి చేతిలోనే వుల్టాసీదా అయింది. జిన్నా తనపట్టు విడవలేదు. వైస్రాయికీ జిన్నాకూ జరిగిన సంభాష ణల్లో జిన్నా ఏ ఇద్దరు మహమ్మదీయులు వ్యతిరేకించినా వైస్రాయి తన 'వీటో' వుపయోగించాలని కోరాట్ట. దీన్నిబట్టిచూస్తే జిన్నా ఎంత మొండితనం చూపిందీ వూహించవచ్చు. జిన్నాకు ఏ పార్టీనిచూచినా నమ్మకంలేదు. దేశంయావత్తూ అతనికి ప్రతికూలం అని జిన్నా తేల్చుకున్నాడు. అంటే జిన్నా వుద్దేశాలు, సూచనలు అంత నాజూకైనవి అన్నమాట! మహమ్మదీయుల కిలాంటి నాయ కత్వం వుండటం మహమ్మదీయులకే నష్టం!

మొత్తంమీద ముస్లింలీగు చివరకు మహమ్మదీయుల పేర్లుకూడా ఇయ్యలేదు. అయితే వేవెల్ జిన్నాకు కొన్ని పేర్లు చూపించాడు. అవి ఇతర పార్టీలు ఇచ్చిన పేర్లుకావు. ఇతర పార్టీలు ఇచ్చిన పేర్లు ఆధారంచేసుకుని వైస్రాయి తను సూచిం చబోయేపేర్లు. ఇలాచెయ్యటానికి వైస్రాయికి అధికారంవుందని మొదటే సిద్ధాం తంచెయ్యబడింది. ఆ మహమ్మదీయపేర్లలో ఒక పంజాబు యూనియనిస్టు పేరు వుంది! దీనికి జిన్నా సుతలామూ వొప్పుకోలేదు. వేవెల్ ఆ పేరువుండక తప్ప దన్నాడు! సమావేశం భగ్నమయింతరువాత జిన్నా ఈసంగతి చెప్పాడు. కాంగ్రె సైనా తన మహమ్మదీయుల సభ్యుల్ని 5 మహమ్మదీయ పేర్లలోలేకుండా చెయ్య టానికి వొప్పుకుంది కాని పంజాబుమాత్రం తన పేరు 5 మహమ్మదీయ పేర్లలో వుండి తీరాలని పట్టుపట్టిందని జిన్నావుద్దేశం. ఇక్కడ ఒక చిన్న కిటుకువుంది. కాంగ్రెసు 5 మహమ్మదీయ పేర్లలో తన మహమ్మదీయ సభ్యుల్ని లేకుండా చెయ్య టానికి వొప్పుకున్నదనికాదు. ఒకవేళ కాంగ్రెసు మహమ్మదీయుల పేర్లు సూచిం చినా వాటికీ వేవెల్ ప్రణాళికలోవుండవలసిన 5 మహమ్మదీయులకూ సంబంధం వుండదు. అంటే చివరకు ప్రభుత్వపు మొత్తం సభ్యులలో హిందువులకన్న మహ మ్మదీయుల సంఖ్య ఎక్కువగా వుండటానికైనా కాంగ్రెసు సంసిద్ధ మయేదన్న మాట! అంతేకాని కాంగ్రెసు మహమ్మదీయుడు లేకుండా వుండటానికి కాంగ్రెసు ఎప్పుడూ వొప్పుకోలేదు. ఈ విషయంలో ప్రపంచం తల్లకిందులయినా కాం గ్రెసు కేవలం హిందువుల సంఘమే అనే పర్యవసానంకలిగేపని కాంగ్రెసు ఎన్న డూ చెయ్యదని అజాద్ కచ్చితంగా చెప్పాడు.

అయితే వేవెల్ ప్రణాళికలో హిందువులకన్న మహమ్మదీయులకు ఎక్కువ సభ్యత్వం వుండటానికిప్పీల్లేదు. అన్ని పార్టీలవారూ వొప్పుకొని మహమ్మదీయుల సంఖ్య ఎక్కువకావాలని సూచించినా సమావేశం భగ్నమయితే ఆ తప్పు వైస్రా యిమీదికివచ్చేది. కాని అలా జరక్క జిన్నావుద్దేశం ప్రకారం అది పంజాబు ప్రధానమంత్రి మీదికివచ్చింది! వేవెల్ కాంగ్రెసు మహమ్మదీయుడికోసం పట్టు పట్టం క్షమింపరాని అపరాధమని జిన్నా అభిప్రాయం. ఏదైనా జిన్నా ఇది

వరకూ, ఇప్పుడూ పంజాబుచేతిలోనే దెబ్బ తిన్నాడని జిన్నావుద్దేశం ప్రకారమే తేలుతుంది!

అయితే పంజాబు ప్రధానమంత్రి దీనికి అంగీకరించడు. మహమ్మదీయు లందరితరఫునా మాట్లాడటానికి జిన్నాకు అధికారంలేదని పంజాబుమంత్రి అభిప్రాయం. నిజం ఆలోచిస్తే అలాగేవుంది. మహమ్మదీయులకు బలిమివున్న ప్రదేశాలు వుత్తరసరిహద్దు రాష్ట్రం, పంజాబు, సింధు, బెంగాలు, అస్సాము రాష్ట్రాలు. వుత్తరసరిహద్దు రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వం, పంజాబులో యూనియనిస్టు ప్రభుత్వం, బెంగాలులో నిరంకుశప్రభుత్వం వున్నాయి. సింధులో ముస్లింలీగు కాంగ్రెసు అండతో మెలగగలుగుతున్నది. పోతే జిన్నా అధికారం ఎక్కడ? గిరీశం చెప్పినట్టు ఎక్కడోవుంది! కాని ఈనాడు జన్న ఎన్నికలు జరిగితే మహమ్మదీయులంతా తనపక్షానే చేరతారని జిన్నా వాదన. అది నిజంకావచ్చు; అది నిరూపించటానికి అవకాశం ఇయ్యమని రాజగోపాలాచారి వాదన! కేంద్ర ప్రభుత్వం స్థాపించబడితే ఎన్నికలు మూడునాలుగురోజులలో ఏర్పాటుచెయ్యొచ్చు— అప్పుడు నిజానిజములు తేలగలవు అని రాజాజీ వాదన. జిన్నా దానికే వొప్పుకోడు. జిన్నాకే అనుమానం వుండాలి నిజంగా మహమ్మదీయులంతా తనపక్షమా అని. సిమ్లాలో లీగు కమిటీలోనే రెండు పార్టీలు ఏర్పడినై. అయితే చెట్టులేని చోట ఆముదపుచెట్టే మహావృక్షం అన్నట్టు నాయకుడులేని ముస్లింలీగుకు జిన్నా తప్ప గత్యంతరం లేకపోవటంవల్ల ముస్లింలీగు జిన్నా అభిప్రాయాలకు వొప్పుకోక తప్పలేదు!

కాని చిత్రమేమిటంటే అన్ని పార్టీలవారూ పేర్లు ఇచ్చి వేవెల్ ప్రణాళికను ఆమోదించినా ఒక్క జిన్నా వొప్పుకోకపోవటంవల్ల సమావేశం భగ్నం కావటం! జిన్నా వొప్పుకోకపోతే సమావేశం భగ్నం అయేమాటే నిజమైతే ఇంతదూరం, ఇంతశ్రమ పడక్కర్లేదని రాజగోపాలాచారి చెప్పాడు. జిన్నా దేనికైనా అంగీకరిస్తాడన్న నమ్మకం ఎవ్వరికీలేదు, జిన్నా హస్తవాశి చవిచూచిన వారిలో. 5 మహమ్మదీయపేర్లు ముస్లింలీగు సూచించటమేకాక వారందరూ ముస్లింలీగువారే అవాలని జిన్నా పట్టుపడతాడని అందరికీ తెలుసు. అయితే జిన్నా ఒక్కడూ దేశానికంతకూ ఎదురుకాగలడా అన్నది ప్రశ్న. అయినాడు మరి!

వేవెల్ అన్నింటికీ తయారయే భారతదేశం వచ్చాడని ప్రతీతి. అందుకనే నీవు లేకపోయినా ప్రణాళిక అమలులోకి వస్తుందని జిన్నాతో వైస్రాయి అన్నాడన్నవార్త చాలా ఆశగలిగించింది. ఇన్నాళ్ళకు జిన్నాకు తగినవాడు దొరికాడని అంతా అభిప్రాయపడ్డారు. కాని చివరకు అంతా నీటి బుడగమాదిరిగా ఐంది. దీనికి జిన్నాను నిందించి ప్రయోజనంలేదు. బ్రిటిషువారి అండ, ప్రేరేపణ లేకపోతే జిన్నాకు ఇంత విలువరాదు. వేవెల్ నీఅని ప్రయోజనంవుండదు. కారణం వైస్రాయి కేవలంకారణ మాత్రుడు కనక. అసలు బ్రిటిషువారికి నిజంగా భారతదేశంలో పరిస్థితులు మారాలన్న వాంఛవుంటే జిన్నా వంటివాళ్లు ఒక లెక్కా? ఇదివరకునుంచీ భారతీయులకు సభ్యత లేకపోవటమే కారణం అని చాటుతున్న

బ్రిటిషువారికి ఆమాట నిరూపించటానికి ఇంకో నిదర్శనం! విదేశాలలో నిజమైన భారతదేశపు పరిస్థితులు అవగాహనం చేసుకోటానికి అవకాశాలుండవు. వారందరికీ కనిపించేది భారతీయుల విభేదాలే. ఇంగ్లీషువారికి కావలిసినదే అది. ఇంకో దేశానికి సంబంధించాననుకునే జిన్నా భారతీయులతో ఎందుకు కలవాలి?

దేశాయి-లియాకత్ ప్రణాళికను బ్రిటిషువారు హిందూముస్లింప్రణాళికగా ఏ సదుద్దేశ్యంతో చేసినట్టు? ఇదే వేపగింజ! అయితే వేవెల్ ఇంత ఆశపుట్టేటట్టు చెయ్యటంకూడా మోసమేనా? కావచ్చు, కాకపోవచ్చు. వేవెల్‌ను అటుపంపి ఇంగ్లీషువారు వెనకతాడులాగి వుండవచ్చు. లేకపోతే భారతదేశపు పరిస్థితులు, జిన్నా విలువ వేవెల్‌కు కొత్తగాదు. గాంధీ తనకు వుత్తరంరాస్తే బ్రిటిషు గవర్నమెంటు దాన్ని ఆపలేదని సవాలుచేసిన జిన్నాను చెరువులోనించి చేపను బైటపడేసినట్టు గవర్నమెంటు పడేస్తే జిన్నా గిజగిజలాడాడు! అంత మహాత్యం కల జిన్నా ఎటువంటి పేచీలువేసేదీ వేవెల్‌కు తెలియకపోవు. వేవెల్ క్రియాపరుడు కనక, మొదటే వీటికి జాగ్రత్తపడి వుండవచ్చు. అయినా మధ్యలో అతని చేతులుకట్టివేసి వుండవచ్చు. ఆమెరీ ఆపాటిపని చెయ్యలేనివాడు కాడు. సామ్రాజ్య సంపాదన విషయాలలో ఆప్రదేశంలోవున్న సాటి బ్రిటిషువానిని త్యాగం చెయ్యటానికి ఇంగ్లీషువారెప్పుడూ సందేహించరు. ఇది త్యాగంచెయ్యబడ్డ బ్రిటిషువారుకూడా గౌరవంగానే భావిస్తారు. వేవెల్ కూడా అలా చెయ్యబడ్డాడో లేక మొదటినించీ పరోముఖ విషకుంభంగావున్నాడో ముందుకాని తెలియదు.

ఈ వేపగింజకు మామిడికాయలు కాయవని అనుకున్నవాళ్ళు బోలెడు మందివున్నారు. తెరవెనక ఎంత భాగోతం జరిగిందో తర్వాతగాని తెలియదు. ఫిరోజు ఖాన్, నూన్‌లూ సుల్తాన్‌అహమ్మద్‌లూ సెసిల్ హోటలు ప్రాంతాలలోనే తారట్లాడుతున్నట్టు వార్తలు. సిమ్లా సమావేశం జయప్రదమైతే వీరినోట కరక్కాయ! దీనికి వారెలా వొప్పుకుంటారు?

అది సఫలంకాకపోవటమే నయం. కాని నిజంగా జిన్నాకు పాకిస్తానే కావలిసి, జిన్నాకు ఆవగింజంత జాతీయతైనావుండి, ఈ వేవెల్ ప్రణాళిక ముస్లింలీగును మోసపుచ్చటానికి ఏర్పాటు చేయబడిందనే నమ్మకమే జిన్నాకు వుంటే ముస్లింలీగు ప్రవర్తనకాని, జిన్నావైఖరి కాని ఏ మాత్రం సబబుగాలేదు. మొదటి సంగతి పాకిస్తాను ఇంగ్లీషువారిస్తారనుకోవటం వట్టిభ్రమ. హిందువుల నించి మహమ్మదీయుల హక్కుల్ని కాపాడే ఇంగ్లీషువారు మహమ్మదీయుల్నించీ ఇతరుల హక్కుల్ని కాపాడటానికి ప్రయత్నం చెయ్యరూ? ఇతరుల హక్కుల్ని ముస్లింలీగు కాపాడితే మహమ్మదీయుల హక్కుల్ని హిందువులు కాని, కాంగ్రెసుకాని కాపాడలేదూ? వేవెల్ ప్రణాళిక ముస్లింలీగునుమోసపుచ్చటానికే ఏర్పాటయిందని జిన్నాకు అనుమానంవుంటే బ్రిటిషువారిని బైటపడెయ్యటానికి జిన్నాకు చాలా అవకాశంవుంది. తనమీదికి ఒక్కపిసరు నింద కూడా తెచ్చుకోకుండా, ముస్లింలీగు కాంగ్రెసుకలిసి సభ్యులపేర్లు సూచించితే వేవెలుకు వాటిని తిరస్కరించే ధైర్యంవుంటుందా?

కాంగ్రెసు వైఖరి మొదటినించీ సరియైనమార్గానే నడిచింది. కాంగ్రెసు పద్ధతివల్ల జిన్నా వైఖరేకాక బ్రిటిషువారి వైఖరికూడా ప్రపంచానికి తెలిసిపోయింది.

పోతే సిమ్లా నాటకంవల్ల తేలిన పర్యవసానం ఏమిటంటే జిన్నాకు ఏ భారతీయపార్టీలోగాని, ఏ భారతీయుడిలోగాని నమ్మకంలేదు. సిక్కులచేత నడపబడే మోటారులో ప్రయాణం చెయ్యటానికి జిన్నా వెనకాడాడంటే జిన్నా మానసికంగా ఏ స్థితిలోకి వచ్చాడో మనం వూహించుకోవచ్చు. ఏవిధమైన హామీఇచ్చినా జిన్నాకు తృప్తికలగదు. ఈరోజున జిన్నా వక్కడూ భారతదేశాభివృద్ధికి అడ్డుపడి నెగ్గగలిగాడు, అంటే బ్రిటిషువారు భారతదేశంలో అధికారం చెలాయించినంతకాలమూ జిన్నాతో భారతీయులకు సంధి నిత్యముకాదు!

———




మో హి ని

బి. ఎన్. కె. ప్రెస్, 43, ఆచారప్పన్ వీధిలో బి. నాగిరెడ్డిగారిచే ముద్రింపబడి అదేచోట బి. ఎన్. గుప్తగారిచే ప్రకటించబడింది. ఎడిటర్ : చక్రపాణి.

ఫేమస్ ఫిలిమ్స్‌వారి

వీణా ....
పృధ్వీరాజ్..
సితారా...
మజర్‌ఖాన్
దుర్గాఖోటే.
...నటించిన.



# ఫూల్
(FLOWER)

...FAMOUS FILMS CIRCUTE ...

NELLORE & 19.WOODS ROAD MADRAS



a VAUHINI Picture
DIRECTED BY
B.N.REDDI
నాగయ్య... జయమ్మ .. భానుమతి
నారాయణరావు... లింగమూర్తి... శివరావు.
నటించిన...
వాహినీ వారి
స్వర్గసీమ
వస్తున్నది......
CAMERA...BARTLEY..... SOUND...DINSHAW..... ART...NAGOOR
Studio..... NEWTONE